# శ్రీ రంగరాజ స్తవం

**Translation / Purport by: Srimaan SKV Ramacharyulu**
**Pratipadartham (word to word meaning) by: Srimaan Sribhashyam Srinivasacharyulu**

I thought, in order to provide food for thought I will message one shloka everyday from Rangarajan Stavamu Uttarasatakamu. As you all know, while the Purva Satakam of Rangarajan Stavamu describes Srirangam, the deities there etc. the uttaraagha Satakam deals mostly with Ramanuja Siddhantam. I will put only the brief meaning and in case any body wants to ponder over the depth of the inner meanings, that can be helped by seniors. For the sake of understanding of larger cross section of our group I will put them in Telugu although my Telugu typing is bad. Let us start.

శ్రీ పరాశర భట్టార్యః శ్రీ రంగేశ పురోహితః

శ్రీ రంగేశ పురోహితః

శ్రీ వత్సాంక సుతః శ్రీమాన్

శ్రేయసే మేస్తు భూయసే

ఇది మనకందఱకూ పరిచయమున్న శ్లోకమే

= = = = = = = = = = = = = = = == = = = = = = = == = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

**హర్తుమ్ తమస్సదసతీ చ వివేక్తుమీశో**

**మానం ప్రదీపమివ  కారుణికో దదాతి**

**తేనావలోక్య క్రుతినః పరిభుంజతే తమ్**

**తత్రైవ కేపి చపలాః శలభీ భవంతి** **1**

పరమ కారుణికుడైన భగవానుడు అజ్ఞానాంధకారమును తొలగించుకొనుటకు, సత్ అసత్ వివేకము పొందుటకు శాస్త్ర మను దీపమును ప్రసాదించేడు తద్వారా సుక్రుతులు తత్వ త్రయ జ్ఞానము కలిగి పరమాత్మను పొందుదురు కాని చపలురు (ఇతర మతస్థులు) దానియందే శలభముల వలె నశించెదరు

పూర్వ శతకము నందు ప్రమేయ నిరూపణము చేసి ఉత్తర శతకమున ప్రమాణ నిరూపణము చేయు చున్నారని అనుకొంటిమి కదా
ఆ ప్రమాణములనే దురుప యోగము చేసుకొని నశించు వేద బాహ్యుల విషయము అవధరించండి

= = = = = = = = = = = = = = = == = = = = = = = == = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

**యా వేదబాహ్యాః స్మృతయః అర్హతాదేః**

**వేదేషు యాః కాశ్చ కుదృష్టయః తాః**

**ఆగస్కృతాం రంగనిధే! త్వదధ్వని**

**అంధంకరణ్యః స్మృతవాస్ మనుః తత్** 2

ఓ రంగనాథా! కొన్ని స్మృతులు వేదమును తిరస్కరించును జైనాది మతస్థులు (జైనులు బౌద్ధులు చార్వాకులు), ఈ స్మృతులు నెపములతో వేదమును అంగీకరించరు వీరు వేద బాహ్యులు కొన్ని దర్శనములు వేదములకు తప్పు అర్థమును చెప్పును (సాంఖ్యము), ఈ కుమతులు, కుదృష్టులు నిన్ను చేరుటకు ఆటంకము కల్గించుదురు దోష పూరితమయిన తత్త్వార్థములను చెప్పి జనులను తప్పు దారి పట్టించెదరు (సాంఖ్యులు జీవుని చైతన్య శూన్యునిగా ఈశ్వరుడు లేనట్లు చెప్పెదరు ఇందుచే బద్ధ ముక్త జీవ భేదమే ఉండదు బౌద్ధులు సర్వం క్షణికం అంటారు ఇందుచే శాశ్వత ఆనందము ఇందులో కానరాదు జైనులు ఇద్దరు సూర్యులు ఇద్దరు చంద్రులు జారిపోతున్న భూమి అని అరథరహితమయిన విషయములు చెప్పెదరు) అందుకే మనువు వంటి స్మృతి కారులు అవివేక పూరిత మయిన ఈ మతములను దర్శనములను తిరస్కరించిరి

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

**ప్రత్యక్ష ప్రమథన పశ్యతో హరత్వాత్**
**నిర్దోష శ్రుతి విమతేశ్చ బాహ్యవర్త్మ**
**దుస్తర్క ప్రభవతయా చ వక్ష్య దోషః**
**స్పృష్ట్యా చ ప్రజహతి రంగవింద వృద్ధాః** 3

ఓ రంగనాథా! వేద బాహ్యులైన జైనులు, బౌద్ధులు ప్రత్యక్ష గోచరమును అయదార్థమని తిరస్కరింతురు. నిర్దోషమైన శ్రుతులకు తప్పు అర్థములు చెప్పుదురు. దుస్తర్క దుర్భాషలతో వాదించెదరు. దోషభరితములైన వారి వాదములు నిలువవు. అందులకే జ్ఞాన వృద్ధులు వారి వాద ప్రమాణములను అంగీకరించరు.
పరాశర భట్టరు స్వామి తరువాతి శ్లోకములలో ఆ మతములలో లోపములను మనకు కృప చేస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

**అవయవితయ ఇదమ్ కుర్వాణైః బహిష్కరణైః వపుః**
**నిరవయవకః అహంకారార్థః పుమాస్ కరణాతిగః**
**స్ఫురతి హి జనాః ప్రత్యాసత్తేరిమౌ న వివించతే**
**తదధికురుతాం శాస్త్రం రంగేశ తే పరలోకిని** 4

ప్రత్యక్షప్రమాణమును మాత్రము అంగీకరించు చార్వాకుల గురించి చెబుతున్నారు ఈ శ్లోకంలో

ఓ రంగనాథ! ఈ శరీరము అచైతన్యమైన అవయవములతో నిర్మితము. దీనికి కాళ్ళూ, చేతులూ ఉన్నవి అనినట్లుగా దీనిని అందులకే ఇది అని సంబోధించెదము. జీవాత్మ 'అహమ్' అని తెలుప పడతాడు. జీవాత్మ నిరవయవి, ఇంద్రియ/ శరీర అధీనమైనది కాదు. కాని ఈ శరీరమునకు ఆత్మకు దగ్గర సంబంధముండుట వలన సామాన్యులు ఈ శరీర, శరీరి భేదము గుర్తించరు. (చార్వాకులకు ఈ దేహాత్మ వివేచనము లేదు. ఆత్మ స్వయం ప్రకాశకమనియు, జ్ఞానాశ్రయమనియు శరీరము కన్న వేఱు అనియు చూడలేరు. వారు ఆత్మనే గుర్తించరు). వేద శాస్త్రము వలననే ఈ వివరము తెలుస్తుంది( నిరూపితమవుతుంది)

(వేదమును ప్రమాణముగ అంగీకరించక ఆత్మనే గుర్తించలేని వాికి ఆత్మోజ్జీవనము ఎట్లు తెలియును అని భావము)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

**ప్రత్యక్షా శ్రుతిరర్థధీశ్చ న కథ దోషాః తదర్థః పునః**
**ధర్మాధర్మ పరావరేశ్వరముఖః ప్రత్యక్షబాధ్యో న చ**
**తచ్చార్వాకమతేపి రంగరమణ! ప్రత్యక్షవత్ సా ప్రమా**
**యోగోన్మీలితధీః తదర్థమథవా ప్రత్యక్షమీక్షేత సభ** **5**

చార్వాకులు కేవలము ప్రత్యక్షమును ప్రమాణముగా స్వీకరించి ప్రాకృతిక ఇంద్రియానుభవమును నిజమని భావించెదరు కదా! శ్రీమాన్ పరాశర భట్టరు స్వామి ఈ శ్లోకమునందు వారి బుద్ధి హీనతను పరిహసించి రంగనాథుని అట్టి చార్వాకులకు బుద్ధీంద్రియముల వలన సత్యగోచరము  గోచరము కావలెనని ప్రార్థించు చున్నారు.

కనులకే కాక అంతఃకరణముతో సహా మిగిలిన ఏ ఇంద్రియాలకు గోచరము/ అనుభవము అయినదంతయు ప్రత్యక్షము అని అంగీకరించ వలెను కదా! మనకు శ్రుతులు చెవులకు వినబడి అంతరింద్రియము ద్వారా స్వీకరించబడి పదార్థ, వాక్యార్థ విచారము ద్వారా తెలియ బడుతాయి. అందుచే శ్రుతులు కూడా ప్రత్యక్ష ప్రమాణములే, స్వీకార్యములే. అంతేకాక సామాన్య మానవుల కుండెడి భ్రమ, ప్రమాదము, విప్రలంభము, అశక్తి మున్నగు దోషములు అపౌరుషేయాలయిన వేదములకుండవు. కనుక వేదములకు సామాన్యముగా ప్రత్యక్షమునకు కలుగు దోషములుండవు. అందుచే శ్రుతులవలన తెలియబడు ధర్మము, అధర్మము, పరమాత్మ, ఇంద్రాది ఇతరదేవతలు కూడ ప్రత్యక్ష దోషబాధితము కాక యదార్థ(ప్రమ) జ్ఞానము. అంతేకాక సామాన్యులు పలికెడు కొన్ని పదముల సముదాయమైన వాక్యము(ఉదా. గగనకసుమము పై కుందేటి కొమ్ము కలదు) నందు దోషములుండవచ్చును కాని పరమాత్మ, ధర్మము వంటి వేఱు  వేఱు పదములు అర్థవంతములు యదార్థజ్ఞానార్థకములే అవుతాయి. కాని చార్వాకులకు వారి ప్రత్యక్ష ప్రమాణము వలన ఇట్టి యదార్థ జ్ఞానము తెలియదు. మేము చెప్ప జూచినను వారు శ్రుతి విషయము మాకు  సాక్షాత్ దృష్టము కాకున్న స్వీకరించము అని మూర్ఖముగా ప్రవర్తింతురు. కావున ఓ రంగరమణ! వారికి శ్రుత్యర్థములు గోచరించు యోగదృష్టి కలిగినప్పుడే వారు శ్రుతి ప్రమాణమును అంగీకరించుట సాధ్య మేమో!(నీవు కల్గించుము అని ప్రార్థించు చున్నారు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి చార్వాకులను చెండాడిన తరువాత బౌద్ధమతము నందలి లోపములు చూపి తత్ఖండనము తరువాత శ్లోకములలో వివరిస్తున్నారు.

**న సత్ అసత్ ఉభయమ్ వా న ఉభయస్మాత్ బహిర్వా**
**జగదితి న కిలైకాం కోటిమాటీకతేతత్**
**ఇతి నిరుపధి సర్వమ్ సర్వికాతః నిషేధస్**
**వరద! సుగతపాశః చోరలావమ్ విలావ్యః** **6**

బౌద్ధులు శూన్యవాదులు. వారు ఈ స్పష్టగోచరమయిన జగత్తును 1. యదార్ధమని (సత్), 2. అయదార్ధమని(అసత్), 3. యదార్ధమూ, అయదార్ధమూ నని(సత్, అసత్ ఉభయమూను), 4. యదార్ధమూ కాదు, అయదార్ధమూ కాదు (సత్ కాదు, అసత్ కాదు), అనీ నాలుగు రకాలుగ చెబుతారు. అటుపై విచిత్రంగా ఈ జగత్తు వీటన్నిటికీ అతీతమని అంటారు. బౌద్ధుల వాదము ఈ రకంగా అసలు పునాది లేనట్లు ఉంటుంది.
ఏదైనా వస్తు నిర్ణయము చేయవలసి వచ్చినప్పుడు కాలము స్థానము బట్టి చెప్పెదము. పుస్తకము ఇప్పుడు నేలపై నున్నది, ఇంతకుముందు బల్లపై నున్నది, అన్నట్లుగా. కాలము, స్థానము లతో సంబంధము లేక అసలు ఒక ప్రత్యక్షముగానువ్న వస్తువు యొక్క అస్తిత్వమునే నిరాకరించుట ఏమి తర్కము. ఓ వరద!(రంగనాథ!), ఈ బౌద్ధులు కనపడే ఈ జగత్తునే మన తలపులనుండి కొల్లగొట్టే ప్రయత్నము చేస్తున్నట్లు ఉన్నారే. వీరిని చోరులుగానే తలచవలెను కదా!
(అనగా వారి మతము తిరస్కరణీయము అని భావము)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

**ప్రతీతిః చేత్ ఇష్టా న నిఖిల నిషేధో యది న కః**
**నిషేద్ధాతో న ఇష్టో నిరుపధినిషేధః సదుపధౌ**
**నిషేధే అన్యత్ సిధ్యేత్ వరద! ఘటభంగే శకలవత్**
**ప్రమాశూన్యే పక్షే శ్రుతిః అపి మతే అస్మిన్ విజయతామ్** **7**

పరాశర భట్టర్ స్వామి తన దాడి బౌద్ధులపై ఈశ్లోకంలో కూడా కొన సాగిస్తున్నారు.

ప్రత్యక్షముగా తెలుస్తున్న జగత్తును అయథార్ధము అనుట తప్పు. ప్రపంచంలో అన్ని పదార్థాలు ఎట్లు అయథార్ధములు అవుతాయి. సర్వమ్ శూన్యమ్, అయథార్ధము అంటే ఆవాక్యము కూడ అయథార్ధము అనృతము అవాలి. అట్లయిన శూన్యవాదము పునాది లేక గాలిలో తేలి పోతుంది.
కుండ లేదు అంటే కుండ ఇప్పుడు లేదు, ఇచ్చట లేదు అని తప్పు, కుండ అను పదార్ధము అయథార్ధము అని కాదు కదా! కుండ వేఱొక చోట, వేఱొక సమయమున ఉండవచ్చును. ఒకప్పుడు కుండ ఉండి ఇప్పుడు శకలములు అయినచో కుండ రూపాంతరము చెందినది అని తప్ప కుండయే భ్రమ అని ఎట్లు చెప్పెదవు. కుండ ఒకప్పుడు ఉండి తన ప్రయోజనమును సాధించి పెట్టినది. అందుచే ఆజ్ఞానము ప్రమ( వస్తు సద్భావాన్ని నిరూపించు యథార్ధ జ్ఞానము) యే గాని, భ్రమ(అయథార్ధజ్ఞానము) కాదు. ఈకారణాల వలన శూన్యవాదమే అయథార్ధము. ఓ వరద(రంగనాథ!), అందుచే వేదప్రామాణ్యము, ఔన్నత్యము స్పష్టముగా నిరూపితము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టరు స్వామి ఈ శ్లోకంలో కూడ తన బౌద్ధ మత తిరస్కరణ కొనసాగిస్తున్నారు.

**యోగాచారః జగత్ అపలపతి అత్ర సౌత్రాంతికః తత్**
**ధీవైచిత్ర్యాత్ అనుమితి పదమ్ వక్తి వైభాషికాస్తు**
**ప్రత్యక్షమ్ తత్ క్షణికయతి తే రంగనాథ! త్రయోపి**
**జ్ఞానాత్ ఆత్మత్వ క్షణభిదురతే చక్షుషే తాన్ క్షిపామః** **8**

(బౌద్ధము ప్రకారము జీవన లక్ష్యపు పరాకాష్ఠ దఃఖనిరోధమే. ఆత్మ, ఆనందము అన్న విషయాల వాికి తెలియదు)

బౌద్ధులయందు నాలుగు వర్గములు కలవు.

బుద్ధుడు ప్రారంభమందు సర్వము శూన్యము అని ప్రబోధించెను. ఇట్లు విశ్వసించి ప్రవర్తించువారిని మాధ్యమికులని(మహాయానం) అంటారు.

పిదప వారినుండి ఏర్పడిన వేఱొక వర్గము విశ్వమును అసత్యముగా తిరస్కరించి, జ్ఞానమును మాత్రమే యథార్థముగ స్వీకరించిరి. వీరిని యోగాచార్యులు అంటారు. జీవనలక్ష్యమునకు యోగము సాధనముగ వీరు భావిస్తారు. (మహాయానము).

తరువాత వచ్చిన వర్గము సౌత్రాంతికులు. వారి ప్రకారము బాహ్యంగా కనపడు జగత్తంతా ప్రాతిభాసితము(ఊహయే), ధీవైచిత్రి తో, అనుమితితో ఉపపాదించెడు జ్ఞానము యథార్థము.

మఱియొక వర్గము వైభాషికులు(హీనయానము). వీరి ప్రకారము జగత్తు యథార్థము, కాని క్షణికము.

వీరందరును జ్ఞానము తప్ప అజ్ఞానమునకు ఆశ్రయమైన ఆత్మ అస్తిత్వమే లేనట్లు వ్యవహరింతురు. ప్రత్యక్షముగా తెలియబడు జగత్తును శూన్యమనియు, క్షణికమని అంటారు.

వీరందరును (వేద ప్రామాణ్యము తెలియక, యథార్థ జ్ఞానము లేక భగవత్ భాగవత కైంకర్య పరులు కాక), నశించుచున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి కొనసాగిస్తున్న బౌద్ధ మతనిరసనలో తరువాత శ్లోకము

**జగత్ భంగురమ్ భంగురా బుద్ధిః ఆత్మేతి**
**అసత్ వేత్త భావే తథా వేద్య విత్త్యోః**
**క్షణధ్వంసతః చ స్మృతిప్రత్యభిజ్ఞా**
**దరిద్రమ్ జగత్ స్యాత్ ఇదమ్ రంగచంద్ర** 9

ప్రత్యక్షముగా కనపడుతున్న జగత్తు శూన్యము కానేరదని ముందు నిరూపించేరు కదా! క్షణికము కూడా కానేరదని, అటులనే ఆత్మ అనునది క్షణ భంగురమైన జ్ఞానము అనుట తప్పు అని ఉపపాదిస్తున్నారు.

ప్రత్యక్షమైన పదార్థములన్నిటినీ తెలియు, ఆ జ్ఞానాశ్రయమై తద్భిన్నమైన జ్ఞాత(ఆత్మ) లేడు, ఆ జ్ఞానము వలన తెలియ బడు పదార్థములు క్షణికములు అనినచో, మనము అనుభవించు ప్రత్యభిజ్ఞ ఎట్లు కుదురును. (ఉదా: మనము ఇంతకు ముందు చూచిన వస్తువు లేక మనిషి మరల కనపడి నప్పుడు దా(వా) నిని గుర్తించి ఇది అదే అని తెలుసుకోవడాన్ని / గుర్తించడాన్ని ప్రత్యభిజ్ఞ అని అంటారు). దీనిని బట్టి జ్ఞానము, ఆ జ్ఞాత కూడా క్షణికములు కాక కొనసాగునని/ నిలిచి యుండునని తెలుస్తోంది. లేకున్న ముందు ఒకప్పుడు కలిగిన జ్ఞానము ఆ జ్ఞాతకు మరల జ్ఞప్తికి రాలేదు. దానిచే గుర్తించుటయు కుదరదు. అందుచే ఓ రంగ చంద్ర! శూన్య/ క్షణిక వాదములు తిరస్కరణీయములు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి తమ బౌద్ధ మత నిరసనవాదమును ఈ శ్లోకముతో ముగిస్తున్నారు.

**అహమ్ ఇదమ్ అపివేద్మి ఇతి ఆత్మ విత్త్యోః విభేదే**
**స్ఫురతి యది తదైక్యమ్ బాహ్యమపి ఏకమ్ అస్తు**
**ప్రమితిః అపి మృషా స్యాత్ మేయ మిథ్యాత్మ వాదే**
**యది తదపి సహేరస్ దీర్ఘమ్ అస్మాత్ మత ఆయుః** **10**

నేను దీన్ని (ఉదా. కుండను) తెలుసు కున్నాను అన్నప్పుడు నేను(జ్ఞాత), కుండ(జ్ఞేయము), తెలుసుకొనుట(జ్ఞానము), అను మూడు వేఱు వేఱుగా ఉంటాయి. అట్టిచో ఈ మూడింటికి ఐక్యత ఎట్లు చెప్పేదము. ఈ కనపడు నంతయు అయదార్థమని అంటే ఈ విషయం తెలిపే జ్ఞానము కూడా అయదార్థమే కావాలి. అలా అంటే ఈ వాదము యొక్క పునాది యే కూలిపోయినట్లు.
తెలియ బడిన పదార్థము యదార్థము ఐతే పైన చెప్ప బడినట్లు అంతా అసత్తు అనుట తప్పు. ఈ విశ్వము, పదార్థాలూ అన్నీ అసత్తు, శూన్యము అనే వాదము ఏరకంగా చూచినా నిలబడదు.
అందుచే వేద ప్రామాణికమైన మన (రామానుజ)సిద్ధాంతమే దీర్ఘాయువు.
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టరు స్వామి బౌద్ధ మత ఖండనము ముగించి ప్రచ్ఛన్న బౌద్ధ మనబడే అద్వైతదర్శనము వివరిస్తున్నారు ఈ శ్లోకంలో

**ఏతత్ రామాస్త్రమ్ దలయతు కలిబ్రహ్మ మీమాంసకాంశ్చ**
**జ్ఞప్తిః బ్రహ్మ ఏతత్ జ్వలత్ అపి నిజ అవిద్యయా బంభ్రమీతి**
**తస్య భ్రాంతిమ్ తాం శ్లథయతి జిత అద్వైత విద్యః తు జీవః**
**యత్ యత్ దృశ్యమ్ తత్ వితథమ్ ఇతి యే జ్ఞాపయాంచ కృరజ్ఞాః** **11**

(సర్వ విశేష శూన్యమై చిన్మాత్ర స్వరూపమైన బ్రహ్మ మొక్కటియే సత్యము. తద్భిన్నమై పలువిధములుగా జ్ఞాత యని, జ్ఞేయమని, వాటిని బట్టి వచ్చు వివిధ జ్ఞానములు అనియు చెప్ప బడు ఈ సకల ప్రపంచము ఆబ్రహ్మమునందే అవిద్యా కల్పితమై మిథ్యాభూతమైనది
ఈ అవిద్య చే ఆవృతమైన పర బ్రహ్మము మహావాక్యజ్ఞానము వలన అవిద్య తొలగించబడినదై స్వయంప్రకాశమవుతుంది అనునది స్థూలంగా అద్వైత సిద్ధాంతము. )
పరబ్రహ్మము చిన్మాత్ర జ్ఞానము. అది స్వయం ప్రకాశకమయిననూ, అనాదిగా వచ్చిన అవిద్య చే బాధితమై భేద భ్రాంతికి లోబడి ఉంటుంది. ఈ అవిద్య వలన జీవాత్మ, బ్రహ్మముల ఐక్యత(అంటే రెండూ వేఱు కాదు ఒక్కటే) అన్న విషయము తెలియక యుండును. అంటే బ్రహ్మము స్వస్వరూపము గుర్తించక, జ్ఞాత, జ్ఞేయములని భేద భ్రాంతి ఉంటుంది. ఈ పరిస్థితిలో 'తత్త్వమసి', 'అహమ్ బ్రహ్మాస్మి' వంటి మహావాక్య జ్ఞానము వలన ఈ భేద భ్రాంతి పోయి బ్రహ్మ స్వరూపము అవగత మవుతుంది.

ఇట్టి వాదములు ప్రత్యక్షముగా కనబడునంతయు అయథార్థము, మిథ్య అను తప్పు భావముల నుండి వచ్చినది. ఇది అంతయు కలి పురుషుని ప్రభావమేకదా! ఇట్టి అనృత బ్రహ్మ విచారములు రామ బాణము వంటి మా ( రామానుజుల) శాస్త్ర పరమైన తత్త్వ దర్శనము వలన ఛిన్నా భిన్నములగును. బ్రహ్మమును నిర్విశేషమనుట (అనగా ఏ విశేషములు లేనిది), బ్రహ్మమనగా అవిద్య పోయిన జీవాత్మయే అనుట ఎట్లు కుదురును

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి జైన మతమును ఖండిస్తున్నారు ఈ శ్లోకంలో.

**అంగీకృత్య తు సప్తభంగి కుసృతిమ్ స్యాత్ అస్తి నాస్తి ఆత్మికామ్**
**విశ్వమ్ త్వత్ విభవమ్ జగత్ జినమతే నైకాంతమ్ ఆచక్షతే**
**భిన్నాభిన్నమ్ ఇదం తథా జగదుషే వంధ్యా మమ అంబేతివత్**
**నూత్న బ్రహ్మవిదే రహః పరమ ఇదమ్ రంగేంద్ర తే చక్షతామ్** **12**

జైనమతము విశ్వమును యథార్థమని అంగీకరిస్తూనే విచిత్రమైన సప్త భంగివిచారాన్ని ప్రతిపాదిస్తుంది. దాని ప్రకారము, ఈ విశ్వము
స్యాదస్తి(ఉండవచ్చు),
స్యాన్నాస్తి( ఉండకపోవచ్చు),
స్యాదస్తిచ నాస్తిచ( ఉండీ ఉండకపోవచ్చును),
స్యాదవక్తవ్యమ్( ఇలా అని చెప్ప లేకపోవచ్చు),
స్యాదస్తి అవక్తవ్యమ్(ఉండవచ్చు కాని అలా చెప్పలేకపోవచ్చు),
స్యాన్నాస్తి అవక్తవ్యమ్( ఉండకపోవచ్చు కాని అలా చెప్ప లేక పోవచ్చు),
స్యాదస్తి చ నాస్తి చ అవక్తవ్యమ్( ఉండవచ్చు, ఉండకపోవచ్చు కాని అలా చెప్ప లేక పోవచ్చు ),
ఇట్లు యథార్థము అని అంగీకరిస్తూనే విపరీతమైన అసంభవ వాదములచే తెలపెడి జైన వాదము మనలను సంశయంలో పడవేసి తప్పుదారి పట్టిస్తుంది. ఇట్టి వాదము నిలువదు. ఆమె మాఅమ్మ, కాని గొడ్రాలు అని అన్నట్లుగా.
ఓ రంగేంద్ర! ఇట్టి సిద్ధాంతములు, కొంతమంది భేదాభేద వాదులు చెప్పు బ్రహ్మము, జీవాత్మ భేదము, అభేదము (వేఱు, వేఱుకాదు కూడా), కూడా ఒకేసమయమందు అయిఉండును అన్నట్లుగా అసమంజసములు వీరందరూ ఒకరికి మఱియొకరు తమవాదములను వినిపించుకొని డోలామానసులవనిండు. మనకేమి. (మన సిద్ధాంతమునఅట్టి సంశయములకు అవకాశము లేదు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి వైశేషిక, న్యాయ దర్శనముల గురించి ఈ శ్లోకంలో అనుగ్రహిస్తున్నారు.

**కణచర చరణాక్షౌ భిక్షమాణౌ కుతర్కైః**
**శ్రుతి శిరసి సుభిక్షమ్ త్వత్ జగత్ కారణత్వమ్**
**అణుషు విపరిణామ్య వ్యోమపూర్వమ్ చ కార్యమ్**

**తవ భవదనపేక్షమ్ రంగభర్తుః బ్రువాతే** 13

(ఏదయినా ఒక కార్యము జరగాలంటే కారణము ఉండాలి కదా. ఉదా. కు ఒక కుండ కావాలంటే పాతపద్ధతిలో మట్టి, కుమ్మరి, కుమ్మరి చక్రము, ఇవన్నీ ఉండాలి. వీట్లలో మట్టిని ఉపాదాన కారణము అనీ, కుమ్మరిని నిమిత్త కారణము అనీ, చక్రమును సహకారి కారణము అనీ అంటారు. న్యాయ(గౌతమునిది), వైశేషిక (కణాదునిది), దర్శనములు ఈ కనిపించే విశ్వానికి కారణము కణాలు(పరమాణువులు), అని అంటారు. అంటే కణాల పరస్పర సంయోగము వలన విశ్వము పుట్టిందన్న మాట. అయితే వేలు వేలు పదార్థాలకు వేలు వేలు గుణాలు కలుగుటకు కారణము విశేషమను ప్రత్యేకత అని వైశేషికులు సమర్థిస్తారు. ఈ రెండును వైదిక దర్శనములైనను వేదములకు సవ్యముగా అర్థము చెప్పకున్న కారణమున వేదబాహ్యములని పరిగణించవలెను).

ఓ రంగనాథ! సర్వేశ్వరుడవైన నిన్ను ఈ సకల చరాచర సృష్టికి ఏకైక కారణము (అనగా ఉపాదాన, నిమిత్త, సహకారి కారణములన్నియు), అని వేద, వేదాంతములన్నీ ఘోషించు చుండగ, గౌతమ, కణాదులు తమ కుతర్కములతో, దిగజారి, నీచమైన కణములను కారణత్వము స్వీకరించి బిచ్చ మెత్తు కొనుచున్నారే. మూర్ఖపు దనముతో మూలకారణమూర్తివైన నిన్ను తిరస్కరించి ఈ జగత్తు అణు పరిణామముల వలన అని మహదైశ్వర్య స్థితి యందుండి దానిని తిరస్కరించి బిచ్చము నెత్తి కొను వారివలె నున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర్ భట్టర్ స్వామి తరువాతి శ్లోకంలో సాంఖ్య, యోగ, పాశుపత దర్శనములను నిరసిస్తున్నారు

**సంచష్టే న ఈశ్వరమ్ త్వామ్ పురుషపరిషది న్యస్య యద్వా అన్యపర్యాత్**
**సాంఖ్యః యోగీచ కాక్వా ప్రతిఫలనమ్ ఇవ ఐశ్వర్యమ్ ఊచే కయాచిత్**
**భిక్షౌ శైవః సురాజంభవమ్ అభిమనుతే రంగరాజాదిరాగాత్**
**త్వామ్ త్వామ్ అవ అభ్యధాః త్వమ్ నను పర విభవ వ్యూహన ఆద్యమ్ భవిష్ణుమ్** 14

సాంఖ్యులు పరమాత్మ అస్తిత్వమును ఒప్పుకోక ప్రకృతి పురుష తత్త్వములు 25 అని గుర్తిస్తారు. యోగదర్శనము పరమాత్మను గుర్తించినా విలువ నీయరు. ఒకని వద్ద పది పైసలున్నను పైస లేకపోయినను పెద్ద తేడా ఏమి యుండును. ఇక, పాశుపతము తన బ్రహ్మ హత్యా పాతకము పోగొట్టుకొనుటకు భిక్షుకునిగా నీ వద్ద బిచ్చమెత్తిన శివుని పరమాత్మగా వర్ణిస్తుంది. ఇవి అన్నియు వేద ప్రామాణ్యములు కావు.
ఓ రంగనాథా! నీ యొక్క పర, వ్యూహ, విభవ, అర్చ, అంతర్యామి మూర్తుల గూర్చి నీ అనంత కళ్యాణ గుణములను గూర్చి చెప్పెడి, వక్తృత్వ, వంచనాది దోషములు లేక నీచే ప్రవచించబడి, సనత్కుమార, శాండిల్య, నారదాదుల చే ప్రచారము చేయబడిన భగవత్ శాస్త్రము అయిన పాంచరాత్ర శాస్త్రము మాత్రమే వేదార్థమును సరిగా అందించును

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టరు స్వామి బౌద్ధ, ప్రచ్ఛన్న బౌద్ధుల గురించి అనుగ్రహిస్తున్నారు ఈ శ్లోకములో.

**ఇతి మోహన వర్త్మనా త్వయా అపి**

**గ్రథితమ్ బాహ్యమతమ్ తృణాయ మన్యే**
**అథ వైదిక వర్మ వర్మితానామ్**
**మనితాహే కుదృశామ్ కిమీశ! వర్మ** **15**

(బౌద్ధము వంటి మతములను కొన్నింటిని భగవానుడే వేఱు వేఱు సమయముల యందు వేఱు వేఱు ప్రయోజనములకు వేఱు వేఱు ఆవేశాది అసంపూర్ణ అవతారముల ద్వారా వేఱు వేఱు మార్గముల కాలముల ప్రవేశపెట్టెను. కాని ఆ ప్రయోజన రహస్యములు అందరకూ అవగతము కాదు).

ఓ పరమేశ్వరా! లోకులను మోహింపచేయుటకు బుద్ధాది రూపములను ధరించి (ఒకప్పుడు), దోషమార్గములను చూపించితివి. అట్టి అవైదిక దర్శనములను మేము తృణప్రాయముగా తిరస్కరింతుము. కాని శ్రుతి కవచ ధారులై కుదృష్టులైన కొందరు(అద్వైతులు), శ్రుతివిరుద్ధముగా ప్రవచించి, ప్రవర్తించు చున్నారే. వారు కూడా మాకు నిరాదరణీయులే.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి బౌద్ధ మత నిరసనము గత శ్లోకముతో ముగించి, మొదటి శ్లోకమునందు ప్రస్తుతించిన (మానమ్ ప్రదీపమివ పరమ కారుణికో దదాతి) వేదప్రామాణ్యత వివరిస్తున్నారు ఈ శ్లోకంలో

**సంస్కారమ్ ప్రతి సంచరేషు నిదధత్ సర్గేషు తత్సారితమ్**
**రూపమ్ నామ చ తత్తత్ అర్థ నివహే వ్యాకృత్య రంగాస్పద**
**సుప్త ఉద్బుద్ధ విరించి పూర్వ జనతామ్ అధ్యాప్య తత్తత్ హితమ్**
**శాసత్ నస్మృత కర్తృకాన్ వహసి యత్ వేదాః ప్రమాణమ్ తతః** **16**

ఓ రంగనిలయ! వేదములు అపౌరుషేయములు. ప్రళయ సమయమందు నీవు వాటిని రక్షించి యుంచుదువు. మరల నీవు వాటిని ధరించి, చతుర్ముఖ బ్రహ్మకు అందిచ్చెదవు. ఆ విధముగా బ్రహ్మాదులను సృష్టించి వారి వారి పదవులయందు వారి వారి విధి నిర్వహణకు సహకరించెదవు. పూర్వపు విధముగా వివిధ చరాచరములకు నామరూపవిభాగము వేదోక్తముగా కావింప చేసెదవు. వేదములు వేఱొకరి రచన కాక నీ ముఖమునుండి బహిర్గతమగుటచే భ్రమ, ప్రమాదాది దోషములు లేనివై పరమ ప్రామాణ్యములుగా విరాజిల్లును.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి వేద ప్రామాణ్యత గూర్చి తరువాత ఱెండు శ్లోకములలో కూడా తెలియచేస్తున్నారు.

**ఆదౌ వేదాః ప్రమాణమ్ స్మృతిః ఉపకురుతే స ఇతిహాసైః పురాణైః**
**న్యాయైః సార్థమ్ త్వత్ అర్చావిధిమ్ ఉపరి పరిక్షీయతే పూర్వభాగః**
**ఊర్ధ్వః భాగః త్వదీహా గుణ విభవ పరిజ్ఞాపనైః త్వత్ పదాప్తౌ**
**వేద్యః వేదైః చ సర్వైః అహమ్ ఇతి భగవన్! స్వేనచ వ్యాచకర్థ** **17**

(వేదములయందు పూర్వ భాగమైన కర్మకాండ,స్మృతులు, పూర్వమీమాంసాది శాస్త్రములు భగవదారాధనా పరముగానుండును. వేదముల ఉత్తర భాగమైన బ్రహ్మ కాండ భగవత్స్వరూపమును ప్రతిపాదించును. కొన్ని శ్రుతులు భగవానుని కళ్యాణ గుణ పూర్ణునిగా వర్ణించును. కొన్ని శ్రుతులు నిర్గుణునిగా తెలియ చేయును. కాని భగవద్గీత యందు స్వామి వేదైః సర్వైః చ అహమ్ ఏవ వేద్యః అని చెప్పుకొనినాడు. అందుచే సగుణ బ్రహ్మగా వర్ణించిన శ్రుతులను తిరస్కరించి నిర్గుణ బ్రహ్మగా తెలిపిన శ్రుతులనే అంగీకరించు అద్వైత సిద్ధాంతము తప్పు. అటులనే అహమేవ అనుటవలన ఇంద్రాది దేవతలను శ్రుతులలో వర్ణించినపుడు ఆ దేవతలకు అంతర్యామిగా నుండు శ్రీమన్నారాయణుడే బ్రహ్మ యని తెలియవలెను.)

నిన్ను తెలియచేయు వేదములే నిర్దుష్టములైన ప్రథమ ప్రమాణములు. స్మృతి, ఇతిహాస, పురాణములు వేదముల ఉపబృంహణములయి, వేదార్థములను వివరముగా తెలియచేయును. పూర్వ మీమాంసాశాస్త్రము నీయొక్క ఆరాధనాత్మకమైన కర్మలను తెలియచేయును. ఉత్తర మీమాంస బ్రహ్మ కాండ నీ జగద్వ్యాపార రూప చేష్టలను, నీ స్వరూపమును , కళ్యాణ గుణములను, ఉభయ విభూతులను, మేము నీ పాదారవిందములను చేరగల విధి, విధానములపర్యంతము తెలియచేయును. వేదైశ్చ సర్వైః అహమేవ వేద్యః అని నీవే గీత యందు అనుగ్రహించినట్లు వేదములన్నియు నిన్నే తెలియచేస్తాయి. వేద ప్రతిపాద్యుడవైన పరమాత్మ నీవే.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి వేదాంగముల గురించి వేదాంగముల సహకారముతో వేదములు భగవన్నిర్ణయము, భగవద్వర్ణనము, భగవత్కైంకర్యము ఎట్లు తెలుపునో వివరిస్తున్నారు ఈ శ్లోకములో

**శిక్షాయామ్ వర్ణ శిక్షా పదయమధిగమః వ్యాక్రియా నిర్వచోభ్యామ్**
**ఛందః ఛందః చితౌ స్యాత్ గమయతి సమయమ్ జ్యౌతిషామ్ రంగనాథ!**
**కల్పే అనుష్ఠానమ్ ఉక్తమ్ హి ఉచితగమితయోః న్యాయ మీమాంసయోః స్యాత్**
**అర్థవ్యక్తిః పురాణా స్మృతిషు తదనుగాః త్వామ్ విచిన్వంతి వేదాః** **18**

వేదాంగములు ఆరు. అవి శిక్షా, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము.
వర్ణోచ్చారణా క్రమములను వివరించునది శిక్షా. వ్యాకరణ, నిరుక్తములు పదముల యొక్క అర్థ, జ్ఞానములను, పదోత్పత్తిని, వాక్య నిర్మాణక్రమమును తెలుపును. ఛందస్సు మాత్రా, గణవిభాగములను, శ్లోక రచనా క్రమాన్ని, జ్యోతిషము వైదిక కార్యములు నిర్వహించుటకు కాల గమన విషయములను, శుభాశుభ ముహూర్తములను, కల్పము వైదిక కార్యములు చేయు విధి విధానములను తెలియ చేయును. న్యాయ, మీమాంసాశాస్త్రములు స్మృతి, పురాణాముల అర్థనిర్ణయమునకు తోడ్పడును.
ఈ వేదాంగములను అనుసరిస్తూ వేదములు ఓ రంగనాథా! నీ విచారము చేయుచుండును( పరమాత్మ విచారమునకు వేదాంగ, ఉపబృంహణముల సహకారముతోడనే వేదమును అర్థం చేసుకొనవలెను).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కర్మ లన్నియు భగవత్సంకల్పము ప్రకారము జరుగునని, తత్తత్ఫలములు కూడ భగవదాధీనములేనని నిర్వచించిన పిదప, పరమకారుణికుడైన భగవానుడు తన సంతానమును తుచ్ఛమైన కామ్య, అభిచారాది కర్మల

యందు ఏల ప్రేరేపించుననగా, ఆ విధి, విధానములు వారి వారి గుణములబట్టియు, రుచివాసనల బట్టియు యుండునని శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో సమాధానమిచ్చుచున్నారు.

**ఆజ్ఞా తే స నిమిత్త నిత్య విధయః స్వర్గాది కామ్యాద్విధిః**
**సః అనుజ్ఞా శఠచిత్త శాస్త్ర వశత ఉపాయః అభిచార శ్రుతిః**
**సర్వీయస్య సమస్త శాసితుః అహో! శ్రీరంగ సర్వస్వ! తే**
**రక్షా ఆకూత నివేదినీ శ్రుతిః అసౌ త్వత్ నిత్య శాస్తిః తతః** **19**

ఓశ్రీరంగనాథా! సంధ్య వందనాది నిత్య విధులు, పితృకర్మాది నైమిత్తిక విధులు నీ ఆజ్ఞలే. వానిని తప్పనిసరి గా నీ కైంకర్య రూపముగనే జరుపవలెను. స్వర్గాది కామ్యములకు కొందరు కొన్ని యజ్ఞ యాగాదులు జరుపుదురు. కొన్ని క్షుద్ర అభిచార కర్మలు శత్రు నాశనమునకు కొందరు చేయుదురు. అట్టి కామ్య కర్మలకు కాని, క్షుద్ర కర్మలకు గాని నీ ఆజ్ఞానుజ్ఞలు ఎట్లు కుదురును? వివిధ గుణ, వాసనలు గల సకల జనుల అభిరుచులను బట్టి అభిప్రాయములను బట్టి సమస్త జన రక్షకుడవైన నీవే ఆయా కర్మలను వేదోక్తప్రకారము జరిపించెదవు. ఆ విధముగా శఠచిత్తులను కూడ వశపరచుకొని, వారికి శాస్త్రమునందు ఆసక్తి కలిగించి దరి చేర్చుకొని రక్షించెదవు కదా!

( ఉదా. కు కన్న తల్లి తనకు గల మంచి పిల్లలచే మంచి పుస్తకములు చదివించి, మరి కొంతమంది నియమిత జ్ఞానము గల పిల్లలచే బొమ్మల పుస్తకములు చదివించి వారికి పఠనమునందు ఆసక్తి కలిగించి, దుష్టులైన పిల్లలచే(వారు కూడా తన పిలలే కనుక), వారికి ఇష్టమైన పుస్తకములు ఆరోగ్యకరమైనవి కాకున్నను చదువుటకు అంగీకరించి క్రమముగా వీరిని సన్మార్గమునకు మళ్ళించు విధముగా భగవానుడు మనయందు కృపతో ప్రవర్తించును. అట్లు కాకున్న వారు ఇంకను దూరమయ్యెదరను భయముతో ).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో మీమాంసాది దర్శనములను ఖండిస్తూ కర్మకు, శాస్త్ర విధికి ఫల ప్రదాత పరమాత్మయేనని, అందువలన వాటిని భగవదారాధనా పరముగనే నిర్వర్తించవలెనని ప్రతిపాదిస్తున్నారు.

**క్రియా తత్ శక్తి వా కిమ్ అపి తత్ అపూర్వమ్ పితృసుర**
**ప్రసాదః వా కర్తుః ఫలదః ఇతి రంగేశ! కుదృశః**
**త్వత్ అర్చా ఇష్టా పూర్తే ఫలమ్ అపి భవత్ ప్రీతిజమ్ ఇతి**
**త్రయీ వృద్ధాః తత్తత్ విధిః అపి భవత్ ప్రేరణమ్ ఇతి** **20**

ఓ రంగేశ! యజ్ఞ, యాగాది కర్మల ఫలము అపూర్వము అను అనిర్వచనీయమైన శక్తి ద్వారా కలుగునని, దేవ, పితృ దేవతల వలన కలుగునని కుదృష్టులు కొందరు(మీమాంసకాదులు) చెప్పెదరు. కాని శాస్త్రము క్షుణ్ణముగా తెలిసిన పెద్దలు ఈ యజ్ఞ యాగాది కర్మలు గాని, ఇష్టాపూర్తాది కార్యములు గాని నీ ఆరాధనారూపములే అనియు, నీ ఆజ్ఞానుసారముననే జరుగుచుండుననియు, వాని ఫలము కూడ నీ అనుగ్రహము వలననే కలుగుననియు

చెప్పెదరు. ఆ శాస్త్రములు కూడ నీ ప్రసాదములు కదా! ( నిన్ను మఱచి నిర్జీవమైన అపూర్వమునో, నీ సృష్టి లో భాగమయిన ఇతర దేవతలనో ఫల ప్రదాతలనుట ఎట్లు).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర్ భట్టర్ స్వామి తరువాతి శ్లోకంలో సాంఖ్య, యోగ, పాశుపత దర్శనములను నిరసిస్తున్నారు

**సంచష్టే న ఈశ్వరమ్ త్వామ్ పురుషపరిషది న్యస్య యద్వా అన్యపర్యాత్**
**సాంఖ్యః యోగీచ కాక్వా ప్రతిఫలనమ్ ఇవ ఐశ్వర్యమ్ ఊచే కయాచిత్**
**భిక్షౌ శైవః సురాజంభవమ్ అభిమనుతే రంగరాజాదిరాగాత్**
**త్వామ్ త్వామ్ అవ అభ్యధాః త్వమ్ నను పర విభవ వ్యూహన ఆధ్యమ్ భవిష్ణుమ్** **21**

సాంఖ్యులు పరమాత్మ అస్తిత్వమును ఒప్పుకోక ప్రకృతి పురుష తత్త్వములు 25 అని గుర్తిస్తారు. యోగదర్శనము పరమాత్మను గుర్తించినా విలువ నీయరు. ఒకని వద్ద పది పైసలున్నను పైస లేకపోయినను పెద్ద తేడా ఏమి యుండును. ఇక, పాశుపతము తన బ్రహ్మ హత్యా పాతకము పోగొట్టుకొనుటకు భిక్షుకునిగా నీ వద్ద బిచ్చమెత్తిన శివుని పరమాత్మగా వర్ణిస్తుంది. ఇవి అన్నియు వేద ప్రామాణ్యములు కావు.
ఓ రంగనాథా! నీ యొక్క పర, వ్యూహ, విభవ, అర్చ, అంతర్యామి మూర్తుల గూర్చి నీ అనంత కళ్యాణ గుణములను గూర్చి చెప్పెడి, వక్తృత్వ, వంచనాది దోషములు లేక నీచే ప్రవచించబడి, సనత్కుమార, శాండిల్య, నారదాదుల చే ప్రచారము చేయబడిన భగవత్ శాస్త్రము అయిన పాంచరాత్ర శాస్త్రము మాత్రమే వేదార్థమును సరిగా అందించును

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి తరువాత శ్లోకములో వేదములందలి విధి, నిషేధ వాక్యములకే పెద్ద పీట వేసి, సిద్ధార్థ వాక్యములకు విలువ నీయని మీమాంసకులను నిరసిస్తున్నారు

**అత్ర ఆస్తే నిధిః ఇతివత్ పుమర్థభూతే**
**సిద్ధార్థా అపి గుణరూపవృత్త వాదాః**
**రంగేశ! త్వయి సకలాః సమన్వయంతే**
**న ఉపాసా ఫల విదిభిః విశేష ఏషామ్** **22**

వేద మంత్రములు ఱెండు విధములుగా నుండవచ్చును. కొన్ని వాక్యములు 'సత్యమ్ వద', ధర్మమ్ చర', 'మా గృధః కస్యస్విద్ధనమ్', వంటి వాక్యములు విధి, నిషేధ (పని చేయుటకు గాని చేయకుండుటకు గాని ఆజ్ఞ విధించువంటివి) వాక్యములు, మఱి కొన్ని 'సత్యమ్, జ్ఞానమ్, అనంతమ్ బ్రహ్మ', వంటి సిద్ధార్థ వాక్యములు. మీమాంసకులు విధి, నిషేధ వాక్యములకు మాత్రము విలువ నిచ్చి సిద్ధార్థ వాక్యములను ప్రమాణములుగా పరిగణించరు. ఇచ్చట నిధి యున్నది, నీకు సంతానము కలిగినది మున్నగు వాక్యములను పరిగణనలోనికి తీసికొనకుండుట తప్పు. అట్టి వాక్యమును నీకు నిధి కావలెనన్న ఇచ్చట నున్నది, కనుగొని తీసికొనుము అని అర్థము చేసుకొనవలెను. అటులనే బ్రహ్మ విత్ ఆప్నోతి పరమ్, అనగా బ్రహ్మను తెలుసుకొనిన వాడు బ్రహ్మను పొందును అనిన, బ్రహ్మను తెలుసు కొనుము, అట్లయిన బ్రహ్మను పొందగలవు, అని అర్థము చేసుకొన వలెను.

ఓ రంగనాథా! జైమిన్యాది పూర్వ మీమాంసకులు చెప్పునట్లు సిద్ధార్థ వాక్యములు అప్రామాణ్యములు కావు. నీ సకల స్వరూప, రూప,కళ్యాణగుణ, వైభవములు, నిన్ను చేరు ఉపాసనా మార్గములు ఉపనిషదాదుల యందు వివరముగా చెప్పబడినవి. అవి అన్నియు సమతుల్యములే, స్వీకార్యములే. వాని ప్రామాణ్యత యందు తారతమ్యము లేదు

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు శ్లోకములో సిద్ధాంతపర వేద వచనముల ప్రామాణ్యత నిరూపించి ఈ శ్లోకములో ఛాందోగ్యోపనిషత్ నందలి ' ...అద్వితీయమ్' అను శృతి వివరిస్తున్నారు

**దేహః దేహిని కారణే వికృతయః జాతిః గుణః కర్మచ**<br>
**ద్రవ్యే నిష్ఠితరూప బుద్ధివచనాః తత్స్యాత్ తథా ఇదమ్ జగత్**<br>
**విశ్వమ్ త్వయి అభిమన్యసే జగదిషే తేన అద్వితీయః తతః**<br>
**మాయా ఉపాధి వికార సంకరకథా కా నామ రంగేశ్వర! 23**

ఓ రంగేశ్వర! దేవ, మనుష్యాది దేహములు జీవుని యందును, ఘట, పటాది పదార్థవికారములు, వాని కారణములైన మట్టి, దారముల యందును, ఘటత్వాది పదార్థ జాతులు, నీల, శుక్లాది గుణములు, గమనాగమనాది క్రియలు ద్రవ్యముల యందు, ఆశ్రితమై యుండుట వలన వాని స్వరూపము, తద్విషయక జ్ఞానము, వాచక శబ్దములు క్రమముగా జీవ, కారణ, ద్రవ్యములయందు విశ్రాంతమై యుండును. అటులనే ఈ సమస్త విశ్వము నందలి సకల చేతనా చేతనములకు అంతర్యామిగా అపృథక్సిద్ధ విశేషణరూపముతో నుండగా నీవు సంకల్పించెదవు. కావుననే శృతి, స్మృతులు నిన్ను అద్వితీయ శబ్దముతో కీర్తించును. (ఇంతకు ముందు చెప్పినట్లు మాయా వాదులైన శాంతరాద్వైతులు వర్ణించు ఒకే నిర్విశేష చిన్మాత్రమైన బ్రహ్మము అనిర్వచనీయమైన అవిద్య చే కప్పబడెను అనుట కాని, భాస్కరాదులు చెప్పునట్లు ఉపాధి చే పర బ్రహ్మ వేఱుగా భాసించుననుట గాని, యాదవ ప్రకాశకమతస్థులు చెప్పు పరిణామ వాదము గాని శృతి విరుద్ధములు).

ఛాందోగ్యోపనిషత్ నందు 'సత్ ఏవ....ఇదమగ్ర ఆసీత్. ఏకమేవ. అద్వితీయమ్' అని యున్నది. ఇందు అద్వితీయమనగా ఱెండవది లేదను అర్థమున, వివిధ అద్వైత మతస్థులు, బ్రహ్మమొక్కటే సత్యమని మిగిలినదంతయు మిథ్య యని వివరింతురు. అది తప్పు. ఈ రాజు అద్వితీయుడనగా అట్టి స్వరూప, రూప, గుణ, విభవ, ఐశ్వర్యములు గల రాజు వేఱొకడు లేడని గాని, ఆరాజునకు రాజ్య, ఐశ్వర్యాదులు గాని, భార్యా, పరివార వర్గములు గాని లేక ఒంటరివాడని అర్థము కాదు కదా. పరమాత్మ సమస్త చేతనా చేతనములయందు, దేహములయందు జీవుని వలె, ఘటాది మృణ్వికారములయందు మట్టి వలె, అంతర్యామిగా ఆశ్రయించి, కారణ భూతుడై, వానికి ఆధారభూతుడుగా అపృథక్సిద్ధ(వేఱుగా ఉండలేని) స్థితి లో వాటితోబాటుగానే యుండును. (రక్ష్యాపేక్షామ్ ప్రతీక్షతే అన్నట్లుగా). అట్టి పరమాత్మ తన స్వరూప, రూప, గుణ, విభవ, ఐశ్వర్య, లక్ష్మీ సాహచర్యముల వలన అద్వితీయుడు. అట్టి మఱియొక పరమాత్మ లేడు అని అర్థము.

చాలా ముఖ్య మైన విషయమగుట వలన కొంచెం ఎక్కువ వ్రాయవలసి వచ్చింది, ఎంత కుదించినా. క్షమించాలి.

మన సిద్ధాంతంలో తత్త్వములు మూడు. జీవుడు, ప్రకృతి, పరమాత్మ. జీవుడు గాని, ప్రకృతి గాని ఎల్లప్పుడు పరమాత్మ తో కలిసే ఉంటారు. అట్లు ఎప్పుడు విడి వడ కుండ కలిసి ఉండడాన్ని అపృథక్సిద్ధ సంబంధము అంటారు. ఉదా. కు దండీ, కుండలీ అన్నామనుకోండి. అంటే దండము కలవాడు, కుండలములు కల వాడు అని అర్థము. కాని, దండము గాని, కుండలములు గాని వేఱు చేయవచ్చును. అంటే అవి అపృథక్సిద్ధములు కావన్న మాట. ఆవుకి గంగడోలు ఉంటుంది. గంగడోలు లేకుండా ఆవు ఉండదు. అంటే గంగడోలు, ఆవుల సంబంధము అపృథక్సిద్ధము. లీలా విభూతిలో జీవుని యందు, ఇతర జడ పదార్థములయందు పరమాత్మ అంతర్యామి గా ఎల్లప్పుడూ ఉంటాడు. నిత్య విభూతి లో కూడా ఆయనలో కాని ఆయనతో కాని ప్రకృతి, జీవములు ఎల్లప్పుడూ ఆయనతో కలిసే ఉంటాయి.

Some people say this concept as follows. 'Jeeva and Prakriti are separate from Paramatma but not separable. 'This is unique feature of Visishtadvaita concept. We should all be ever indebted to Bhagavadramanuja for having introduced this concept to us.

ఈ విషయమును మన సిద్ధాంత గ్రంథములలో సామానాధికరణము అను వ్యాకరణ సూత్ర విశేష సహాయముతో కూడా వివరిస్తారు.

అనగా, అద్వైత సిద్ధాంతము నందు పరమాత్మ ఒక్కటే సత్య తత్త్వము.
విశిష్టాద్వైతము నందు తత్త్వములు మూడు. కాని, మిగిలిన రెండు తత్త్వములు పర మాత్మ తోటే ఉంటాయి. జీవ, ప్రకృతి తత్త్వములకు పరమాత్మను విడిచి అస్థిత్వము లేదు.
ద్వైతము నందు మూడు తత్త్వములకు ప్రత్యేక అస్థిత్వము సంభవము.

మా ఆచార్యులు ఈ అపృథక్త్వాన్ని వివరించటానికి పండు, దాని రంగు రుచులను ఉదాహరణంగా చెప్పేవారు. పండులో ఉన్న రంగుకాని రుచిగాని పండుని వదిలి ఉండలేవు. కాని రంగైనా, రుచియైనా పండుకంటే వేరైనవే. అలాగనే పరమాత్మని వదిలి జీవుడుగాని ప్రకృతిగాని ఉండలేవు. Their existence is only when they are part of the fruit. అలాగని అవి పరమాత్మే అని చెప్పటం( అద్వైతులవలె) కుదరదు. అలా ఆ రచీ, రంగూ పండే అని చెప్పటానికి వీలుగా లేకుండా ఉన్నందున వాటిని పండుకంటే భిన్నమైనవనే చెప్పాలిగదా!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి శ్రుతుల యందు అభేద శ్రుతుల నెట్లు సమన్వయము చేసుకొనవలెనో చెప్పుచున్నారు ఈ శ్లోకములో.

**స్థితి ఉత్పత్తి ప్రవృత్తి గ్రసన నియమన వ్యాపనైః ఆత్మనః తే**
**శేష అశేషః ప్రపంచవపుః ఇతి**
**భావతః తస్య చ అభేదవాదాః**
**సర్వమ్ ఖలు ఐతదాత్మ్యమ్ సకలమ్**
**ఇదమ్ అహమ్ తత్ త్వమ్ అసి ఏవమ్ ఆద్యాః**
**వ్యాఖ్యాతా రంగధామ ప్రవణ! విజయిభిః వైదికైః సార్వభౌమైః**

(శ్రుతుల యందు కొన్ని జీవ, పరమాత్మల భేదమును తెలుపుతాయి. మఱికొన్ని జీవ పరమాత్మల అభేదమును తెలుపుతున్నట్లు భాసిస్తాయి.).

ఓ రంగనాథా! చేతనా చేతనముల కన్నిటికి సృష్టి, స్థితి, లయ, వ్యాప్త, నియమనాది సకల కార్యములను నీవు నిర్వర్తించి, రక్షించుచుందువు. సమస్త ప్రపంచములు నీ శరీరము వలె శేషభూతమై యథేష్టవినియోగార్హమై యుండును. వీని కంతకును నీవు స్వామియై అంతరాత్మవై యుందువు. ఈ కారణముగనే నీ శరీర సదృశమైన ఈ చరా చర ప్రపంచమును నీకు అభేదముగా ఈ శరీరాత్మక భావముతోనే శ్రుతులు వర్ణించును. ('తత్త్వమసి'అనగా నీవు (జీవుడు) ఆపరబ్రహ్మాత్మకుడవు అనగా ఆ పరబ్రహ్మము నీకు (జీవునికి) అంతరాత్మయై యున్నాడు అని అర్థము.

'సర్వమ్ ఖలు ఐతదాత్మ్యమ్' అనగా ఈ సమస్త ప్రపంచము పరబ్రహ్మాత్మకము. 'సకలమ్ ఇదమ్ అహమ్' అనగా ఈ సమస్త ప్రపంచము వాసుదేవరూపము(శరీరము). ఇత్యాది.

విజయశీలురైన వైదిక సార్వభౌములు ఈ పరముగనే వ్యాఖ్యానంతో. (వ్యాస, పరాశరాది మహర్షుల మతానుసారముగా సగుణ శ్రుతులను, నిర్గుణ శ్రుతులను, భేద శ్రుతులను, అభేద శ్రుతులను, ఘటక శ్రుతులను అన్నిటినీ ప్రామాణ్యముగా స్వీకరించి, వాటిసరిఅయిన సమన్వయముతో, యామున, భగవద్రామానుజాది జగదాచార్యులు ఈ అభేద శ్రుతులను శరీరాత్మక భావముతో తమ గ్రంథముల యందు విస్తారముగా వివరించి విజయ శీలురైరి. )

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి శ్రుతుల యందు అభేద శ్రుతుల నెట్లు సమన్వయము చేసుకొనవలెనో చెప్పుచున్నారు ఈ శ్లోకములో.

**స్థితి ఉత్పత్తి ప్రవృత్తి గ్రసన నియమన వ్యాపనైః ఆత్మనః తే**
**శేష అశేషః ప్రపంచవపుః ఇతి**
**భావతః తస్య చ అభేదవాదాః**
**సర్వమ్ ఖలు ఐతదాత్మ్యమ్ సకలమ్**
**ఇదమ్ అహమ్ తత్ త్వమ్ అసి ఏవమ్ ఆద్యాః**
**వ్యాఖ్యాతా రంగధామ ప్రవణ! విజయిభిః వైదికైః సార్వభౌమైః** **25**

(శ్రుతుల యందు కొన్ని జీవ, పరమాత్మల భేదమును తెలుపుతాయి. మఱికొన్ని జీవ పరమాత్మల అభేదమును తెలుపుతున్నట్లు భాసిస్తాయి.).

ఓ రంగనాథా! చేతనా చేతనముల కన్నిటికి సృష్టి, స్థితి, లయ, వ్యాప్త, నియమనాది సకల కార్యములను నీవు నిర్వర్తించి, రక్షించుచుందువు. సమస్త ప్రపంచములు నీ శరీరము వలె శేషభూతమై యథేష్టవినియోగార్హమై యుండును. వీని కంతకును నీవు స్వామియై అంతరాత్మవై యుందువు. ఈ కారణముగనే నీ శరీర సదృశమైన ఈ చరా చర ప్రపంచమును నీకు అభేదముగా ఈ శరీరాత్మక భావముతోనే శ్రుతులు వర్ణించును. ('తత్త్వమసి'అనగా

నీవు (జీవుడు) ఆపరబ్రహ్మాత్మకుడవు అనగా ఆ పరబ్రహ్మము నీకు (జీవునికి) అంతరాత్మయై యున్నాడు అని అర్థము.
'సర్వమ్ ఖలు ఐతదాత్మ్యమ్' అనగా ఈ సమస్త ప్రపంచము పరబ్రహ్మాత్మకము. 'సకలమ్ ఇదమ్ అహమ్' అనగా ఈ సమస్త ప్రపంచము వాసుదేవరూపము(శరీరము). ఇత్యాది.
విజయశీలురైన వైదిక సార్వభౌములు ఈ విధముగనే వ్యాఖ్యానించిరి.
(వ్యాస, పరాశరాది మహర్షుల మతానుసారముగా సగుణ శ్రుతులను, నిర్గుణ శ్రుతులను, భేద శ్రుతులను, అభేద శ్రుతులను, ఘటక శ్రుతులను అన్నిటినీ ప్రామాణ్యముగా స్వీకరించి, వాటిసరిఅయిన సమన్వయముతో, యామున, భగవద్రామానుజాది జగదాచార్యులు ఈ అభేద శ్రుతులను శరీరాత్మక భావముతో తమ గ్రంథముల యందు విస్తారముగా వివరించి విజయ శీలురైరి. )
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి సమస్త చిదచిదాత్మకమైన ప్రపంచమునందు ఎల్ల చోటుల, ఎల్ల వేళల వేంచేసి యుండెడి శ్రీమన్నారాయణ పరతత్త్వమును తెలియని కొందరి విషయము వివరిస్తున్నారు ఈ శ్లోకములో.

**సరాజకమ్ అరాజకమ్ పునః అనేకరాజమ్ తథా**
**యథాభిమత రాజకమ్ జగత్ ఇదమ్ జజల్పుః జడః**
**జగౌ అవశ చిత్రతాతరత మత్వతర్క అంగికా**
**శ్రుతిః చిత్ అచిత్ త్వయా వరద! నిత్యరాజన్వతీ** 26

హే వరద! వేదాంత తాత్పర్యములు తెలియని అజ్ఞులు కొందరు 'ఈజగత్తు నందు పరమేశ్వరుడు లేడు' అనియు, 'ఉన్నాడు' అనియు, 'అనేక మంది ఈశ్వరులు (చతుర్ముఖ బ్రహ్మ, శివుడు, ఇంద్రాదులు) ఉన్నారు' అనియు యథాభిమతముగా పలుకు చుందురు.
నైయాయికులు పరమేశ్వరుని శ్రుతి ప్రమాణములతో కాక అనుమాన ప్రమాణముతో తెలుసుకొనవలెనని నిన్ను నిమిత్త మాత్రునిగా గుర్తించెదరు. పూర్వ మీమాంసకులు నీ అస్థిత్వమునే గుర్తించరు. పాశుపత, శాక్తేయ, గాణాపత్యాది తమతమ అభిరుచుల ప్రకారము పరమేశ్వరుని నిర్ణయించుకొనెదరు. ఇట్లు లోకులు అజ్ఞానము, అన్యథా జ్ఞానము, విపరీత జ్ఞానములతో ప్రవర్తించెదరు. మేము శ్రుతులను అంగీకరించి, తత్ప్రకారంగా చేతనాచేతనమయ సమస్త జగత్పాలకుడవైన నిన్నే మా స్వామిగా స్వీకరించితిమి. ఈ జగత్తు నందు సమస్త చేతనములు కర్మ పరతంత్రమై సుర, నర, తిర్యక్, స్థావర రూపములతో వాని కర్మానుసారము తారతమ్యములతో నీ ఆజ్ఞానుసారము ప్రవర్తించును. లేకున్న ఈ ప్రపంచము నిస్సారమై, అరాజకమై ఎట్లుండెడిదో కదా!

Couple of words, may be out of context. I, while sending today's message of Rangaraja Stavam, was remembering one Shloka from Sri Guna Ratna Kosham of Parasara Bhattar Samy which most of you may be aware. ఆహుః వేదా న మానమ్ కతిచన కతిచ ఆరాజకమ్ విశ్వమేతత్..... Once again in that Bhattar swamy rebukes various schools of Darshanas and Matas in a simple Shlokam.

By the way, నిన్నటి శ్లోకంలో వచ్చిన శరీర, శరీరి భావము కూడా మన సిద్ధాంతము లో చాలా ముఖ్యమైనది. భగవద్రామానుజులు మనకందిచ్చిన గొప్ప concepts లో విశిష్టాద్వైతము నందు ఇది ఒకటి. ఈ వివరాలు తెలిస్తే బాధ లేదు. తెలియకపోతే మన ఆచార్య స్వాముల legends వద్ద తెలుసు కొనవచ్చును. Adiyen

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో చతుర్ముఖ బ్రహ్మాదులు ఎట్లు పరమాత్మ స్వరూపములు కాలేరో వివరిస్తున్నారు.

**బ్రహ్మ ఆద్యాః సృజ్యవర్గే భృకుటి భటాటయా ఉద్ఘటీతా నావతార**
**ప్రస్తావే తేన న త్వమ్ న చ సదృశా**
**విశ్వమేకాతపత్రమ్**
**లక్ష్మీ నేత్రా త్వయా ఇతి శ్రుతి మునివచనైః త్వత్పరైః అర్పయామః**
**శ్రీరంగ అంబోధి చంద్ర ఉదయ!**
**జలమ్ ఉచితమ్ వాదికౌతస్కుతేభ్యః** **27**

ఓ శ్రీరంగాంబుధి ఉదయ చంద్ర! చతుర్ముఖ బ్రహ్మ, రుద్రాదులు నీ కను సన్నలలో మెలగుతూ, నీ ఆదేశాను సారము కార్య నిర్వహణమును చేయుచుందురు. (యో బ్రహ్మాణమ్ విదధాతి పూర్వమ్ యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై' , బ్రహ్మణః పుత్రాయ జ్యేష్ఠాయ, శ్రేష్ఠాయ విరూపాక్షాయ', మున్నగు శ్రుతులు ఈ విషయములు వివరిస్తాయి). నీ రామకృష్ణాద్యవతారములరూపములుగా వారు కానరారు. (శ్రుతులు నీవే పరతత్త్వమని( 'సహస్ర శీర్షా పురుషః' వేదాహమేతమ్ పురుషమ్ మహాంతమ్', హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ' , రాఘవత్వేభవత్ సీతా రుక్మిణీ కృష్ణ జన్మని' , ' కిమేకమ్ దైవతమ్ లోకే ...జగత్ప్రభుమ్ ....), ఘోషిస్తున్నాయి. వారు నీకు సములు గాని అధికులు గాని కారు. ఈ సమస్త విశ్వములకు లక్ష్మీపతి అయిన నారాయణుడే ఏక ఛత్రాధిపత్యముగా పాలించువాడని శ్రుతి, స్మృతి, పురాణేతిహాసములన్నియు వర్ణించుచుండగా, కేవలము యుక్తుల ఆలంబనతో పలుకు ప్రతివాదరూప కుదృష్టి మృతప్రాయులకు తిలోదకములిచ్చుట తప్ప ఏమి చేయగలము.

మనమందరము లక్ష్మీం క్షీర.....శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరామ్...అని చదువు తూ ఉంటాము కదా! అంటే స్వల్పమైన కను సన్నల చూపు పడుట వలన పొందిన వైభవములు గల బ్రహ్మేంద్ర గంగాధరులు కలిగన అమ్మ. పూర్తిగా పడియుంటే ఆ జీవులు పూర్తిగా మోక్షమునే పొందే వారు కదా! కొంచెం పడుట వలన ఈ విభూతి లోనే కొంచెం మంచి పదవి పొంది యున్నారు ఆ జీవుళ్ళు.
అదే ఈ రోజు శ్లోకంలో భట్టర్ స్వామి అనుగ్రహిస్తున్నది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి శ్రుతుల ప్రామాణ్యత నిరూపించి, ఆ అపౌరుషేయములైన శ్రుతులను స్మృతి, పురాణ, ఇతిహాసాది ఉపబృంహణముల సహాయముతో ఎట్లు అర్థము చేసుకొనవలెనో తెలిపి, వాటిని అనుసరించని, తప్పుగా అనుసరించెడి కుదృష్టులు, కుమతులు అయిన ఇతరులను నిరసించి, ముందు శ్లోకములో ద్వయమంత్రమునందలి శ్రీమత్ అను లక్ష్మీ పతిత్వము నిరూపించి నారాయణుని జగత్కారణత్వాది విషయములు

వివరించిరి. ఈ శ్లోకములో నారాయణ శబ్దార్థమును ఇంకను వివరించుతూ ఆయన సవిశేషుడని, సగుణుడని తెలుపుతున్నారు.

**దోష ఉపధా అవధి సమ అతిశయాన సంఖ్యా**
**నిర్లేప మంగళగుణ ఓఘు దుఘాః షట్ ఏతాః**
**జ్ఞాన ఐశ్వరీ శకన వీర్య బల అర్చిషః త్వామ్**
**రంగేశ! భాస ఇవ రత్నమ్ అనర్ఘయంతి** 28

**హే రంగేశ!= ఓ రంగనాథా!, తే గుణాః=నీ దయ, వాత్సల్యము మొదలైన గుణములు, నిర్లేపాః= దోషములు లేనివియు, మఙ్గళాః= కల్యాణగుణములును. తేషామోఘం= వాటి రాశిని, దుహన్తి= పూరించుచున్నవి. దోషోపధావధిసమాస్= పరిచ్ఛేదించునట్టివాటిని  అతిశేరతే= దాటిపోయినవి. అనగా నీ గుణములు దోషరహితములు, నీకు స్వతస్సిద్ధములు, అవధిలేనివియు, సాటిలేనివియును. అసంఖ్యాః= లెక్కకు మించినవియు. షడేతాః= షడ్గుణములు అని చెప్పబడు నీ ఐశ్వర్యము, జ్ఞానము, శక్తి, తేజస్సు వీర్యము బలము అను ఆరు గుణములు మొదలగునవి, రత్నమివ=మణివలె, అనర్ఘయన్తి= నిన్ను అనర్ఘమైనవానినిగా చేయుచున్నవి. అనగా అలంకరించుచున్నవి.**

హే రంగేశ! నీవు అఖిల హేయ ప్రత్యనీకుడవు. సకల కళ్యాణ గుణ మహోదధివి. నీ జ్ఞాన, ఐశ్వర్య, శక్తి, వీర్య, బల, తేజములను షడ్గుణములు రత్నమునకు కాంతి వలె అనర్ఘతను చేకూర్చును. నీ మంగళ గుణ విశేషములు అపారములు, అనుపమములు, అసంఖ్యాకములు, నిర్దోషములు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి తరువాత రెండు శ్లోకములలో భగవానుని షాడ్గుణ్యముల యందలి జ్ఞానమను గుణమును ప్రస్తుతిస్తున్నారు

**యుగపదత్ అనిశమ్ అక్షైః స్వైః స్వతః వాక్షకార్యే**
**నియమమ్ అనియమమ్ వా ప్రాప్య రంగాధిరాజ!**
**కరతల్వత్ అశేషమ్ పశ్యసి స్వప్రకాశమ్**
**తత్ అవరణమ్ అమోఘమ్ జ్ఞానమ్ ఆమ్నాసిషుః తే** 28

**హే రంగాధిరాజ!= ఓ రంగనాథా!, నీవు, స్వైః అక్షైః= నీయొక్క నేత్రము మొదలగు ఇంద్రియములవలన గాని, స్వతో వా= ఇంద్రియముల అవసరము లేకనే స్వయముగా గాని, అనగా కేవలము ధర్మభూతజ్ఞానముచేతనే, అక్షకార్యే= ఇంద్రియములకార్యమైన రూపము మొదలైనవాటిని గ్రహించుటలో, నియమం= అట్టి వాటిని కేవలము ఇంద్రియములచేతనే గ్రహించవలెను అను నియమముతోగాని, అనియమం వా= అట్టి నియమము లేకనైనను, అనిశం= ఎల్లపుడును, అశేషం= ఉభయవిభూతులలోని సమస్తవస్తువులను, యుగపత్= ఏకకాలముననే, కరతలవత్= అరచేతిలోనున్న వస్తువును ఎట్లు పూర్తిగా, అమోఘం= ఉన్నదానిని ఉన్నట్లుగా- అనగా**

**యథార్థముగా, పశ్యసి= తెలుసుకొనెదవు. స్వప్రకాశం= జ్ఞానాన్తరము అవసరము లేకనే తెలియబడు, తత్= ఆ నీ జ్ఞానము, అవరణం= ప్రతిబంధములు లేనిది అని, ఆమ్నాసిషుః= మరల మరల ప్రతిపాదింపబడుచున్నది. అనగా ఉపనిషత్తులలో ప్రతిచోటను, ప్రతి ఉపనిషత్తులోను మరల మరల చెప్పబడుచున్నది.**

సామాన్యముగా కన్ను, చెవి మున్నగు జ్ఞానేంద్రియములు చాక్షుష జ్ఞానము,శ్రవణ జ్ఞానము మొదలగు జ్ఞానములను వేఱువేఱుగా కలిగించును. అనగా కన్ను శ్రవణ జ్ఞానము కలిగించలేదు. అట్లే చెవి చాక్షుష జ్ఞానము కలిగించలేదు.

హే రంగరాజ! నీ విషయము నందు అట్టి నియమము వర్తించదు. ఏ ఇంద్రియములతో ఏ జ్ఞానమైనను, ఇంద్రియాపేక్ష లేక నేరుగా ధర్మభూతజ్ఞాన ప్రసారము ద్వారా ఐనను, ఉభయ విభూతులయందు ఎచటనైనను, సమస్త పదార్థముల బాహ్య అంతరముల యందును, అమోఘముగా, నిరాటంకముగా, ఎట్టి పరిచ్ఛేదములు లేక స్వయంప్రకాశకమైన నీ జ్ఞానము వలన సమస్త విషయములు కరతలమునందలి వలె నీకు యదార్థముగా తెలియవచ్చును. ఈ విషయము పౌనఃపున్యము గా ఉపనిషదాదుల యందు ప్రతిపాదితమైనది

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి 'అనియమమ్ వా ప్రాప్య' అని పూర్వ శ్లోకమునందు ప్రస్తుతించిన బడిన భగవానుని ఇంద్రియానియమిత జ్ఞాన వైభవమును కొనసాగిస్తున్నారు ఈ శ్లోకములో కూడ.

**నయన శ్రవణం దృశా శృణోషి అథ తే రంగపతే! మహేశితుః**
**కరణైరపి కామకారిణః ఘటతే సర్వ పథీనమ్ ఈక్షణమ్** 29

**హే రంగపతే= ఓ రంగనాథా!, నయనశ్రవణః= శ్రవణేంద్రియముతో చూచుచున్నావు, అథ దృశా శృణోషి= ఇంకను నేత్రముతో వినుచున్నావు.అనగా చెవి,కన్ను వంటి ఇంద్రియముల అవసరము లేకనే చూచుట,వినుట మొదలగు కార్యములను చేయుదువా? కరణైరపి= ఇంద్రియములతో, కామకారిణః= యథేచ్ఛగా ఖార్యములను నిర్వహించుచున్న, మహేశితుః= సర్వేశ్వరుడవగు, తే= నీయొక్క, సార్వపథీనం= విశ్వమునంతను సాక్షాత్కరించుకొను ఆకారమును, ఘటతే= కల్పింతువు.**

హే రంగ పతి! నీవు చెవులు కనుల పని చేయగలవు. అటులనే కనులు చెవుల పనులు చేయగలవు. అనగా నీ ఇంద్రియములకు మితులు లేవు. సకలేంద్రియములతో మనోరథానుసారముగా సమస్త కార్యములు నిర్వహించగల సర్వ శక్తి వంతుడవు, సర్వేశ్వరుడవైన నీకు ఈ లౌకిక సాక్షాత్కారాది విషయములు అసంభవము కాదు( 'సహస్ర శీర్షా పురుషః', 'విశ్వతః చక్షురుత విశ్వతః ముఖః', 'విశ్వతో బాహురుత విశ్వతః పాత్', 'యః సర్వజ్ఞః సర్వ విత్' , 'పరాస్య శక్తిః వివిధైవ శ్రూయతే', 'స్వాభావికీ జ్ఞాన బలా క్రియా చ', 'యః అస్యాధ్యక్షః పరమే వ్యోమన్', మున్నగు శ్రుతులు ఈవిషయాన్ని స్పష్టము చేయుచున్నవి).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు రెండు శ్లోకములలో భగవానుని జ్ఞాన గుణము కీర్తించి(జ్ఞానమనగా ఉపాధి రహితమై ఇతరానపేక్షితమై, సంకోచ రహితమై, సమస్త వస్తు విషయక స్వరూప స్వభావముల తలుపు గుణము) తరువాత షడ్గుణముల యందలి ఐశ్వర్యమును ప్రస్తుతిస్తున్నారు.

**సార్వజ్ఞేనాజ్ఞమూలమ్ జగదభిదధతః వారితాః సాక్షిమాత్రాత్**
**సాంఖ్య ఉక్తాత్ కారణమ్ త్వామ్ పరయతి భగవన్ ఐశ్వరీ రంగశాయిన్**
**అప్రేర్యాః అన్యైః స్వతంత్రః అప్రతిహతి సత్ అసత్ కర్మ వైత్ర్యా విచిత్రమ్**
**యత్ర ఇచ్ఛాలేశతః త్వమ్ యుగపత్ అగణ్యన్ విశ్వమ్ ఆవిష్కకర్త** **30**

**రఙ్గశాయిన్!= ఓ రంగనాథా! సార్వజ్ఞ్యేన = వెనుకటి రెండు శ్లోకములలో చెప్పబడిన నీయొక్క సర్వజ్ఞత్వముచేత, జగత్= ఈ జగత్తు, అజ్ఞమూలం= నిర్విశేషమైన చిత్తే బ్రహ్మమని చెప్పుచున్నవారు అయిన శంకరాచార్యులు మొదలైనవారు- పరబ్రహ్మము నిర్గుణమని వాదించునట్టి శంకరాచార్యులు మొదలైన కుమతస్థులు అందరును, వారితాః= నిరసించబడిరి. ఐశ్వరీ= నీయొక్క ఈశ్వరత్వగుణము, కారణం= ఈ జగత్తు సృష్టింపబడుటకు ఉపాదానకారణభూతము అయిన, త్వాం= నిన్ను, సాఙ్ఖ్యోక్తాత్= సాంఖ్యులచే చెప్పబడు, సాక్షిమాత్రాత్= చైతన్యముకంటె, పరయతి= పరమైనవానిగ (గొప్పవానిగ) చేయుచున్నది. యత్ర= ఐశ్వర్యగుణముండగా, అన్యైరప్రేర్యః= ఇతరులచే నియమింపబడసాధ్యముకాని, స్వతంత్రః= సర్వస్వతంత్రుడవు నీవు అని, అగణయన్= తెలుసుకొనుచు, ఇచ్ఛాలేశతః= సంకల్పలేశముచే, సదసత్కర్మవైత్ర్యా= పుణ్యపాపముల వైచిత్రి చేత, విచిత్రం= దేవమనుష్యాది వివిధమైన ఆకారముగల విశ్వం= జగత్తును, యుగపత్= ఏకసమయమున, అప్రతిహతి= ఆటంకములు లేనిదిగను, ఆవిశ్చకర్థ= ఆవిర్భవింపచేసితివి. నీయొక్క నియమించు స్వభావము అంత గొప్పది కదా!**

సాంఖ్యము జడమైన ప్రకృతికి జగత్కారణత్వము అంటగట్టి పురుషుని సాక్షీ చైతన్యముగా వర్ణించును. అద్వైతము బ్రహ్మమును నిర్విశేష చిన్మాత్రము గా తెలిపి ప్రత్యక్షముగా కనిపించు జగత్తును మిథ్యామాత్రమనును. హే రంగశాయిన్! సర్వజ్ఞుడవైన నీ స్వరూప, వైభవములు వారెఱుగరు. ఈ లీలా విభూతియు, ఆ నిత్య విభూతియు నీ ఐశ్వర్యమునందలి అంతర్భాగమే( ఐశ్వర్యమునగా స్వేతర సమస్త వస్తు నియమన సామర్ధ్యము. )నీవు సంకల్ప మాత్రమున, సునాయాసముగా, ఉపాదాన, నిమిత్త, సహకారి, కారణములన్నియును నీవే అయి, నిరాటంకముగా, సమస్త జీవుల కర్మానుసారము, సంపూర్ణ స్వాతంత్ర్యముతో ఈ అసంఖ్యాకమైన సమస్త విచిత్ర విశ్వములను లీలగా సృజించెదవు. ఇదంతయు నీ ఐశ్వర్య మహిమయే గదా!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి భగవానుని షడ్గుణముల యందలి శక్తి యను గుణమును ఈ శ్లోకములో వర్ణించుచున్నారు. శక్తి యనగా అఘటన, ఘటనాసామర్ధ్యము. అనగా యత్కించిత్ సాధన నిరపేక్షముగా సంకల్ప మాత్రమున సృష్టి, స్థితి, లయ రూప కార్యములను నిర్వహించునది.

**కార్యే అనంతే స్వతను ముఖతః త్వామ్ ఉపాదానమ్ ఆహుః**
**సా తే శక్తిః సుకరమ్ ఇతరత్ చ ఇతి వేలామ్ విలంఘ్య**

**ఇచ్ఛా యావత్ విహరతి సదా రంగరాజ అనపేక్షా**

**సా ఏవ ఐశానాత్ అతిశయకరీ సా ఊర్ణనాభౌ విభావ్య** 31

**హే రంగరాజ!= ఓ రంగనాథా!, అనపేక్షా= కారణమును ఎదురుచూడకనే, నీయొక్క, ఇచ్ఛా= సంకల్పము, సదా= ఎల్లపుడును, సుకరం ఇతరత్ చ ఇతి= ఇది సుకరము, ఇది దుష్కరము అను, వేలాం= హద్దును, విలంఘ్య= దాటి, యావత్= సమస్తమైన, కార్యమును, విహరతి= చేయుచున్నది. అనంతే= అసంఖ్యాకమైన కార్యములలో, త్వాం= నిన్ను, స్వతనుముఖతః= తనకు శరీరమైన చిదచిత్తులద్వారా, ఉపాదానం= ఉపాదానకారణమని, ఆహుః= చెప్పుదురు.తే శక్తిః= నీయొక్క శక్తి, ( ఇది సుకరమైనది, ఇది దుష్కరమైనది అను తేడా లేకుండ) సా= అది. సైవ= అదియే, ఈశానాత్= శక్తిమంతమైన సర్వనియమనము కంటెను, అతిశయకరీ= గొప్పదైన లోకనిర్మాణము. సా= అట్టి శక్తి, ఊర్ణనాభౌ= సాలెపురుగులో, విభావ్యా= కనబడుచున్నది.**

హే రంగరాజ! నీ శక్తి స్వతస్సిద్ధముగా నీ సంకల్పముచే నిరాటంకముగా, ఇది సుకరమని, ఇది దుష్కరమని చూడక ఈ సృష్టి యందు సకల కార్యములయందు( అనగా సృష్టి, స్థితి, లయ రూప కార్యములు ) తెలియబడు చున్నది. ఈ చేతనా చేతనములన్నిటికీ నీవే ఉపాదాన కారణముగా వేద వేత్తలు చెప్పుదురు. ('తదైక్షత బహుస్యామ్ ప్రజాయేతి', యతో వా ఇమాని భూతాని జాయంతి' మున్నగు శ్రుతులు). సాలీడు ఎట్లు తన గూడును తన శరీరముతోనే నిర్మించి పిదప తానే ఎట్లు గ్రసించునో( యథా ఊర్ణ నాభిః సృజతే ) అట్లే సూక్ష్మ చేతనా చేతన రూప విశిష్టుడవుగా నున్న నీవు ఆ చేతనాచేతనములకు నామ రూప విభాగము(నామ రూపే వ్యాకరవాణి) ద్వారా స్థూల రూపాలుగా విస్తరింప చేయుదువు. పిదప గ్రసించెదవు. ఇది అంతయు నీ అచింత్యమైన శక్తి యొక్క మహిమ కదా!

ఈ శ్లోకములు భట్టర్ స్వామి పాశుపత మత ఖండనము చేయు చున్నారని పెద్దలు చెప్పుదురు. పాశుపతము ఈశ్వరుని ఉపాదాన కారణముగా అంగీకరించదు. పాశుపతము వైదికులు దోష భరితమైన తత్త్వ దర్శనములతో అవైదిక పాషండులగుదురను గౌతముని శాపము వలన జనించిన మతము(వివరాలకు వరాహ పురాణము చూడవచ్చును). ఈ మతము నందు శైవము, పాశుపతము, కాపాలము, కాలాముఖము, శుద్ధ శైవము, సోమ సిద్ధాంతము అను పరస్పర విరుద్ధములైన శాఖలు గలవు. పాశుపతము నందు పశువు, పతి, పాశము అని మూడు తత్త్వములు గలవు. పశువనగా అణు పరిమాణుడైన జీవుడు. పాశమనగా అవిద్య, కర్మ, మాయ, విశ్వము, తిరోధాన శక్తి అనెడు పంచ మూలకములతో తయారైన తత్త్వము. పతి యనగా శివ తత్త్వము. ఇందు జగత్తుకు ఈశ్వరుడు కేవలము నిమిత్త కారణముగాని ఉపాదాన కారణము కాదు. భగవానుని శక్తి ప్రతిపాదన ద్వారా భట్టర్ స్వామి ఈ పాశపతాది మతములను నిరసిస్తున్నారు ఈ శ్లోకంలో.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి తరువాతి శ్లోకములో షడ్గుణములయందలి బలము అను గుణము యొక్క స్వరూప, ప్రయోజనములను అనుసంధానము చేయుచున్నారు. బలమనగా అనాయాసముగా చిదచిదాత్మకమైన జగద్ధారణ సామర్థ్యము.(బలమ్ ధారణ సామర్థ్యమ్).

**స్వ మహిమ స్థితిః ఈశ! భృశక్రియః అపి**
**అకలితశ్రమ ఏవ బిభర్షి యత్**
**వపుః ఇవ స్వమ్ అశేషమ్ ఇదమ్ బలమ్**
**తవ పర ఆశ్రిత కారణ వారణమ్** 32

**హే ఈశ!= స్వామీ!, స్వమహిమ్ని= తనమహిమయందు, స్థితిః= స్థిరత ఎవరికి యున్నదో, అట్టివాడవు నీవు. భృశక్రియోపి= సృష్టి మొదలగు క్రియలను చేయువాడవు. అకలితశ్రమ ఏవ= అట్టి కార్యములు చేయుటచే నీకు ఎట్టి శ్రమయు కలుగలేదు, వపురివ= నీ శరీరము వలె, అశేషం= అశేషజగత్తును బిభర్షి=నీవు భరించుచున్నావు. ఇదం తవ బలం= ఇదియంతయు నీ బలమే గదా! పరాశ్రితకారణవారణం= ఇతరచేతనములలో కారణత్వము అను విలక్షణతను కల్పించటయు నీ బలముయొక్క స్వరూపమే గదా!**

హే స్వామిన్! అతులిత స్వమహిమాన్వితుడవైన నీవు అత్యంత శీఘ్రముగా జగత్సృష్ట్యాది వ్యాపారములు అనాయాసముగా నిర్వహించుచు ఈ సమస్త జగత్తును శరీరము వలె ధారణ చేసి యుందువు( జగత్సర్వమ్ శరీరమ్ తే...రామాయణమ్, యు. కాం.) ఇది చేతనాంతరాద్యధిష్ఠిత మృత్తత్త్వాది కారణ వైలక్షణ్యాపాదకముగా నుండు నీ బలమను గుణ విశేషము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో భగవానుని షడ్గుణములయందలి వీర్య గుణమును ఉల్లేఖిస్తున్నారు. పరమాత్మ సమస్త జగత్తునకు ఉపాదానమైనప్పటికీ తన స్వరూప స్వభావములయందు ఎట్టి వికారములు లేక యుండు గుణమును వీర్య మని అందురు(తస్యోపదాన భావేపి వికార విరహోపి యః
వీర్యం నామ గుణః....). అనగా ఒక కుండ మట్టి నుండి తయారైతే కుండకు మట్టి ఉపాదాన కారణమగును. కాని ఇందు కుండ తయారుటకు మట్టి వికారము చెందును. అటులనే దారములు మార్పు చెంది వస్త్రము తయారగును. కాని భగవానుని విషయమున అట్లు కాదు అని తెలుపుచున్నారు.

**మృగనాభి గంధ ఇవ యత్ సకల అర్థాస్**
**నిజసన్నిధేః అవికృతః వికృణోషి**
**ప్రియ రంగ! వీర్యమ్ ఇతి తత్తు వదంతే**
**సవికార కారణమ్ ఇతః వినివార్యమ్** 33

**హే ప్రియరంగ= ఓ శ్రీరంగముపై ప్రీతిగలవాడా!, నీవు, మృగనాభిగన్ధ ఇవ= కస్తూరిపరిమళమువలె, స్వయం అవికృతః= నీలో ఎట్టి మార్పును పొందకనే, నిజసన్నిధేః= నీ సన్నిధిమాత్రముచేతనే, సకలార్థాస్= సమస్తపదార్థములను, వికృణోషి= మారునట్లు చేయుదువు. అనగా సృష్టింతువు. ఇతి యత్ తత్తు వీర్యమితి వదన్తే= నీలో ఎట్టి మార్పును లేకుండనే ఇతరపదార్థములలో మార్పును కలిగించి సృష్టించు ఈ నీ ప్రభావమును నీ వీర్యమని**

**చెప్పుదురు. ఇతః= ఈ వీర్యగుణముచే, సవికారకారణం వినివార్యమ్= ఇతరపదార్థములకు వికారమును కలిగించు నీ వీర్యముచే సృష్టికార్యము జరుగుట ఫలించినది.**

హే రంగ క్షేత్ర నివాస రసిక! కస్తూరికా గంధము తానెట్టి మార్పు చెందకున్నను తన సాన్నిధ్యముచే పదార్థముల యందు వికారములు కలుగ చేయునో అటులనే నీవు నీయందు ఎట్టి వికారములు లేకనే నిజ సాన్నిధ్యముచే సమస్త ప్రపంచ పదార్థముల యందు వికారము కలిగించి అనగా సృష్టి చేసి తత్తత్పదార్థముల పరిణామ కారణభూతుడవై యుందువు. ఈ మహిమ నీ వీర్య గుణ విశేషము.

ఈ శ్లోకమున భట్టర్ స్వామి బ్రహ్మ నిర్విశేషమనెడు అద్వైతులనే గాక, నిర్విశేష బ్రహ్మమే జగదాకారముగా పరిణామము చెందునని చెప్పు పరిణామ వాదులయిన యాదవ ప్రకాశ మతస్థులను, బ్రహ్మను ఉపాదాన కారణముగా అంగీకరించని పాశుపతాది ఇతర మతస్థులను కూడ నిరసించుచున్నారని పెద్దలు చెప్పెదరు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకము నందు భగవానుని షడ్గుణముల యందలి తేజస్సు యను గుణమునుట్టంకించుచున్నారు. 'సహకార్యనపేక్షాయా తత్తేజస్సముదాహృతమ్' అనగా సహకారుల అపేక్ష లేకుండ పరులను తిరస్కరించు పరమాత్మ సామర్థ్యమే తేజస్సు. ఒక కుండకు మట్టి ఉపాదానము, కుమ్మరి నిమిత్తము, చక్రము, దండము మొదలగునవి సహకారి కారణములగును. ముందు శ్లోకముల యందు పరమాత్మ ఈ చరాచర జగత్తునకు ఉపాదాన, నిమిత్త కారణములని తెలిసిన పిదప పరమాత్మ యొక్క తేజస్సు అను గుణము వలన సహకారి కారణము కూడ పరమాత్మ యే అని తెలియ వచ్చును.

**సహకారి అపేక్షమ్ అపి హాతుమ్ ఇహ తత్ అనపేక్ష కర్తృతా**
**రంగధన! జయతి తేజ ఇతి ప్రణతార్తిత్ ప్రతిభటాభిభావుకమ్** 34

**హే రంగధన= ఓ రంగనాథా, ఇహ= నీ గుణములను నిరూపించు ఈ ప్రకరణములో, సహకార్యపేక్షమపి= ఇతరములను సహకారి కారణముగా  అపేక్షించుట కూడ, హాతుం= తొలగించుటయు, తదనపేక్ష కర్తృతా =దానిని అపెక్షించకపోవుటయే ప్రణ తానాం ఆర్తిం = నిన్ను ఆశ్రయించిన వారి ఆర్తిని, జయతి=తీర్చుచున్నది. తేజ ఇతి జయతి=తజస్సు అను నీ గుణము, సర్వోత్కర్ష మైనదిగా నుండుచు , ప్రతిభ టాన్ = ఆటన్కపరులను అభి భావయతి= బాధించు చున్నది.**

హే శ్రీరంగనాథ! నీ ఆశ్రిత జనుల రక్షణ చేయుచు జగన్నిర్వహణాభారము నిర్వహించు నీకు వేఱొక సహకారి కారణము అవసరము లేదు. ఇది నీదు తేజస్సు అనెడు గుణవిశేషము.

అన్య మతావలంబులు కొందరిచే సహకారి కారణముగా స్వీకరించబడిన కాల ప్రభృతి పదార్థములు కూడ భగవానుని శరీరమే కద! అందుచే భగవానుడు సహకారి నిరపేక్షముగా
సర్వ స్వతంత్రుడై సమస్త కార్య నిర్వహణ యోగ్య సామర్థ్యము కలవాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి భగవానుని జ్ఞానాది షడ్గుణముల స్వరూపమును, భగవానుని కారణత్వ విషయమున మతాంతరుల అభిప్రాయములను, తత్తద్విషయ ఖండనమును సిద్ధాంతీకరించి ప్రస్తుత శ్లోకమునందు జ్ఞానగుణము యొక్క అవాంతర రూపమైన ఆనందగుణ నిరూపణము చేయుచు స్థాలీ పులాక న్యాయముగా భగవానుని సమస్త గుణముల అపరిచ్ఛిన్నత (అనగా ఆయన గుణముల అవధి గాని, సంఖ్య గాని చెప్ప రాక అవర్ణనీయములై, అపరిమితములై యుండునని ప్రతిపాదన చేయుచున్నారు.

**మర్త్యోత్థాయమ్ విరించావధికమ్ ఉపరి చ ఉత్ప్రేక్ష్య మీమాంసమానా**
**రంగేంద్ర! ఆనందవల్లీ తవ గుణనివహమ్ యౌవన ఆనందపూర్వమ్**
**న స్వార్థమ్ స్ప్రష్టుమ్ ఈష్టే స్ఖలతి పథి పరమ్ మూకలాయమ్ నిలిల్పే**
**హంత ఏవమ్ త్వత్ గుణానామ్ అవధి గణనయోః కా కథా చిత్తవాచోః** 35

**హే రంగేంద్ర= ఓ రంగనాథా, ఆనందవల్లీ= ఆనందవల్లి లోని "స ఏకో మానుష ఆనంద" ఇత్యాది శ్రుతి, మర్త్యాదుత్థాయ = మనుష్యులనుండి ఆరంభించి, విరించావధికం=చతుర్ముఖుని వరకును, ఉపరి చోత్ప్రే క్ష్య = మీదిమీదికి ఉత్ప్రేక్షను చెప్పి, తవ గుణనివహం = నీ గుణగణముయొక్క, ప్రవాహః = ధోరణిని అనగా నీ గుణములు ఎట్లు అతిశయించు చున్నవో అట్టి ధోరణిని, తెలుపుచున్నవి. మీమాంసమానా = ఆనందగుణమును మీమాంసతో ఎట్లు విచారించబడినదో, స్వార్థం స్ప్రష్టుం నేష్టే = తన కిష్టమైనవిధముగా వివరించుటకు ఆశక్యమైనది కాని, పథిపరం స్ఖలతి= మనుష్యానందముతో ప్రారంభించి ఆనంద గుణమును చెప్పుటకు ఎట్లు ప్రయత్నించినదో ఆ పద్ధతిలోనే పరిభ్రమించు చున్నది. మూకాలయం నిలిల్యే= చెప్పలేక మూగపోయినది. తే గుణానాం అవధి గణనయోహ్ = నీ కళ్యాణ గుణములను ఒక్కొక్క దానిని ఇంత ఇంత అని పరిచ్ఛేదించి చెప్పుట, చిత్త వాచొహ్=మనసుతో గాని వాక్కులతో గాని చెప్పుటకు, కా కథా= ప్రసక్తి ఎక్కడ గలదు?**

తైత్తిరీయోపనిషత్తు నందలి ఆనందవల్లిలో బ్రహ్మానంద మీమాంసలో పరబ్రహ్మానందమును వర్ణించ నుద్యమించిన ఉపనిషత్తు యువకుడు, బలిష్ఠుడు, విద్యావంతుడు, సంపన్నుడు, చక్రవర్తి అయిన మనుష్యుని ఆనందమును ఒకటిగా లెక్కించి, దానికి నూఱు రెట్లు మనుష్య గంధర్వ ఆనందమనియు, దానికి నూఱు రెట్లు దేవ గంధర్వ ఆనందమనియు, .....ఈ క్రమముగా చతుర్ముఖ బ్రహ్మానందము వరకు లెక్కించు కొనుచూ పోయి తరువాత పరబ్రహ్మానందమును లెక్కంచలేక మరలిపోయినది. (ఆశిష్ఠః, బలిష్ఠః, ....స ఏకః మనుష్యానందః. .....స ఏకః ప్రజాపతేః ఆనందః......యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ...). ఇట్లు స్థాలీ పులాక న్యాయముగా మన వాచములకందని నీ వివిధ గుణముల యందు జ్ఞాన గుణ అవాంతరరూపమైన ఒక్క ఆనందమను గుణమనే వర్ణించ ప్రయత్నించి విఫలములై, కింకర్తవ్యతావిమూఢములై, మూగబోయి నిలుబడు స్థితి ఉపనిషత్తులకే కలిగినచో నీ అనంత, అపరిచ్ఛేద్య, అపరిమిత అసంఖ్యాక కల్యాణ గుణముల వెన్న నెవ్వరి తరము కాదు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు శ్లోకమునందు భగవానుని అపరిచ్ఛేద్యములయిన కల్యాణ గుణములను సంపూర్ణముగా తెలియుట ఎవ్వరి తరము కాదు అని అనుగ్రహించేరు. ఆయన పరమపదములో మనకు అందని చోట వేంచేసి యుండి ఆయన కల్యణగుణములు మనము తెలిసికొందమన్న ఉపనిషత్తుల యందు దుర్గ్రాహ్యముగా గుహ్యముగా యుండినచో మనకు ఆయన మఱి తెలియడా, లభించడా అనిన సమాధానము చెప్పు చున్నారు తరువాతి శ్లోకములో.

**న్యధాయిషత యే గుణా నిధినిధాయమ్ ఆరణ్యకేషు**
**అమీ మృదిమ చాతురీ ప్రణత చాపల క్షాంతయః**
**దయా విజయ సౌందరీ ప్రభృతయః అపి రత్న అఘువత్**
**జగత్ వ్యవ హృదిక్షమా వరద! రంగ రత్నా పణే** 36

**వరద= హే వరదరాజా! ఆరణ్యకేషు= ఉపనిషత్తులలో, యే గుణాః= ఏయే గుణములు, నిధినిధాయం= నిధివలె, న్యధాయిషత= రహస్యముగా ఉంచబడినవో, అమీమ్రదిమచాతురీ ప్రణతచాపలక్షాన్తయః= కనబడుచున్న ఈ మార్దవము, చాతుర్యము, ఆశ్రితులపైగల వాత్సల్యము, క్షమ,; సౌన్దరీ= సౌందర్యము అనగా దివ్యావయశోభయు, దయ, విజయములు, మున్నగు గుణములుకూడ, రత్నౌఘువత్= మణులవలె, రంగరత్నా పణే= శ్రీరంగమనెడి రత్నముల అంగడిలో, జగద్వ్యవహృతి క్షమాః= సర్వజనులును ఉపయోగించుకొనువిధముగా, భవన్తి= అగుచున్నవని, జగుః= చెప్పుచున్నారు.**

పరమాత్మ కల్యాణగుణ విశేషములు ఆరణ్యకముల యందు, ఉపనిషత్తుల యందు ( ఉదా. ముండకోపనిషత్తు ద్వా సుపర్ణా సయుజా ....,న తత్ర సూర్యో భాతి...., తైత్తిరీయోపనిషత్తు ఆనందవల్లి, మహా నారాయణోపనిషత్తు నందలి నారాయణానువాకము, శ్వేతాశ్వరోపనిషత్తు ఇత్యాది. ), శ్రుతుల యందు గుహ్యముగా, గుప్తముగా సురక్షితమై యున్నవి. ఆయా శాస్త్రములు భగవానుని అఘటన ఘటనా చాతుర్య శక్తి, ఆశ్రిత రక్షణత్వము, దయ, సౌకుమార్యత, విజయ స్వభావము, సౌందర్యము, సౌశీల్యము, వాత్సల్యము, సౌలభ్యము ఇత్యాది గుణములు(శరణాగతి గద్య, ద్వయ ప్రకరణము మున్నగు గ్రంథములు వివరములకు చూడవచ్చును) గుప్తనిధిని వలె తమలో దాచి యుంచును. కాని ఈ గుణములన్నియును రత్నరాశులను అంగడిలో ప్రదర్శనకై యుంచినట్లు, హే వరద! హే రంగనాథ! శ్రీ రంగ క్షేత్ర గర్భ గృహమునందు నీ అర్చామూర్తి యందు పండిత, పామరులను భేదము లేక, సమస్త జనులకు సాక్షాత్కరించు చుండును కదా!

ఈ శ్లోకమునందు శ్రీమాన్ భట్టర్ స్వామి జ్ఞానమార్గావలంబన సహాయములేని మన కందరకూ అందుబాటులో నుండు అర్చక పరతంత్రుడైన అర్చామూర్తి వైశిష్ట్యమును తెల్పుచూ విగ్రహారాధనను అంగీకరించని కుమతులను నిరసించు చున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో నందు పరమాత్మ శాంతోదిత స్థితిని వర్ణించుచూ, భగవానుని వలన ఆయా కల్యాణగుణములకెట్లు పూర్ణత్వము సంప్రాప్తించునో ఉల్లేఖించుచున్నారు.

**యమ్ ఆశ్రిత్య ఏవ ఆత్మమ్ భరయ ఇవ తే సద్గుణ గణాః**
**ప్రథంతే సః అనంత స్వవశఘున శాంతోదిత దశః**
**త్వమేవ త్వామ్ వేత్థ స్తిమిత వితరంగమ్ వరద! భోః**
**స్వ సంవేద్య స్వాత్మ ద్వయస బహుళ ఆనంద భరితమ్** 37

**ఓ వరద! రంగరాజ! నీ జ్ఞానందాది కల్యాణ గుణములు తమ తమ అస్తిత్వమునకై నిన్ను ఆశ్రయించి (కడుపు నింపు కొనుచూ) యుండును. (గుణాయుక్తమ్ లోకే గుణిషు హి మతమ్ మంగళపదమ్ విపర్యస్తమ్ హస్తి క్షితి ధరపతేః తత్ త్వయి పునః గుణాః సత్య జ్ఞాన ప్రభృతయః త్వద్గతతయా శుభీభూతమ్ యాతా ఇతి హి నిరణైష్మ శ్రుతివశాత్ ...వరదరాజస్తవము). నిరవధికము, స్వకీయానుభావ్యమును నైన నీ 'శాంతోదిత' విశిష్ట దశయందు కూడ నిన్ను ఆ గుణములు ఆశ్రయించియే యుండును. నీవా స్థితి యందు పరమ శాంత స్వభావముతో నిశ్చలముగా, గాంభీర్యగుణయుక్తమైనతరంగ శూన్యసముద్రము వలె నుందువు. 'త్వమేవ త్వామ్ వేత్థ' అను శ్రుతి వచించి నట్లు స్వాత్మమాత్రానుభావ్యముచే, ఉభయవిభూతి వ్యాపకస్వస్వరూపసమాన ప్రమాణముగా అపరిచ్ఛిన్నమైన ఆనందాది గుణపూర్ణుడవై యుండు నిన్ను నీవే తెలియగల వాడవు.**

నిత్యోదితుని వలన శాంతోదితుడు ఉద్భవించెనని ఆగమమున నిత్యోదిత శాంతోదిత భేదము చెప్పబడినది.(నిత్యోదితాత్ సంబభూవ తథా శాంతోదితః హరిః). అనగా నిత్య విభూతి నిర్వాహకమగు, నిత్యులచే, ముక్తులచే అనుభావ్యమగు(సదా పశ్యంతి సూరయః) హేయ ప్రత్యనీక కల్యాణైక తానమగు మూర్తి పరవాసుదేవుడు శ్రీమన్నారాయణుడు. అట్టి పరవాసుదేవుని నుండి లీలావిభూతి నిర్వహణకై ఉద్భవించిన సంకర్షణ వ్యూహ కారణభూతమునగు వ్యూహ వాసుదేవుడే శాంతోదితుడు. వ్యూహ రూపుడగు వాసుదేవుడు పరవాసుదేవుని యందు విభాగమే అని వ్యూహములు సంకర్షణ, అనిరుద్ధ, ప్రద్యుమ్న రూపములు వ్యూహరూపుడగు వాసుదేవునితో కలిపి చాతురాత్మ్యము, చతుర్వ్యూహము( చతురాత్మా, చతుర్వ్యూహః...విష్ణు. సహస్ర నామ) అనియు చెప్పుదురు. పరత్వమున జ్ఞానాదులు ఆఱు గుణములు పూర్ణముగా నుండును. వ్యూహమునందు జ్ఞానాది గుణములు అన్నియును ఆశ్రయించి యున్ననూ, అనిరుద్ధ వ్యూహము నందు శక్తి, తేజస్సు యునూ, సంకర్షణ వ్యూహమునందు జ్ఞాన, బలములునూ, ప్రద్యుమ్న వ్యూహమునందు ఐశ్వర్య, వీర్యములునూ స్ఫుటముగా ప్రకాశించును.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మకు తన అసంఖ్యేయ కల్యాణ గుణముల వలన అభిమాన, గర్వము లిసుమంతయైన ప్రాప్తించునా యనిన అట్లు కాదని అనుగ్రహిస్తున్నారు ఈ శ్లోకములో.

**ఆఘ్రాయ ఐశ్వర గంధమ్ ఈశదృశమ్ మన్యాః తవ ఇంద్రాదయః**
**ముహ్యంతి త్వమ్ అనావిలః నిరవధేః భూమ్నః కణేహత్య యత్**
**చిత్రీయేమహి న అత్ర రంగరసిక! త్వమ్ త్వత్ మహిమ్నః పరః**
**వైపుల్యాత్ మహితః స్వభావ ఇతి వా కిమ్ నామ సాత్మ్యమ్ న తే** 38

**హే రంగరసిక= ఓ రంగనాథా! ఇంద్రాదయః= ఇంద్రుడు మొదలైనవారు, ఈశ్వరగన్ధం= సర్వేశ్వరుని నియామకత్వపరిమళమును, ఆఘ్రాయ= వాసన చూచినంతనే, ఈశసదృశం మన్యాః= తమనుకూడ సర్వేశ్వరునితో సమానమని తలంచుచు వారు, ముహ్యన్తి= భ్రమించుచున్నారు. త్వం= నీవు, నిరవధేః= అపరిచ్ఛేద్యమైన, భూమ్నః= మహిమను, కణేహత్య= లెక్కచేయక, అనావిలః= ఈశ్వరత్వాభిమానమును గమనించనివానిగా, భవసి= అగుచున్నావు. అని, న చిత్రీయేమహి= ఆశ్చర్యమును పొందుట లేదు. దానికి కారణము- త్వం= నీవు వైపుల్యాత్= విభుత్వముచే, త్వన్మహిమ్నః= నీ మహిమకంటెను, పరః= ఉత్కృష్టమైన వాడవు. స్వభావః= నీయొక్క సర్వేశ్వరత్వ స్వభావము మహితః= మీ స్వరూపముకంటెను విపులమైనది. ఇట్లు, తే= నీయొక్క, కిం నామనసాత్మ్యమ్= సాటికానిది ఏమున్నది. అనగా, ఇందు ఆశ్చర్యమేమియు లేదు. కారణమేమనగా - మీ స్వరూపస్వభావములు ఒకదానితో నొకటి పోలి, కలుషత్వము లేకయున్నవి.**

హే రంగరసిక! నీ విభూతుల యందు స్వల్ప భాగమునకు, నియమిత కాలమునకు నీ వలన కార్య నిర్వహణా బాధ్యత పొందిన ఇంద్రాదులు నీ ఐశ్వర్య గంధమును లేశమాత్రముగా ఆఘ్రాణించిన వారై నీ సదృశులుగా భావించుకొనుచు స్వస్వరూపవివేచనము లేక దురభిమానముతో ప్రవర్తించు చుందురు. (మనకు ఈ విషయమై పురాణేతిహాసముల యందు పెక్కు దృష్టాంతములు కానవచ్చును). కాని అతులిత మహిమాన్వితుడవైన నీవు ఎట్టి గర్వము లేక శోభిల్లుచుందువు. మాకీ విషయమై ఎంతమాత్రము ఆశ్చర్యము లేదు. ఏల యన నీ స్వరూప వైభవములు అన్యోన్య సదృశములై కాలుష్య రహితములై యుండును.

పరమాత్మ కల్యాణ గుణ పూర్ణుడే కాక అఖిల హేయ ప్రత్యనీకుడు కూడ అని అర్థము. ఈ అఖిల హేయ ప్రత్యనీకత అన్య దేవతలకు వర్తించదు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో పరమాత్మ యొక్క పర, వ్యూహ స్వరూపములను వివరిస్తున్నారు.

**షాడ్గుణ్యాత్ వాసుదేవః పర ఇతి స భవాన్ ముక్త భోగ్యః బల ఆఢ్యాత్**
**బోధాత్ సంకర్షణః త్వమ్ హరసి వితనుషే శాస్త్రమ్ ఐశ్వర్య వీర్యాత్**
**ప్రద్యుమ్నః సర్గ ధర్మౌ నయసి చ భగవన్! శక్తి తేజః అనిరుద్ధః**
**బిభ్రాణః పాసి తత్త్వమ్ గమయసి చ తథా వ్యూహ్య రంగాధిరాజ!** 39

**రంగాధిరాజ= హే రంగనాథా!, స భవాన్= 38వ శ్లోకంలో చెప్పబడిన స్వరూపానికి తగిన వైభవం గలవాడవు నీవు, షాడ్గుణ్యాత్= ఆరుగుణములచేతనే, పరః వాసుదేవఇతి= పరవాసుదేవుడవని, ముక్తభోగ్యః= నిత్యులచేతను,**

**ముత్తులచేతను అనుభవింపబడుచున్నావు. తథా= ఆగమశాస్త్రములలో ప్రతిపాదింపబడిన విధముగా, వ్యూహ్య= నీవు నాలుగు రూపములతో, బలాఢ్యాత్= బలిష్ఠమైన, బోధాత్= జ్ఞానముచే- అనగా ఒకదానితో నొకటి సహకరించుచున్న జ్ఞానబలములచే, సంకర్షణస్త్వం= సంహారకార్యమును చేయు మూర్తిగా నీవు, హరసి= సంహారకార్యమును చేయుచు. శాస్త్రం వితనుషే= సంకర్షణకృత్యమందు ప్రవర్తింతువు. ఐశ్వర్యవీర్యాత్= ఐశ్వర్య వీర్య గుణములవలన, ప్రద్యుమ్నస్సన్ సర్గ ధర్మౌ నయసి చ= ప్రద్యుమ్నమూర్తిగా చతుర్ముఖుని అధిష్ఠించి, సృష్టికార్యమును నిర్వహించుచున్నావు. శక్తితేజో బిభ్రాణః= నీలోని తేజశ్శక్తులను ధరించి అనిరుద్ధమూర్తివై, పాసి= రక్షించుచున్నావు. తత్త్వం గమయసి= స్వస్వరూపావిర్భావరూపమైన మోక్షమును ప్రసాదింతువు.**

హేయ గుణములు లేని జ్ఞాన, శక్త్యాది గుణములు గల పరమాత్ముడే భగవచ్ఛబ్ద వాచ్యుడు. పరమాత్మ ఐదు రూపమలలో యుండును. అవి, పర, వ్యూహ, విభవ, అర్చ, అంతర్యామి రూపములు.

హే భగవాన్ రంగనాథ! నీవు వైకుంఠమునందు పర వాసుదేవునిగా షాడ్గుణ్య పూర్ణుడవై నిత్య ముక్తానుభావ్యుడవై యుందువు. నీవే వ్యూహ రూపమును పొందినపుడు( జ్ఞానాది షడ్గుణములు కలిగి యున్ననూ ) జ్ఞాన, బలములు ప్రస్ఫుటముగా ప్రకాశించు సంకర్షణ మూర్తివై శాస్త్ర ప్రదానమును, సంహార కార్యములను నిర్వహించెదవు. ఐశ్వర్య వీర్యములు ప్రకాశించు ప్రద్యుమ్నుడవై సృష్టి, ధర్మ ప్రవర్తనా కార్యములు నిర్వహించెదవు. శక్తి, తేజములతో అనిరుద్ధరూపుడవై తత్త్వ జ్ఞాన ప్రదానము, మోక్ష ప్రదానమును నిర్వహించెదవు. వస్తుతః ప్రతి యొక్క వ్యూహరూపము షాడ్గుణ్య పూర్ణమైన ఆ పరవాసుదేవ స్వరూపమే. ఆయా కృత్యములననుసరించి ఆయా గుణములు ఉపాసకులకు ప్రకాశకమగును.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పూర్వ శ్లోకమునందు వాసుదేవాది చతుర్వ్యూహములను వివరించి, పాంచరాత్రాగమము నందు ప్రసిద్ధమైన కేశవాది ఉప వ్యూహములను తరువాతి శ్లోకమునందు ప్రస్తుతించుచున్నారు.

**జాగ్రత్ స్వప్న అత్యలస తురీయా ప్రాయ ధ్యాతృక్రమవత్ ఉపాస్యః**
**స్వామిన్! తత్ తత్ సహ పరిబర్హః చాతుర్వ్యూహమ్ వహసి చతుర్ధా 40**

**హే స్వామిన్= ఓ స్వామీ! జాగ్రత్స్వప్నాత్యలసతురీయప్రాయ= జాగ్రదవస్థ స్వప్నావస్థ అత్యలసావస్థ తురీయావస్థ అని చెప్పబడు, ధ్యాతృక్రమవత్= ఉపాసకుల భిన్న దశల అనబడు దశలయందు- తెలివిగల అధికారి యవస్థ జాగ్రదవస్థ; అంతకంటె తక్కువ తెలియుచున్న అవస్థ స్వప్నావస్థ; అంతకంటెను తక్కువగా బాహ్యవిషయముల జ్ఞానమున్న అవస్థ అత్యలసావస్థ; అతిస్వల్పమైన బాహ్యవిషయజ్ఞానము గల అవస్థ తురీయావస్థ. ఆయా అవస్థలలో నీవు, ఉపాస్యః= ఉపాసింపబడుదువు. తత్తత్సహపరిబర్హః= ఆయామూర్తుల గుణములతోనుండి, చాతుర్వ్యూహం= వ్యూహవాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపములను వహసి= ధరించి, ఉపాసింపబడుదువు.**

హే రంగనాథ స్వామీ! వివిధ ఉపాసకుల జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయ అవస్థా భేదముల ననుసరించి క్రమముగా ఆయా కేశవాది ఉప వ్యూహ మూర్తి స్వరూపములను ధరించుచున్నావు.

ఈ వ్యూహముల వివరములు వాసుదేవ, కేశవ, నారాయణ, మాధవ, సంకర్షణ, గోవింద, విష్ణు, మధుసూదన, ప్రద్యుమ్న, హృషీకేశ, పద్మనాభ, దామోదర, అనిరుద్ధ, త్రివిక్రమ, వామన, శ్రీధర మూర్తులు.

(ఇవి కాక సాత్వత సంహిత లో పురుషోత్తమాది రూపములు కలిపి మొత్తము 24 రూపములు చెప్ప బడినవి. విష్వక్సేన సంహితలో 36 అవతారములు చెప్ప బడినవి. వివరములకు ఆయా గ్రంథములు చూడవచ్చును).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మ దయా రూపియై సృష్టికి పూర్వము అచేతనముగా పడి యున్న నిత్య చేతనుల సృష్టి గావించి వారలకు కరణ కళేబరముల నిచ్చి తోడ్పడు విధానము వివరించుచున్నారు.

**అచిత్ అవిశేషితాన్ ప్రలయసీమని సంసరతః**
**కరణ కళేబరైః ఘటయితుమ్ దయమాన మనాః**
**వరద! నిజ ఇచ్ఛయా ఏవ పరవాన్ అకరోః ప్రకృతిమ్**
**మహత్ అభిమాన భూత కరణ ఆవళి కోరకిణీమ్** **41**

**హేవరద= ఓ వరదరాజా! దయమానమనాః= దయగలహృదయముగలవాడవు. అందువలననే, నిజేచ్ఛయైవ= నీ సంకల్పముచేతనే, పరవాన్= ప్రేరితుడవు. ప్రళయసీమని= ప్రళయశమయమందు, అచిదవిశేషితాన్= అచిత్తువలె చేష్టలుడిగిన, సంసరతః= సంసారములోనిజీవులను, కరణకళేబరైః= ఇంద్రియములతోనున్న శరీరములతో, ఘటయితుం= చేర్చుటకు, ప్రకృతిం= ఈ మూలప్రకృతిని, మహదభిమానభూతకరణావళి కోరకిణీం= మహత్తు, అహఙ్కారము, తన్మాత్రలు, భూతపంచకములు- వీటిని గలదిగా అకరోః= చేసితివి.**

పరమాత్మ మనలను ఈ సంసార శోక సాగరమున పడవేసి మనమిచట దుఃఖముల ననుభవించు చుండ పరమ పదము నుండి చూచుచు పైశాచిక ఆనందము ననుభవించుచుండునా యని మనకు అనుమానము రావచ్చును. పరమాత్మ మనకీ జన్మ నిచ్చుట ఆయన మనపై చూపు దయా కార్యమే నని వివరించుచున్నారు.

హే వరద! ప్రలయ కాలమునందు చేతనములన్నియు అచిద్వస్తువుల వలె వ్యాపారశూన్యములై పడియుండును. ఆ సందర్భమున పరమాత్మ మన చేతనములపై దయ కలిగి, తన అమోఘ సంకల్పముచే (ప్రజాపతిః అకామయత ప్రజాః సృజాయేతి) మన కొరకు మూల ప్రకృతి-అహంకార-పంచతన్మాత్ర-పంచభూతాది క్రమముగా జగత్సృష్టి గావించి అందు ఏకాదశ ఇంద్రియములతో కరణ కళేబరముల నిచ్చి జీవులను ఈ 24 తత్త్వములు గల నామ రూప ప్రపంచమునందు (అజామేకామ్ లోహిత శుక్ల కృష్ణామ్ బహ్వీమ్ ప్రజామ్ జనయంతీమ్ సరూపామ్) సృజించెను.

పరమాత్మ సర్వ స్వతంత్రుడైనను దయాపరతంత్రుడు. కావుననే అలుపెరుగని కృషీవలుని వలె నిశ్చేష్టులు పడియున్న జీవులకు సకల సాధనములనిచ్చి శ్రుత్యాది శాస్త్రములనిచ్చి, అన్ని వైపుల నుండి మనలను కని పెట్టుచు (అంతర్బహిశ్చ) మూల్యము లేని చేతి బొమ్మ వలె అంతటా మనకు కనపడుచూ వారిని (ఆ జీవులను) అపరిచ్ఛేద్యమైన ఆనందము ననుభవింపగల పరమపదమునకు గొనిపోవ నిరంతరమును ప్రయత్నించుచంచుండును. అందులకై ఒక సారి కాకున్న వేఱొక సారి ఐనను ఈ జీవుడు బాగు పడునేమోనని ఇచ్చు గొప్ప అవకాశమే మహత్తర మైన ఈ సృష్టి కార్యము. ఈ వివరములకు విష్ణు పురాణాదులు, తత్త్వ త్రయాది రహస్య గ్రంథములు చూడవచ్చును.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు శ్లోకమునందు పరమాత్మ పరమ దయా మయుడని సృష్టి కార్యము మనపై దయ వలననే చేయునని తెలుపగా అట్లయిన కొందరిని కటిక దరిద్రులుగా, అజ్ఞానులుగా, మఱి కొందరను ఐశ్వర్య వంతులుగా, మహా జ్ఞానులుగా వివిధ దేవ, మనుష్య, తిర్యక్ జాతులుగా ఇట్లు సృష్టి అంతయు నిమ్నోన్నతములతో చేయుటకు కారణమేమన ఈ శ్లోకములో వివరించుచున్నారు.

**నిమ్నోన్నతమ్ చ కరుణమ్ చ జగద్విచిత్రమ్**
**కర్మ వ్యపేక్ష్య సృజతః తవ రంగ శేషిన్**
**వైషమ్య నిర్ఘృణతయోః న ఖలు ప్రసక్తిః**
**తత్ బ్రహ్మసూత్ర సచివాః శ్రుతయో గృణంతి** 42

**హే రంగశేషిన్= ఓ రంగనాథా! - శ్రీరంగమున వేంచేసియున్న స్వామీ, విచిత్రం= సురులు నరులు మొదలైన వైచిత్ర్యము గల, నిమ్నోన్నతం చ= ఒకడు నియమించువాడైయుండగా వేరొకడు నియమింపబడుట- ఇటువంటి హెచ్చుతక్కువలవలె, కరుణంచ= ఆకలి, వ్యాధి మొదలగువాటిచే నిండియుండుటచే దయనీయమును, జగత్కర్మవ్యపేక్ష్య= ఆయాచేతనులు చేసిన విచిత్రమైన పుణ్యపాపరూపకర్మమును విచారించి, సృజతః తవ వైషమ్య నిర్ఘృణతయోః= పక్షపాతిత్వము నిర్దయత్వముల, ప్రసక్తిః= ప్రసంగము, న ఖలు= లేదుగదా! అని ఏ వాదము గలదో, తత్= ఆ అర్థము, బ్రహ్మసూత్రసచివాః= వైషమ్యము, నైర్ఘృణ్యములు వారివారి కర్మల సాపేక్షమువలననే అని చెప్పు శారీరకమీమాంసాసూత్రములకు సహాయముగానుండు, శ్రుతయః= శ్రుతివాక్యములు, గృణన్తి= ప్రతిపాదించుచున్నవి.**

హే రంగనాథా! చేతనుల ద్వారా చేయబడు అనేక పుణ్య, పాప కర్మల ననుసరించి వారి, వారికి ఉచ్చ, మధ్యమ, నీచములైన దేవ, మనుష్య, తిర్యక్ మొదలగు రూపములను కల్పించి పక్షపాత రహితుడవై ఈ విచిత్ర జగత్తునందు స్థానము కల్పించెదవు. ఈ నీ నిష్పక్షపాత విషయము శాస్త్రములు ( బృ. ఉ. సాధుకారీ సాధుః భవతి, పాపకారీ పాపీ భవతి, పుణ్యం పుణ్యేన కర్మణా, పాపః పాపేన కర్మణా, భ.గీ. సమోహమ్ సర్వ భూతేషు, సుహృదమ్ సర్వ భూతానామ్) బ్రహ్మ సూత్రములతో సహా (వైషమ్య నైర్ఘృణ్యే న సాపేక్షత్వాత్) ప్రతిపాదించును.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి జీవుల ఐశ్వర్య దారిద్ర్యములు, జన్మాదులు వారి వారి కర్మ ఫలముల ననుసరించియే యుండుననిన పరమాత్మకు మరి వేఱు స్వాతంత్ర్యము లేదా యనిన సమాధానించు చున్నారు ఈ శ్లోకములో.

**స్వాధీనే సహకారి కారణగణే కర్తుః శరీరే అథవా**
**భోక్తుః స్వానువిధా అపరాధ విధయోః రాజ్ఞః యథా శాసితుః**
**దాతుర్వా అర్థిజనే కటాక్షణమ్ ఇవ శ్రీరంగ సర్వస్వ! తే**
**స్రష్టుః సృజ్యదశావ్య పేక్షణమ్ అపి స్వాతంత్ర్యమ్ ఏవ ఆవహేత్** 43

**హే శ్రీరంగసర్వస్వ= ఓ రంగనాథా, కర్తుః= తయారుచేయుటకు, సహకారికారణగణే= మృత్పిండము దండము చక్రము మొదలైన తయారుచేయుటకు కావలసిన పరికరములు, స్వాధీనేపి= అన్నియు తనకు స్వాధీనములే అయినను, భోక్తుః= అనుభవించుటకును, శాసితుః= నియమించుటకును, స్వానువిధేషు= అనువర్తించుటకును, అపరాధవిధయః= అనువర్తించుటలో తారతమ్యములకు కారణమైన వియు, దాతుర్వా= కావలసిన వస్తువులను ఇచ్చుటకుగాని, అర్థిజనేకటాక్షణమివ= ప్రార్థించువారిని కటాక్షించుటవలె, స్రష్టుస్తే= విచిత్రమును విషమమును అగు జగత్తును సృష్టించు నీయొక్క, సృజ్యానాం= సృష్టింపబడిన చేతనుల, దశాయాః= కర్మపరిపాకముచే కలిగిన విశిష్టరూపావస్థలయొక్క, వ్యపేక్షణమపి= పరిశీలనముకూడ, స్వాతంత్ర్యమేవావహేత్= నీకుగల స్వతంత్రతనే తెలుపును.**

ఒక కులాలుడు కుండ తయారు చేయుటకు కర్ర, చక్రము మున్నగు సాధనములు ఉపయోగించును
అటులనే ఒక జీవుడు తన అవయవాదులను ఉపయోగించి తన పనులను చేయు చుండును.
ఒక దాని అర్థికి దానమిచ్చును
ఒక రాజు తన ప్రజల మంచి పనులను చెడు పనులను పరిశీలించి తగిన పారితోషికమో, శిక్షయో ఇచ్చు చుండును.
పై ఉదాహరణముల యందు చక్రాదుల వలన కులాలునకు గాని, అవయవాదులను వలన జీవునికి గాని, అర్థుల వలన దానికి గాని, ప్రజల వలన రాజునకు గాని వారి స్వాతంత్ర్యము నందు భంగము కలుగదు. హే శ్రీరంగ సర్వస్వ! అటులనే నీ అధీనమునందున్న పదార్థముల సాధనములుగా నీ లీలా విభూతి కార్య నిర్వహణమునందు నీవు జీవులను వారి వారి కర్మలననుసరించి ఫలములననుభవింప చేయుదువనిన అందు వలన నీ స్వాతంత్ర్యమునకు కొఱత గాని భంగము గాని లేవు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు శ్లోకములలో పరమాత్మ ఈ జీవులను, ప్రకృతిని సృష్టించుచున్నాడని చెప్పగా, ఈ చిదచిదాత్మకమైన ప్రపంచము సృష్టికి ముందు ఏమగును, ఈ సృష్టికి మూల పదార్థము ఎట్లు వచ్చును అనిన ఈ సృష్టికి ఉపాదాన కారణము పరమాత్మ యే అని సోదాహరణంగా వివరించుచున్నారు ఈ శ్లోకములో.

**ప్రలయ సమయ సుప్తమ్ స్వమ్ శరీర ఏక దేశమ్**

**వరద! చిత్ అచిత్ ఆఖ్యమ్ స్వ ఇచ్ఛయా విస్తృణానః**

**ఖచితమ్ ఇవ కలాపమ్ చిత్రమ్ ఆతత్య ధూన్వన్**

**అనుషిఖిని శిఖీవ క్రీడసిశ్రీసమక్షమ్** 44

**హే వరద!= ఓ వరదరాజా!, సుప్తం= నిదిరించుచున్నపుడు ఎట్లు ఏ వ్యాపారములు లేకపోవునో అట్లు సమస్తమైన వ్యాపారములును లేక నిద్రావస్థలోనున్నట్లుగానున్న, చిదచిదాఖ్యం= చేతనాచేతనములను పేరుగల, స్వం= తనయొక్క శరీరములోని ఒక భాగము, స్వేచ్ఛయా= తన సంకల్పముచే, విస్తృణానః= వివిధమును, విచిత్రమైన ఆకారములుగా పరిణమించుచు, త్వం= నీవు, అనుశిఖిని = ఆడనెమలివద్ద, చిత్రం= రంగురంగుల, కలాపం= పింఛమును, ఖచితమివ= ఆకాశములో గీసినట్లు, వితత్య= విప్పి, ధూన్వన్= ఆడించుచు, శిఖీవ= నెమలివలె, శ్రీసమక్షం= లక్ష్మీదేవివద్ద ఆమెను ఆనందింపజేయుటకు, క్రీడసి= ఆడుదువుగదా!**

భగవానుడు సృష్టికి నిమిత్త, సహకారి కారణములే కాక ఉపాదాన కారణము కూడ. 'బహుస్యామ్ ప్రజాయేయ', 'జన్మాద్యస్య యతః', యతో వా ......జయంతే' , విష్ణోస్సకాశాత్ ఉద్భూత జగత్', ఇత్యాది శ్రుతి, స్మృతి, పురాణేతిహాసములన్నియు ఇదే తెలుపుచున్నవి

హే వరద! ప్రలయకాలమునందు తన దివ్య మంగళ విగ్రహమునందు ఒకమూల వ్యాపార శూన్యములై నిదురించుచున్న చిదచిత్తులను తన సంకల్పముచే విస్తరింపజేసి నామరూప విభజనము గావించి మగ నెమలి ఆడు నెమలి ప్రసన్నత కొరకు తన శరీరము నుండి పింఛమును విప్పి వివిధ వర్ణ విరాజితమై విచిత్ర గతిలో ఎట్లు ఆడునో అటులనే నీవు దయా రూపి యై నీ ప్రియతమ అయిన లక్ష్మీ దేవి కొరకై చేతనా చేతనాచేతనమయ మైన ఈ ప్రపంచమును సృజించి క్రీడించెదవు.

అనగా పింఛము మగ నెమలి అంతర్భాగము. ఆడు నెమలిది కాదు. అటులనే జగత్కారణత్వము భగవానునికే చెందును. అమ్మకు కాదు. కాని అమ్మ పురుషకారము చే అమ్మ ఆనందము కొరకు మన ఉద్ధరణకై పరమాత్మ తన సంకల్పముచే ఈ సృష్టి చేయును.

పై శ్లోకమునందు జగత్కారణత్వమును అమ్మ కు కూడ నాపాదించు కొన్ని మత వర్గములను భట్టర్ స్వామి సరి దిద్దుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి మొదటి శ్లోకమునందు మనము అజ్ఞానాంధకారము నుండి బయల్వెడలుటకు, మన స్వరూప వివేకము కలుగుటకు పరమ కారుణికుడైన పరమాత్మ శాస్త్ర దీపముల నొసంగిరి అని నుడివిరి. కాని మనము ఆ శాస్త్రములను సరియగు రీతిలో వినియోగించుకొనుట గాని, అనుసరించుట గాని చేయ నసమర్థుల మైన మన పై దయ తలచి మనలో నొకడుగా మరల మరల నవతరించిన విషయము ప్రస్తావించుచున్నారు.

**భూయో భూయః త్వయి హితపరే అపి ఉత్పథ అనాత్మనీన**

**స్రోతః మగ్నాన్ అపి పతి నయమ్ స్వమ్ దురాశావశేన**

**రుగ్ణే తోకే స్వ ఇవ జననీ తత్ కషాయమ్ పిబంతి**

**తత్ తత్ వర్ణాశ్రమ విధివశః క్లిశ్యసే రంగరాజ! 45**

**హే రంగరాజ= ఓ రంగనాథా! భూయోభూయః= మరలమరల, హితపరేపి= హితమును చెప్పుచున్నను, ఉత్పథే= శాస్త్రోల్లంఘనమును చేయుచు, అతఏవ= అందువలననే, అనాత్మనీనే= దుఃఖమును కలిగించు నరకమువంటి, స్రోతసి= దుష్కర్మల ప్రవాహములో, మగ్నానపి= ములిగినవారినికూడ, త్వయి= నీలో కలిగిన, దురాశావశేన= వారిని ఉద్ధరించవలెనను అత్యాశచే, పథినయన్= శాస్త్రములు చెప్పిన మార్గములో నడచునట్లు చేయుచు, స్వే తోకే= తన శిశువును రుగ్ణే= వ్యాధిగ్రస్తుడై యుండగా, తత్కషాయం= ఆరోగమును పోగొట్టుటకు సేవింపజేయు ఔషధమును త్రాగించుచున్న, జననీవ= తల్లివలె, క్లిశ్యసి= బాధ పడుదువుగదా!**

పరమాత్మ తన అవతార రహస్యమును తెలుపుచూ భగవద్గీత యందు 'అజోపిసన్.....సంభవామి ఆత్మ మాయయా' దానికి కారణమేమనిన ' పరిత్రాణాయ సాధూనామ్......సంభవామి యుగే యుగే' అనియు యదా యదాహి ధర్మస్య గ్లానిః భవతి .....తదాత్మానమ్ సృజామ్యహమ్ అనియు ' బహూని మే వ్యతీతాని' అనియు 'జన్మ కర్మచ మే దివ్యమ్' అనియు పలు విధములుగా వివరించెను. విజ్ఞాన శాస్త్రము నేర్పిన మంచి గురువు ఇంకను శిష్యులకు బాగుగా అర్థమగుటకు తానే ప్రయోగము చేసినట్లును, మంచి గురువు తాను చెప్పిన మంచి విషయము తాను స్వయముగా ప్రవర్తించి చూపినట్లును, క్లేశభాజనమైన ఈ ప్రపంచమునందు తాను కూడ వివిధరూపముల (వరాహము వంటి నీచ తిర్యగ్రూపము నుండి స్థావర రూపమైన కుబ్జామ్రత్వమును కూడ పొంది రామ కృష్ణాద్యవతారముల యందు పడరాని పాటులు పడుచూ మన కొరకు ఈ భూమిపై అవతరించును. ' యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః', 'నానవాప్తమ వాప్తవ్యమ్ వర్త ఏవ చ కర్మణి', యది హ్యహమ్ నవర్తేయమ్.....మమ వర్త్మాను వర్తంతే మనుష్యాః పార్థ....', 'వర్ణాశ్రమ ఆచారవతా పురుషేణ పరః పుమాన్', అట్లవతరించినప్పుడు తాను కర్మ పర తంత్రుడు కాకున్నను శాస్త్ర ప్రకారము వర్ణాశ్రమ ధర్మముల ననుసరించి మనకు ఆదర్శమును చూపును.

హే రంగరాజ! తన పాలిచ్చు తల్లి తన శిశువు రుగ్మత పోవలెనని తానే చేదు కషాయము త్రాగును. దాని సత్ఫలితము శిశువునకు సంప్రాప్తించిన సంతోషించును. అటులనే నీవు కూడ మరల మరల దుష్కర్ములై సంసారార్ణవ మగ్నులైన మా ఈ చేతనుల నుద్ధరించుట కొరకై ఒక మారు కాకున్న నింకొక మారైనను ఉద్ధరింప బడెదరనియు, సన్మార్గ ప్రవర్తకులగుదురనియు అత్యంత ఆశాభావముతో నీకై నీవే తిరిగి తిరిగి ఈ భూమిపై అవతరించి నీ కవసరములేకున్నను వర్ణాశ్రమ ధర్మ విహితముగా ప్రవర్తించి మాకు తెలియ చెప్పుటకై మాకు మించిన ఇక్కట్టుల ననుభవింతువు. ఆహా ఏమి నీ కారుణ్య భావము!

శిశువు నకు ధారకమును, భోగ్యమును, పోషకమైన మాతృ స్తన్యమునకు కారణము తల్లి యే అయినట్లు మనకు ధారక, భోగ్య, పోషకములకు కారణభూతుడు పరమాత్మయే.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు శ్లోకము నందు పరమాత్మ అవతార కారణము నెఱింగించిరి. ఈ శ్లోకమునందు పరమాత్మ సంకల్ప మాత్రముగా నిర్వహించు సృష్టి, స్థితి, భంగాది కార్యముల యందు తనకొఱకు చేసికొను స్వార్థ కార్యములేమయినను గలవా అనిన అవాప్త సమస్త కాముడైన పరమాత్మ ఈ పనులన్నియు తన కొఱకు కాక తనవారమైన మన కొఱకే నిరంతరము చేయుచుండునని వక్కాణించుచున్నారు.

**సార్వ! త్వత్కమ్ సకలచరితమ్ రంగధామన్! దురాశా**
**పాశేభ్యః స్యాత్ న యది జగతామ్ జాతు మూర్ఖోత్తరాణామ్**
**నిస్తంద్రాళోః తవ నియమతః నః ఋతులింగ ప్రవాహ్**
**సర్గ స్థేమ ప్రభృతిషు సదా జాకరా జాఘటీతి** 46

**హే సార్వ= ఓ సర్వస్వామియు, రంగధామన్= శ్రీరంగవాసరసికా! త్వత్కం= నీయొక్క, సకలచరితం= సృష్టించుట, రక్షించుట మొదలగు వ్యవహారములు, జాతు= ఎల్లప్పుడును, దురాశాపాశేభ్యః= దురాశాపాశములచేత బంధింపబడిన, మూర్ఖోత్తరాణాం జగతాం= అత్యంతము అజ్ఞానులైన వారిని ఉద్ధరించుటకు, న స్యాత్ యది= కాకపోయినచో, తవ= నీయొక్క, సర్గస్థేమప్రభృతిషు= మరలమరల సృష్టించుట రక్షించుట మొదలగు వ్యాపారములయందు, నియమతః= తప్పక జరుగు, ఋతులింగప్రవాహ్= ఆయా ఋతువులలో పుట్టు పుష్పఫలాదులవలె, నిస్తంద్రాళోః= ఆలస్యములేని, సదా జాగరా= నిత్యజాగరూకతతో, న జాఘటీతి= నుండుట జరుగదుకదా!**

హే సర్వ భూత సుహృత్ రంగనాథా! నిరంతరము పౌనఃపున్యముగా నీవు ఈ లీలా విభూతి యందు నిర్వహించు సృష్టి, స్థేమాది వ్యాపారములు దురాశారూప పాశములచే బంధింప బడిన ఈ అనభిజ్ఞులైన జీవలోకోజ్జీవనమునకే కదా! అందులకై నిరాలస్యముగా, అత్యంత ఉత్సాహముతో సర్వ కాల సర్వావస్థల యందును సంతతము జాగరూకుడవై ఎప్పుడు తన ప్రయత్నము సఫలమై తన దయ సార్థకమగునా యని, వేలు వేలు ఋతువుల యందు మరల మరల ఫల పుష్పముల నీయు వృక్షము వలె అలుపెఱుగక కాచుకొని యుందువు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు శ్లోకములలో పరమాత్మ సర్వ భూత సుహృత్ అనియు, దయామయుడనియు తన వ్యాపారములను లోక సంరక్షణకే చేయుననియు పేర్కొనిరి. అట్లయిన నరక ప్రదానాది కార్యములు ఏల చేయునన్న సమాధానమునిచ్చు చున్నారు ఈ శ్లోకములో.

**సుహృత్ ఇవ నిగళ ఆద్యైః ఉన్మదిష్ణుమ్ నృశంసమ్**
**త్వమ్ అపి నిరయ పూర్వైః దండయస్ రంగనేతః**
**తదితరమపి బాధాత్ త్రాయసే భోగమోక్ష**
**ప్రదిః అపి తవ దండాపూపికాతః సుహృత్వమ్** 47

**హే రంగనేతః= ఓ శ్రీరంగనాథా!, భోగమోక్షప్రదిః= ఐశ్వర్యములను మోక్షమును ప్రసాదించువాడవని ప్రసిద్ధిగల, త్వం= నీవు, ఉన్మదిష్ణుం= ఉన్మాదులును, నిగడాద్యైః= ఆటలాడుకొనుచు, నృశంసమపి= హింసాప్రవృత్తిగలవారినికూడ,**

**నిరయపూర్వై:= వారికితగిన నరకాదులచే, దండయస్= దండనములతో శిక్షించి పిదప, త్రాయసే= వారిని రక్షింతువు. తదితరమపి= ఇతరులను కూడ, బాధాత్= నరకాది క్లేశములనుండి, త్రాయసే= రక్షింతువు. తవ సుహృత్త్వం= నీ సర్వభూతసుహృత్త్వము, దండాపూపికాత:= అప్పములను తినివేయు ఎలుక అప్పములతోబాటు అప్పములను చేయుటయందు వాడబడిన కర్రనుకూడ తినివేసినట్లు, సామాన్యులను రక్షించుటయేగాక, హింసాప్రవృత్తిగలవారినికూడ వారిహింసకు తగిన దండనమును వారికి చేసి పిదప వారినికూడ భోగమోక్షములతో రక్షింతువుగదా!**

హే రంగాధినాథా! ఐశ్వర్య మోక్షములను ప్రదానము చేయు నీవు దుష్ట శిక్షణ కూడ నేల చేయుదువనిన, ఏ విధముగా ఒక ఉన్మత్తుడు, క్రూరచరితుడును ఐన వ్యక్తిని అతనికి హితైషి ఐన మిత్రుడు బంధనాది దండనలచే సరదిద్దునో నీవు కూడ అపరాధ భూయిష్టులయిన చేతనులను నరకాది క్లేశములు కలిగించి వారిని సరిదిద్ద చూచెదవు. అటులనే అట్టి వారి నుండి సాధు జనులను రక్షింతువు. ఈ క్రమముగా దుష్ట చేతనుల శిక్షణ యందు కూడ దండాపూపికా న్యాయముగా నీ సౌహార్ద్ర గుణము వ్యక్త మగు చున్నది.

దండాపూపికా న్యాయమనగా, అప్పములను తిను ఎలుక అప్పములను గుచ్చి యుంచుటకు వాడబడిన కర్రను కూడ తిని వేయునని చెప్పుట. అనగా మనతో పాటు మన దోషములను కూడ పరమాత్మ స్వీకరించును( మురికి లో పడిన బంగారమును మురికితో తీసికొని నట్లు)

'పాప క్షయ నరక ప్రక్షేప రూపమ్ శిక్షణమపి రక్షణ ప్రకార విశేష ఏవ ఇతి సిద్ధమ్' అని ఆర్యోక్తి కదా!

దండాపూపికా న్యాయము గూర్చి కొందరు సందేహము వ్యక్త పరిచేరు. అందులకై మరి కొంచెం వివరణ

అప్పములు భోగ్యమైన భక్ష్యములు. దానిని గుచ్చి యుంచుటకు వాడు ముల్లు కర్ర కఠినమైనది. తినదగినది కాదు. కాని మూషికము భోగ్యములైన అప్పములను స్వీకరించును. అంతే కాక అభోజ్య మైన కర్రను కూడ తన దంతములతో నమలి స్వాధీనము చేసికొని స్వీకరించును. స్వాదిష్టమైన అప్పములను, కఠినమైన కర్రను కూడ ఏ విధముగా ఎలుక స్వీకరించునో అదే విధముగా పరమాత్మ సాధువులను, అసాధువులను స్వీకరించును. అసాధువులను స్వీకరించునపుడు పరిశ్రమ కొంచెం ఎక్కువ ఉంటుంది. అంతే భేదము. ఆయన దయలో భేదముండదు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి తరువాతి శ్లోకములలో పరమాత్మ విభవావతార వర్ణనము గావించుచున్నారు.

**ధృతి నియమన రక్షా వీక్షణై: శాస్త్రదాన**
**ప్రభృతిభి: అచికిత్స్యాన్ ప్రాణిన: ప్రేక్ష్య భూయ:**
**సుర మనుజ తిరశ్చామ్ సర్వథా తుల్య ధర్మా**
**త్వమ్ అవతరసి దేవ: అజ: అపి సన్ అవ్యయాత్మా** **48**

**ధృతినియమనరక్షావీక్షణైః= ధారణ నియమన రక్షణలకు అనుగుణమైన సంకల్పములచే, శాస్త్రదానప్రభృతిభిః= శ్రుతిస్మృత్యాది శాస్త్రములను ప్రసాదించుట మొదలగు ఉపకారములచే, అచికిత్స్యాన్= దిద్దుబడని, ప్రాణినః= ప్రాణులను, ప్రేక్ష్య= గమనించి, వారిని ఉద్ధరించు ప్రయత్నముగా, భూయః= తిరిగి, అజో అవ్యయాత్మాపి సన్= కర్మకృతమైన జన్మ లేనివాడవైనను, త్వం లీలయా= నీవు లీలగా, సురమనుజతిరశ్చాం= దేవమనుష్యతిర్యగ్జాతుల, తుల్యధర్మా= చేష్టలవంటి చేష్టలను చేయుచు, అవతరసి= అనేకమైన అవతారములను ఎత్తుచున్నావు.**

హే రంగనాథా! నీవు లోకుల ధారణ, ప్రశాసన, రక్షణాదులకై ('అంతః ప్రవిష్టః శాస్తా జనానామ్ సర్వాత్మా' , య ఆత్మని తిష్ఠన్ ఆత్మానమంతరో యమయతి' అని నట్లు), అంతర్యామ్యాది స్వరూపములతో నుండుటయే గాక చతుర్ముఖ బ్రహ్మాది మాధ్యముగా శ్రుతి, స్మృతి, పురాణ, ఇతి హాసాది శాస్త్రములను వారి సత్ప్రవర్తనకై అందించితివి. అయినను, దిద్దబడని ప్రాణులను గమనించి వారిని ఉద్ధరించుటకై కర్మ సంబంధిత జన్మలు లేని వాడవయినను, సంకల్ప మాత్రము చేత నీవు దేవ, మనుష్య, తిర్యగ్జాతుల యందు తత్తుల్య చేష్టితములతో అనేకములైన అవతారములను మరల మరల నెత్తుతున్నావు. (పరిత్రాణాయ సాధూనామ్ ......సంభవామి యుగే యుగే, అజోపిసన్ ....సంభవామి ఆత్మ మాయయా ).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో అమ్మ స్వామితో అన్ని అవతారములలో కూడా కూడియే యుండునన్న విషయము తెలుపుతున్నారు.

**అనుజనుః అనురూపరూప చేష్టా**
**న యది సమాగమ్ ఇందిరా అకరిష్యత్**
**అసరసమ్ అథవా అప్రియమ్ భవిష్ణు**
**ధ్రువమ్ అకరిష్యత రంగరాజ నర్మ** **49**

**ఇందిరా= లక్ష్మీదేవియొక్క, అనుజనుః= ప్రత్యవతారము, అనురూపరూపచేష్టా= మీ అవతారమును అనుసరించిన రూపమును చేష్టితములను గలదియే. సమాగమం= సంశ్లేషమును అట్లు, న కరిష్యద్యది= చేయకపోయినచో, రంగరాజనర్మ= రంగనాథునిగా నీవు చేయు లీల, అసరసమ్= రసహీనమైనదే యగును. అప్రియం భవిష్ణు= అనిష్టమైనదానిగా కూడ, అకరిష్యత= చేయబడినదగును. ధ్రువమ్= ఇది నిశ్చయము.**

హే రంగరాజ! నీ సమస్త లీలలయందును ప్రతి అవతారమునందును లక్ష్మీమాత నీతో పాటు నీ అభిమతానురూపముగా ఎల్లప్పుడూ ఎల్లెడలా తోడుగా నుండకుండిన యెడల నీ క్రీడ నీరసము, అప్రీతి దాయకము అగుననుట నిశ్చయము.

(స్వామి పురుషకార రూపిణి యగు అమ్మ తోకూడియే మనలను పరిపాలించును.

శరణాగతి గద్య నందలి ఓమ్ భగవన్నారాయణాభిమతానురూప.....ప్రపద్యే అను చూర్ణిక స్మరణీయము).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మ అవతార రహస్య జ్ఞానము సామాన్యులు తెలియరని ఈ శ్లోకములో వివరిస్తున్నారు.

**గరీయస్త్వమ్ పరిజానంతి ధీరాః**
**పరమ్ భావమ్ మనుజత్వాది భూష్ణుమ్**
**అజానంతః త్వ అవజానంతి మూఢాః**
**జనిఘ్నుమ్ తే భగవాన్ జన్మ కర్మ** 50

**హే భగవన్= ఓ భగవానుడా!, ధీరాః= నీయొక్క పరమాత్మస్వరూపవైభవమును తెలసిన బుద్ధిమంతులు, గరీయస్త్వం= నీ అవతారములు విశ్వశ్రేయస్సుకొఱకేనని, పరిజానన్తి= చక్కగా తెలుసుకొనుచున్నారు. మూఢాస్తు= అజ్ఞానులైనవారైతే, మనుజత్వాది భూష్ణుం= మనుష్యాది రూపములలో నీవు అవతరించుటలోని, పరంభావం= నీసౌలభ్యాదిగుణములతోనున్న నీ పరత్వమును, అజానన్తః= తెలుసుకొనలేనివారై, అవజానన్తి= నిన్ను ఇతరులైన సురనరులవంటివాడవేనని చెప్పుచు అవమానింతురు. తే= నీయొక్క, జన్మకర్మచ= అవతారములు, చేష్టలును, జనిఘ్నుమ్= సంసారమునుండి జ్ఞానులను ఉద్ధరించుటకేగదా!**

హే రంగనాథా! మాకు ఈ దుఃఖ ప్రపంచమునుండి జన్మ రాహిత్యమును ప్రసాదించుటకు నీవు ఈ ప్రపంచమున జన్మలనెత్తెదవు. కాని ధీమతాగ్రేసరులు మాత్రమే నీ అవతార శ్రేయస్త్వమును తెలిసికొందురు('తస్య ధీరాః పరిజానంతి యోనిమ్', స ఉ శ్రేయాన్ భవతి జాయమానః'). కాని మూఢులు నీ అవతార రహస్యమును, నీ సౌలభ్య గుణమున దాగి యున్న పరత్వమును తెలియ నసమర్థులై నీ దివ్య అవతార మాహాత్మ్యము నెఱుగక సామాన్య సుర, నర జన్మము గానే తలచి నిన్ను అవమానించు చుందురు కదా! ('అవజానంతి మాం మూఢాః', 'జన్మ కర్మ చ మే దివ్యమ్ ఏవమ్ యః వేత్తి తత్త్వతః')

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు శ్లోకమునందు పరమాత్మ అవతార రహస్య జ్ఞానము సామాన్యులు తెలియరని చెప్పిరి. ఈ శ్లోకమునందు దానినే సోదాహరణముగా వివరిస్తున్నారు

**మధ్యే విరించ గిరిశమ్ ప్రథమావతారః**
**తత్ సామ్యతః స్థగయితుమ్ తవచేత్ స్వరూపమ్**
**కిమ్ తే పరత్వ పిశునైః ఇహ రంగధామన్**
**సత్త్వ ప్రవర్తన కృపా పరిపాలనాద్యైః** 51

**హే రంగధామన్= ఓ రంగనాథా!, విరించ గిరిశం= బ్రహ్మ రుద్రుడు అని చెప్పబడువారి, మధ్యే= మధ్యను, ప్రథమావతారః= విష్ణువు అని చెప్పబడు నీ ప్రాథమికమైన అవతారము, తత్సామ్యతః= ఆ బ్రహ్మరుద్రుల సాదృశ్యముచే, తవ స్వరూపం= నీ సర్వేశ్వరత్వస్వరూపమును, స్థగయితుం చేత్= ఆచ్ఛాదించుటకే అయినచో, పరత్వపిశునైః= నీలోని సత్త్వప్రవర్తనము కృపాగుణము పరిపాలనాదక్షత మొదలగు గుణములచే, ఇహ తే కిమ్= అట్లు ఆచ్ఛాదించుట కుదురుట లేదుగదా!**

హే రంగధామన్! నీ ప్రథమావతారము త్రిమూర్తుల యందు బ్రహ్మ, రుద్రుల మధ్య నుండు విష్ణ్వవతారము. నీవు ఆ అవతారము నందు నీ పరత్వమును గోప్యముగా నుంచుకొని బ్రహ్మ, రుద్రుల సమాన స్థాయిలో నుండినను, నీ పరత్వము దాచ బడదు. (బ్రహ్మ కు పలుమారులు హయగ్రీవుడవై, హంసవై వేదోపదేశము చేసినప్పుడు గాని, రుద్రుని బ్రహ్మ హత్యాపాతకము పోగొట్టునపుడు గాని, బాణునికి సహాయముగావచ్చిన రుద్రుని పరువెత్తించినపుడు గాని ) పలుమారులు నీ పరత్వ స్వరూపము స్ఫురించుచునే యుండును.

కాని సామాన్యులు ఈ భేదమును తెలియక నిన్ను త్రిమూర్తులలో నొకడుగా తలంచెదరు. నీ అద్వితీయత సామాన్యులు ఎపుడు గ్రహింతురో కదా.

వేదాపహార గురు పాతక....ఫల ప్రదానైః(స్తోత్ర రత్నమ్)
యో బ్రహ్మణమ్ విదధాతి పూర్వమ్
తమ్ దేవతానామ్ పరమమ్ చ దైవతమ్(శ్రుతి వాక్యములు)
ఇమ్ వివస్వతే యోగమ్ ప్రోక్తవాన్(భ.గీ)
మున్నగు వాక్యములు ఇచట స్మరణీయములు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్లో. శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మ తన హయగ్రీవావతారమునందు చతుర్ముఖ బ్రహ్మను అఖిల జీవ కోటిని ఎట్లు రక్షించెనో వివరించుచున్నారు.

**మధుః కైటభః చ ఇతి రోధమ్ విధూయ**
**త్రయీ దివ్య చక్షుః విధాతుః విధాయ**
**స్మరసి అంగ రంగిన్! తురంగావతారః**
**సమస్తమ్ జగత్ జీవయిష్యసి అకస్మాత్** 52

**హే అఙ్గరఙ్గిన్= అందముగా నడచువాడా! తురఙ్గావతారః= నీయొక్క హయగ్రీవావతారము, మధుకైటభశ్చేతిరోధం= మధుకైటభులను రాక్షసులరూపములో వేదములకు కలిగిన విరోధమును, విధూయ= విదల్చివేసి, విధాతుః= చతుర్ముఖబ్రహ్మయొక్క, త్రయీదివ్యచక్షుః= వేదములు అను దివ్యచక్షువులను, విధాయ= ఇచ్చి, అకస్మాత్= నిర్హేతుకకృపచే, సమస్తంజగత్= సమస్తమైన లోకములను, స్మరసి= తలంచితివి, జీవయిష్యసి= రక్షించితివి.**

ఓ రంగనాథ! మధు కైటభులను రాక్షసులు చతుర్ముఖుని నుండి వేదాపహరణము చేసినపుడు ఆయన జ్ఞాన చక్షువులు లేనివాడాయెను. అప్పుడు నీవు హయగ్రీవావతారము దాల్చి మధు కైటభులను సంహరించి చతుర్ముఖునికి వేదములు తిరిగి ఇచ్చి రక్షించితివి. ఆ కార్యము సమస్త జగత్తునకు నీవు నిర్హేతుక కృపతో చేసిన మహోపకారము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మకు మఱియొక అవతారమైన హంసావతారమును వివరించుచున్నారు ఈ శ్లోకములో

**రంగధే! తిమిర ఘస్మరశీత స్వచ్ఛ హంసతనుః ఇందురివ ఉద్యన్**
**వేదభాభిః అనుజగ్రహిథ ఆర్తాన్**
**జ్ఞాన యజ్ఞ సుధయైవ సమృధ్యన్** **53**

**హే రంగధే= ఓ శ్రీరంగధురంధరా! జ్ఞానయజ్ఞసుధయైవ= జ్ఞానయజ్ఞము అను అమృతముచేతనే, సమృద్ధ్యన్= తృప్తి చెందినవాడవై, తిమిరఘస్మరా= అజ్ఞానమను అన్ధకారమును భక్షించునట్టి, శీతస్వచ్ఛ= చల్లనిది నిర్దోషమైనదియును అగు, హంసతనుః= హంసరూపమున, ఇన్దురివ= చంద్రునివలె, ఉద్యన్= అవతరించి, ఆర్తాన్= వేదనిధిని పోగొట్టుకొనిన చతుర్ముఖుడు మొదలైన వారిని, వేదభాభిః= శ్రుతిరూపకాంతులచే, అనుజగ్రహిథ= అనుగ్రహించితివి.**

శ్రుతులు అఖిల విజ్ఞాన దాయకములు. భగవానుడు వానిని చతుర్ముఖ బ్రహ్మకు ప్రసాదించి సృష్టి కార్యమునకు ఆదేశించేడు. కాని ఆ బ్రహ్మ ఆ శ్రుతులను పోగొట్టుకొనగా, హే రంగనాథ! జ్ఞానయజ్ఞమను అమృతము చేత (జ్ఞాన యజ్ఞేన చాపి అన్యే యజంతః మామ్ ఉపాసతే) తృప్తి చెందు నీవు అజ్ఞానాంధకారము పోగొట్టు నిర్దోషమైన తెల్లని హంసావతారమునెత్తి మరల నా వేదములను ఆర్తుడైన చతుర్ముఖునకనుగ్రహించితివి. (ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీచ పురుషర్షభ)

= = = = = = = = = = = = = = = = == = = = = = = = = = = = = == = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి తన కుక్షిలో సమస్త లోకములు ధరించి మఱ్ఱియాకు పై పండుకొని యున్న పరమాత్మను ఈశ్లోకములో స్మరించుచున్నారు.

**వటదళమ్ అధిశయ్య రంగధామన్**
**శయిత ఇవ అర్ణవతర్ణకః పదాబ్జమ్**
**అధిముఖమ్ ఉదరే జగంతి మాతుమ్**
**నిదధిథ వైష్ణవ భోగ్య లిప్సయా వా** **54**

**హే రంగధామన్= ఓ శ్రీరంగనాథా! (త్వం)= నీవు, శయితః= నిద్రించుచున్నవాడివై, అర్ణవతర్ణక ఇవ= సముద్రముయొక్క కుమారునివలె, వటదళం= మఱ్ఱియాకుపై, అధిశయ్య= పండుకొని, ఉదరే= నీ ఉదరమందున్న, జగన్తి= జగములను, మాతుం= కొలుచుటకు, పదాబ్జం= నీ శ్రీపాదకమలమును, అధిముఖం= నీ నోటిలో, నిదధిథ= పెట్టుకొనినావు. (అట్లు పెట్టుకొనుట) వైష్ణవభోగ్యలిప్సతయా వా= నీ పాదాంబుజమునకు గల శ్రీవైష్ణవత్వముచే కలిగిన భోగ్యతను నీవుకూడ అనుభవించవలెనను ఇచ్ఛతోడనా లేక (చిన్న శిశువుగా నుండుటచే కలిగిన ఆటచేతనా)**

హే రంగనాథా! నీవు ప్రళయ సమయమున సమస్త లోకములను నీ కుక్షిలో నుంచుకొని మఱ్ఱియాకు పై పరుండినపుడు నీ పాదము నీ నోటియందు ఉంచుకొనెదవు. దీనికి కారణము సకల లోకములను కొలిచి చూచిన

నీ పాదము తో ఆ లోకములు సరి చూచుకొనుటకా లేక సమస్త వైష్ణవ జనమునకు మిక్కిలి భోగ్యమైన నీ పాదము స్వయముగా రుచి చూచుటకా తెలుపుము

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో క్షీర సాగర మథన వృత్తాంతము స్తుతించుచున్నారు.

**ఉన్మూల్య ఆహర మందరాద్రి మహినా తమ్ సంబంధాన అమునా**
**దోర్భిః చంచల మాలికైః చ దధి నిర్మాథమ్ మథాన అంబుధిమ్**
**శ్రీరంగేశ్వర! చంద్ర కౌస్తుభ సుధాపూర్వమ్ గృహాణేతి తే**
**కుర్వాణస్య ఫలగ్రహిః హి కమలా లాభేన సర్వః శ్రమః** **55**

**హే శ్రీరంగేశ్వర= ఓ రంగనాథా! త్వం= నీవు, మన్దరాద్రిం= మందరపర్వతమును, ఉన్మూల్య= పెకలించి, ఆహర= తీసుకొని వచ్చితివి. అమునా= త్రాడువలెనున్న, అహినా= వాసుకి(అను సర్పము)తో, తం మన్దరాద్రిం= ఆ మందరపర్వతమును, సంబధాన= కట్టితివి. చంచలమాలికైః= కదలుచున్న పుష్పమాలికలవంటి, దోర్భిః= నీ చేతులతో, అంబుధిం= సముద్రమును, దధినిర్మాథం= పెరుగును చిలికినట్లుగ, మథాన= మథించితివి. చంద్రకౌస్తుభసుధాపూర్వం= చంద్రుడు కౌస్తుభము అమృతములను, గృహాణ= స్వీకరించితివి. ఇతి=అని, సర్వశ్రమః= ఈ విధముగ సముద్రమును చిలికిన నీయొక్క ఆయాసమంతయు, కమలాలాభేన= లక్ష్మీదేవిని పొందుటచే, ఫలే గ్రహిర్హి= సఫలమైనదిగదా!**

హే రంగేశ్వర! నీవు మందర పర్వతమును పెకలించి తెచ్చితివి. వాసుకి ని త్రాడుగా ఆమందర పర్వతమునకు కట్టి, పుష్పమాలికలను బోలు నీ సుకుమారమైన చేతులతో ఆ పాల సముద్రమును పెరుగు చిలికి నట్లు చిలికితివి. చంద్ర, కౌస్తుభాదులను స్వీకరించినను, నీ శ్రమ అంతయు సఫలమైనది శ్రీమన్మహాలక్షీదేవిని పొంది నపుడు కదా!

ఇచట లోక ప్రసిద్ధమైన స్వామి కూర్మావతారమును కాక క్షీర సాగర మథన కార్యమున పరమాత్మ కృప చేసిన తక్కిన కార్యములను భట్టర్ స్వామి స్మరించుట గమనార్హము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో గజేంద్ర మోక్షణ వృత్తాంతము స్తుతించుచున్నారు

**దేవి హస్త అంబుజేభ్యః చరణకిసలయే సంవహద్భ్యః అపహృత్య**
**ప్రత్యస్య అనంతభోగమ్ ఝటితి చలపుటే చక్షుషీ విస్తృణానః**
**ఆక్షిప్య ఉరః చ లక్ష్మ్యాః స్తన కలశ కుంకుమ స్తోమపంకాత్**
**దేవః శ్రీరంగ ధామా గజపతి ఘుషితే వ్యాకులః స్తాత్ పురో నః** **56**

**గజపతిఘుషితే= గజేంద్రుడు ఆర్తధ్వని చేయుచుండగా, చరణకిసలయే= చిగురువలె అతికోమలములైన పాదకమలములను, సంవహద్భ్యః= సంవహనము చేయుచున్న(ఒత్తుచున్న), దేవీహస్తాంబుజేభ్యః= లక్ష్మీదేవియొక్క చేతులనుండి, అపహృత్య= లాగివేసికొనినట్లు, అనన్తభోగం= శయ్యగానున్న శేషుని శరీరమును,**

**ప్రత్యస్య= త్రోసివేసి, స్తనకలశయోః= కలశములవంటి స్తనములయొక్క కుంకుమపంకముచే, కనతః= ప్రకాశించుచున్న, ఉరః ఆక్షిప్య= వక్షస్సుతో, చలపుటే= కదలుచున్న కనురెప్పలను, విస్తృణానః= తెరచుచు, వ్యాకులః= చాల గాభరా చెందిన శ్రీరంగనాథుడు, నః పురః= మనకు ప్రత్యక్షము, స్తాత్= అగుగాక.**

గజేంద్రుని ఆర్తనాదము చేయగా ఆదిమూర్తి అయిన భగవానుడు పల్లవముల వలె నతికోమలమయిన పాదములను సంవహనము చేయుచున్న దేవేరుల చేతుల నుండి పాదములను తొలగించుకొని ఆదిశేషుని నుండి తత్తరపాటుతో లేచిన శ్రీదేవీ స్తన యుగ్మ కుంకుమాంకిత వక్షముతో విచలిత నేత్రములతో మిక్కిలి వ్యాకులతతో నుండిన శ్రీరంగ నాథుడు మాకు ప్రత్యక్షమగు గాక

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్లో. శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో గజేంద్ర రక్షణ యందు భగవానుని త్వరను స్తుతిస్తున్నారు.

**అతంత్రిత చమూపతి ప్రహిత హస్తమ్ అస్వీకృత**
**ప్రణీత మణిపాదుకమ్ కిమ్ ఇతి చ ఆకులాంతఃపురమ్**
**అవాహన పరిష్క్రియమ్ పతగరాజమ్ ఆరోహతః**
**కరిప్రవర బృంహితే భగవతః త్వరాయై నమః** **57**

**కరిప్రవరబృంహితే= గజేంద్రుడు మొర పెట్టుచుండగా, అతంత్రితః= అనాదరింపబడిన, చమూపతినా= విష్వక్సేనునిచే, ప్రహితౌ= సమర్పింపబడిన, హస్తౌ= చేతులను, అస్వీకృతే= స్వీకరింపబడని, ప్రణీతే= మణిపాదుకలును, కిమితి చ= ఎందులకు(స్వీకరించుట లేదు? ఇట్టి వ్యాకులత ఎందులకు? అనగా తన భక్తుడైన గజేంద్రుడు ఆపదలో ఉండి మొర పెడుతూండగా తాను వెళ్ళి రక్షించటానికి ఆలస్యం కావటం భగవానుడు సహించలేక తొందరతో వేగంగా చేరాలని ఆకులుడైనాడని భావం) ఆకులం= సంభ్రాంతిచెంది, అవాహనపరిష్క్రియం= వాహనాన్ని ఎక్కడానికి తగినట్లుగా పరిష్కరించటం కూడా చేయబడని, పతగరాజం= తనకు వాహనమైన గరుత్మంతుని, ఆరోహతః= ఎక్కుతున్న, భగవతః= భగవానుని, త్వరాయై= తొందరకు, నమః= నమస్కారము.**

గజేంద్రుని మొర వినిన భగవానుడు ఆ గజరాజు రక్షణా సంరంభమునందు విష్వక్సేనుడు సమర్పిస్తున్న మణి ఖచిత పాదుకలను స్వీకరించలేదు. అధిరోహించుటకు గరుడాళ్వాను సిద్ధముగాకున్నను తాను సత్వరము నధిరోహించి గజేంద్రుని కడకు అత్యంత వ్యాకులుడై పర్విడెను. ఆర్త త్రాణ పరాయణత్వము నందు పరమాత్మకు గల ఆ త్వరకు నమస్కారము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో కూడ పరమాత్మ ఆర్త త్రాణ పరాయణ గుణమును స్తుతిస్తున్నారు.

**యమ్ పశ్యస్ విశ్వధుర్యామ్ ధియమ్ అసకృత్ అథో మందరామ్ మన్యమానః**
**హుంకార ఆస్ఫాలన అంఘ్రి ప్రహతిభిరపి తమ్ తార్క్ష్యమ్ అధ్యక్షిపః త్వమ్**
**కించ ఉదంచస్ ఉదస్థః తమథ గజపతే బృంహితే జృంభమాణే**

**దేవ! శ్రీరంగబంధో! ప్రణమతి హి జనే కాందిశీకీ దశా తే 58**

**హే శ్రీరంగబంధో దేవ!= ఓ జ్యోతిస్స్వరూపుడవైన శ్రీరంగనాథా, యం తార్క్ష్యం= ఏ తార్క్ష్యుని (తార్క్ష్యుడనగా వినత కశ్యపుల కుమారుడు గరుత్మన్తునికి అన్న. ఇతడు మనోవేగముతో పరుగుపెట్టు అశ్వముగా చెప్పబడుదుడు.) పశ్యన్= చూచుచు, అథోసకృత్= పిదప నిరన్తరము, విశ్వధుర్యాం= సకలలోకముల నిర్వహణభారమును మోయునట్టి దశను. ధియం= సంకల్పరూపజ్ఞానమును, మన్దరాం = మెల్లగ పోవుచున్నదని, మన్యమానః= భావించినవాడై, త్వం= నీవు, తం= సంకల్పరూప జ్ఞానమంతవేగముగ పోవుచున్న తార్క్ష్యునిగూడ, హుఙ్కార ఆస్ఫాలన అంఘ్రి ప్రహతిభిః= హుంకారములచేతను, శరీరమును చరుచుట, గుఱ్ఱమును ఎక్కి రికాబులలో కాళ్ళనుంచి వాటితో కొట్టుట మొదలగు వాటితో , అధ్యక్షిపః= ఇంకను తొందర గా పోవలెనని ప్రేరేపించుదువు. అథో= అటుపిమ్మట, గజపతేః బృంహితే= గజేంద్రుని మొరలు చాల ఎక్కువ అగుచుండగా, కిఞ్చ= ఇంకను తార్క్ష్యుని, ఉదఞ్చన్= రెండుపాదములచే ముందుకు ఉరికించుచు, ఉదస్థాః= తొందర పెట్టితివి గదా.**

దేవా! రంగనాథా! మనో వేగముతో తార్క్ష్యుని పోలి పోవుచున్న గరుడుని వేగము కూడ సరిపోక తన పాదములతో కొట్టుచూ ఇంకనూ అధిక వేగముతో గజరాజుని సమీపించుటకు నా గరుడుని ప్రేరేపించితివి. గజేంద్రుని మొర వినిన వెంటనే నీవే నీ సంకల్ప వేగముతో నా గరుడుని నడిపించి నట్లు తొందర పెట్టితివి కదా!

ఇది అంతయు నీకు ఆర్త త్రాణ పరాయణత్వము నందు గల ఆతురత యే!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి గజేంద్ర రక్షణముపై చేసిన ఈశ్లోకము నాల్గవది, చివరిది. పరమాత్మ పరత్వాది గుణములు ముందు వర్ణించిన పిదప ఆయన కారుణ్య, వాత్సల్య, సౌశీల్యాది గుణాలను ఈ శ్లోకాలలో వర్ణిస్తున్నారు

**శ్రీరంగేశయ! శరణమ్ మమాసి వాత్యా**
**వ్యాలోలత్ కమల తటాక తాండవేన**
**స్రగ్భూషాంబరమ్ అయథాయథమ్ దధానః**
**ధింగ్మామ్ ఇతి అనుగజగర్జమ్ అజగంథ 59**

**హే శ్రీరంగేశయ= ఓ శ్రీరంగనాథా! అనుగజగర్జం= గజేంద్రుని మొరల తరువాత, మాం= నన్ను, ధిగితి= అయ్యో ఈ గజేంద్రుడు ఇంతగా మొఱ్ఱలు పెట్టుచున్న ను ఈ స్వామి ఆలసిస్తున్నాడే అని లోకులు నిందిస్తారుగదా అని, భావించి, అయథాయథం= తొందరపడటంచేత తొట్రుకుంటూ రావటం ( ఎలా ఉన్నదంటే), స్రగ్భూషాంబరం= పూలమాలతోబాటు కట్టుబట్టకూడా, వాత్యయా= గాలులవలన, వ్యాలోలతః= బాగుగా కదలిపోతున్న, కమలతటాకస్య= తామరపూవులతో నిండుగానున్న సరస్సు, తాండవేన= నృత్యం చేస్తున్నదా అనిపించినట్లు, ( నీ పూలమాలలూ, కట్టుకున్న బట్టలూ నీవు వస్తున్న వేగానికి రెపరెపలాడటం పెద్ద పెద్ద గాలులువీచినపుడు చెరువు అతలాకుతలం ఔతూండగా అందులోని తామరపూవులు నృత్యం చేస్తున్నాయా అన్నట్లు కదులుతూ ఉన్నాయి. నీ కట్టుబట్టలూ ధరించిన పూలమాలలూ నీవు వస్తున్న వేగానికి తొందర కి అలా రెపరెపలాడుతూ ఉన్నాయని భావం) త్వం= నీవు, ఆజగన్థ= వచ్చితవి, మరియు, శరణం మమాసి= నాకు శరణు అయినావు.**

హే శ్రీరంగనాథ! గజేంద్రుని మొఱ వినిన నీవు ఈ స్వామి ఆలసిస్తున్నాడే యని అనెడు లోకులకు భయపడినట్లు త్ొందరతో త్ొట్రుకుంటూ, పుష్పమాలికా యుతమైన పీతాంబరములు నీవు వచ్చువేగమునకు గాలివలన అస్థవ్యస్థము కాగా నీ స్వరూపమపుడు గాలివలన కలగుండు పడి నృత్యము చేయుచున్న నీల పద్మాకరము వలెనున్నది. అట్టి నీవు మాకు శరణ్యము.

స్వామి కనులు, హస్తములు, పాదములు, ముఖము అన్నియు పద్మములను పోలి యుండగా నీల దేహుడైన స్వామి నీల వర్ణము గల సరస్సు వలె నుండెను అని భావము.

తన భక్తుల రక్షణయందు స్వామికి గల ఆతురత మఱియొక మారు భట్టర్ అనుగ్రహించేరు ఈ శ్లోకములో.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్లో. శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకము నుండి 73 వ శ్లోకము వరకు దశావతార వివరములు అనుగ్రహిస్తున్నారు. అందు మత్స్యావతారమును ఱెండు శ్లోకములలో వివరిస్తున్నారు.

**మీన తనుః త్వమ్ నావి నిధాయ**
**స్థిర చర పరికరమ్ అనుమను భగవాన్!**
**వేదసనాభి స్వోక్తి వినోదైః**
**అకలిత లయ భయలవమ్ అముమ్ అవహః** 60

**హే భగవన్= హే భగవానుడా! మీనతనుః= మత్స్యావతారమును ఎత్తి, త్వం= నీవు, స్థిరచరపరికరం= సృష్టించుటకు బీజభూతమైన చరాచరవర్గమును, అనుమను= మనువుతోకూడ, నావి= భూమిపై, నిధాయ= నిక్షిప్తము చేసి, వేదసనాభిః= శ్రుతివాక్యములవంటి, స్వోక్తివినోదైః= స్వోక్తుల రూపములో శ్రుత్యర్థములను ఉపదేశించి, అముం అకలితలయభయలవం= ఈ అవాంతరప్రళయమను భయము లేశమాత్రముగ కూడ లేకుండ చేసి, అవహః= ధరించియున్నావు.**

హే రంగనాథ! ప్రళయ సమయమందు సత్యవ్రత మనువును, సూక్ష్మ చిదచిద్వస్తు సముదాయమును, (ఓషధులను), పెద్ద నావపై నుండజేసి నీవు మీన శరీరము దాల్చి ఏకశృంగముతో ఆ నావను ధరించి తరంగావృతమైన ఆ ప్రళయ సాగరమునందు వారిని కాపాడి, ఆ అవాంతర ప్రళయమను భయము ఏమాత్రమును కలుగనీయక నీ వేద వాక్కులతో వారికి వినోదము కలిగించితివి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మ మత్స్యరూపమును ఈ శ్లోకములో కూడా అనుభవిస్తున్నారు

**శ్రీనయనాభ ఉద్భాసుర దీర్ఘ**
**ప్రవిపుల సురుచిర శుచి శిశిరవపుః**
**పక్షనిగీర్ణ ఉద్గీర్ణ మహాబ్ధిః**

**స్థల జల విహరణ రతగతిః అచరః** **61**

**హే భగవన్= ఓ శ్రీరంగనాథా! శ్రియః= లక్ష్మియొక్క, నయనాభయా= నేత్రకాంతిచే, ఉద్భాసురం= ఉజ్జ్వలముగను దీర్ఘం= విశాలమైన, ప్రవిపులం= విస్తారమైన, సురుచిరం= అత్యంతము సుందరమైన, శుచి= స్వచ్ఛమై, శిశిరం= చల్లనిదినియగు, వపుః= శరీరముగల నీవు, పక్షాభ్యాం= పక్షములచే, నిగీర్ణోద్గీర్ణస్య= విశాలమై ఆవరించియున్న, మహోద్ధేః= సముద్రమందు, స్థలజలవిహరణమందు, రతా= నిరతమైన గతి గలవాడవుగా మత్స్యమూర్తిగానున్నావు.**

హే భగవన్! నీ మీన స్వరూపము లక్ష్మీ దేవి యొక్క అందమైన కనుల వలె దీర్ఘముగా, విశాలముగా, చల్లగా, ఉజ్జ్వలముగా, ప్రకాశవంతంగా, స్వచ్ఛముగా( పవిత్రముగా) నున్నది. నీ పక్షములతో (మొప్పలతో), నీవు నీటిని పీల్చుచూ వదలుతున్నపుడు, విశాలమైన సముద్రము ఒకప్పుడు సైకతమయమై వేఱొకసారి జల మయమై అద్భుతముగానున్నది. (ఏమి నీ విచిత్ర లీలా విలాసములు)!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకమునందు కూర్మావతారమును స్తుతిస్తున్నారు.

**చకర్థ శ్రీరంగిన్! నిఖిల జగదాధార కమఠః**
**భవన్ ధర్మాన్ కూర్మః పునః అమృత మంథాచలధరః**
**జగంథ శ్రేయః త్వమ్ మరకత శిలాపీఠ లలితః**
**జలత్ ఉద్యత్ లక్ష్మీ పదకిసలయ న్యాస సులభమ్** **62**

**హే శ్రీరంగిన్= శ్రీరంగనాథా! , నిఖిలజగదాధారకమఠః= సమస్త లోకములకును ఆధారమైన కూర్మమూర్తిగా, భవన్= అగుచు ( అవతరించి), ధర్మాన్= ( సమస్త) ధర్మములను, చకర్థ= ప్రసాదించితివి. పునః= ఇంకను, అమృతమన్థాచలధరః= అమృతమును చిలుకుటకు మందరపర్వతమును నిలపెట్టు, కూర్మో= కూర్మమూర్తిగా, భవన్=అగుచు, జలాత్= సముద్రమునుండి, ఉద్యన్త్యాః= అవతరించు, లక్ష్మ్యాః= లక్ష్మియొక్క, పదకిసలయోః= లేతవైన శ్రీపాదములను, న్యాసేన= ఉంచుటచే, మరకతశిలాపీఠలలితః= మరకతశిలలతో చేయబడిన ఆసనమువలెనున్న నీవు, సులభం= తగినదియు శ్రేయస్కరముగను, జగన్థ=( వచ్చినది) అయినది.**

హే శ్రీరంగనాథ! నీవు నిఖిల జగదాధారుడవై కూర్మమూర్తిగా అవతరించి ధర్మోద్ధరణ గావించితివి.

అమృతమథన సమయమున మందర పర్వతమును ధరించి మరకత శిలాసనము వలె నున్న నీవు సముద్రోద్భవ అయిన లక్ష్మీ దేవి పాద పల్లవముల నుంచుటకు తగినట్లు శ్రేయస్కరముగా నుంటివి. (నీ ఉచ్ఛ్వాస నిశ్వాసములకు తరంగబాహుళ్యమున కదలుచుండు క్షీర సాగరము నీతో క్రీడించు లక్ష్మీదేవి సౌకర్యమునకు తగిన తూగుటుయ్యాల వలె నున్నది కదా!)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి వరాహావతారమును కీర్తిస్తున్నారు ఈ శ్లోకములో.

**హృది సురరిపోః దంష్ట్రోత్ఖాతే క్షిపన్ ప్రలయార్ణవమ్**
**క్షితికుచతటీమ్ అర్చన్ దైత్యాస్ర కుంకుమ చర్చయా**
**స్ఫుట ధుత సటాభిః భ్రామ్యన్ బ్రహ్మణః స్తవ ఉన్ముఖ బృంహితః**
**శరణమసి మే రంగిన్ త్వమ్ మూలకోలతనుః భవన్** **63**

**హే రంగిన్= ఓ రంగనాథా, త్వం= నీవు, మూలకోలతనుః= ఆదివరాహముయొక్క విగ్రహమును, భవన్= స్వీకరించి, దంష్ట్రోత్ఖాతే= కోరలచే చీల్చబడిన, సురరిపోః= దేవతల శత్రువైన హిరణ్యాక్షుని, హృది= వక్షస్థలమున, ప్రళయార్ణవం= ప్రళయమను భయసముద్రమును, క్షిపన్= చిమ్ముచు అనగా కలిగించుచు, దైత్యాస్ర= రాక్షసుని రక్తము అను, కుంకుమచర్యయా= కుంకుమపంకమును అలదుచు, క్షితికుచతటీం= భూదేవియొక్క వక్షస్థలమును, అర్చన్= అలంకరించుచు, స్ఫుటధుత= బాగుగా కదల్చబడిన, సటాభిః= మెడపైనున్న రోమములను, భ్రామ్యన్= త్రిప్పుచు, బ్రహ్మణః =(అందుచే భయపడిన) పితామహుడగు బ్రహ్మచే చేయబడిన, స్తవ= రక్షణప్రార్ధనారూపమగు స్తోత్రమునకు, ఉన్ముఖ= అభిముఖమైన, బృంహితః= అభయప్రదానరూపమైన గర్జనముచే, మే=నాకు, శరణం= రక్షకుడవు, అసి= అగుచున్నావు.**

హే రంగనాథా! నీవు ఆది వరాహ మూర్తి అవతారమున సురరిపుడైన హిరణ్యాక్షునికి భయంకరుడవై వాని హృదయమును కోఱలతో చీల్చి వాని రక్తమును కుంకుమ వలె భూదేవి స్తనములపై నలది అలంకరించుచూ, కంఠమందలి రోమములను భీకరముగా త్రిప్పుచూ బ్రహ్మదులచే స్తుతించబడుచూ అభయ ప్రదానరూప గర్జనముతో రక్షణనొసంగెడి ఆ ఆది వరాహమూర్తియే నాకు శరణ్యము

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములోను, తరువాతి శ్లోకములలోను నరసింహావతారమును వర్ణిస్తున్నారు.

**నృహరి దశయోః పశ్యన్ ఔత్పత్తిక ఘటనాద్భుతమ్**
**నరమ్ ఉత హరిమ్ దృష్ట్వా ఏకైకమ్ సముద్విజతే జనః**
**ఇతికిల సితాక్షీర న్యాయేన సంగమిత అంగకమ్**
**స్ఫుటసట మహాదంష్ట్రమ్ రంగేంద్ర సింహమ్ ఉపాస్మహే** **64**

**రంగేంద్ర= రంగనాథా! నృహరిదశయోః= నరదశ సింహదశలయొక్క, ఔత్పత్తికం= ఉత్పత్తిసిద్ధమైన, ఘటనాద్భుతం= విచిత్రమైన ఘటనను, పశ్యన్= చూచుచున్న, జనః= జనము, ఏకైకం= విడివిడిగానున్న, నరం ఉత హరిం= మనుష్యుని లేక సింహమును- నీచే సంఘటితమైన నరత్వ సింహత్వముల అత్యన్తాశ్చర్యకరమైన సంగతిసౌందర్యమును, దృష్ట్వా= చూచి, సముద్విజతే= ఉద్వేగమును కలిగియుండును అను, ఇతికిల= అను కారణముచే, సితాక్షీరన్యాయేన= పంచదార పాలు చక్కగా కలసిపోవునను న్యాయముచే, సంగమితాంగకం=**

**సంఘటితము చేయబడిన విగ్రహమును గల, స్ఫుటసట మహాదంష్ట్రం= నిక్కబొడిచిన మెడమీది రోమములును చాలపెద్దవైన కోరలునుగల సింహం= నరసింహుని అవతారమును, ఉపాస్మహే= ఉపాసించుచున్నాము.**

రంగనాథా! విచిత్రమైన నర, సింహముల కలయికతో, నిక్క బొడుచుకున్న మెడమీద రోమములును, దీర్ఘ దంష్ట్రములును ఆశ్చర్య కరమై, అత్యద్భుతమై పాలును, పంచదారయు కలసిపోయినట్లున్న ఉద్వేగమును కలిగించు ఆ నృహరి స్వరూప సౌందర్యమును నేను ఉపాసించుచున్నాను.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి నృసింహావతార వర్ణనము ఈ శ్లోకములో కూడా కొన సాగిస్తున్నారు.

**ద్విషాణ ద్వేష ఉద్యస్ నయనవనహ్ని ప్రశమన**
**భ్రమత్ క్ష్మీ వక్త్ర ప్రహిత మధుగండూష సుషమైః**
**నఖక్షుణ్ణ అరాతిక్షతజ పటలైః అప్లుసటా**
**ఛటాస్కంధః రుంధే రుతితమ్ ఇహ పుంస్పంచవదనః** 65

**ద్విషాణే= శత్రువైన హిరణ్యకశిపునిపైగల, ద్వేష= ద్వేషమువలన, ఉద్యతః= బయలుదేరు, నయన= నేత్రములయందలి, వనవహ్నేః= కారుచిచ్చును, ప్రశమన= శాంతింపజేయుటకు, భ్రమన్త్యాః= తొందరగల, లక్ష్మ్యాః= దయాపూర్ణురాలైన అంకస్థలక్ష్మియొక్క, వక్త్రప్రహిత= ముఖమునుండి బయటపడిన, మధుగండూష= ఆసవముతోచేసినందున ఎఱ్ఱని గండూషముయొక్క, సుషమా= శోభగల, నఖక్షుణ్ణస్య= గోళ్ళచే చీరివేయబడిన, అరాతేః= శత్రువుయొక్క, క్షతజపటలైః= రక్తసమూహములచే, ఆప్లుతః= తడిసిన, సటాచ్ఛటానాం= కేసరసమూహములతోనున్న, స్కన్ధః= భుజములుగల, పుంస్పంచవదనః= నరసింహుడు, ఇహ= శ్రీరంగమునందు, దురితం= పాపమును, రున్ధే= పోగొట్టుచున్నాడు**

భగవాన్ నృసింహుడు తన భక్తుడైన ప్రహ్లాదునకు శత్రువైన హిరణ్యకశిపునిపై తీవ్రమైన కోపముతో, కార్చిచ్చును బోలు రక్తవర్ణ నేత్రములతో, లక్ష్మీ ముఖ నిగళిత తాంబూలాసవ శోభాయమానమైన ఎఱ్ఱని నఖములతో విదారితమైన హిరణ్య హృదయ రక్తాప్లుతమైన కేసరసమూహముతో, వానిచే అలంకృతములైన బాహుదండములతో విరాజిల్లుచు ఈ శ్రీరంగమునందు వేంచేసి యుండెను. ఆ నృసింహుడు మా పాపములు పోగొట్టుగాక!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్లో. శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి నృసింహా వర్ణనము ఈ శ్లోకములో కూడ

**నఖాగ్ర గ్రస్తే అపి ద్విషతి నిజభక్త ద్రుహి రుషః**
**ప్రకర్షాత్ విష్ణుత్వ ద్విగుణ పరిణాహ ఉత్కటతనుః**

**విరుద్ధే వైయగ్రీ సుఘటిత సమానాధి కరణే**
**నృసింహత్వే బిభ్రత్ వరద! బిభరామాసిథ జగత్** **66**

**హే వరద!= ఓవరదరాజా! విరుద్ధే= విరుద్ధములైనను, వైయగ్ర్యా= ప్రహ్లాదుని ఆర్తినితొలగించుటకుగల వ్యగ్రతచే, సుఘటిత= చక్కగా చేర్చబడిన, సమానాధికరణే= ఒకేశరీరమందుగల, నృసింహత్వే= నరత్వ సింహత్వరూపమును, బిభ్రత్= ధరించుచు, త్వం= నీవు, నిజభక్తద్రుహి= నీ భక్తుడగు ప్రహ్లాదునికి ద్రోహియగు, ద్విషతి= శత్రువు, నఖాగ్రగ్రస్తేపి= గోళ్ళచివరలచే చీల్చబడినను, రుషః= కోపముయొక్క ప్రకర్షాత్= అతిశయముచే, విష్ణుత్వాత్= మహావిష్ణుపదవాచ్యవ్యాపనముచే, ద్విగుణపరిణాహేన= ద్విగుణీకృతమైన( రెట్టించిన), ఉత్కటతనుః= ఉన్నతమైన( పెద్దదైన) శరీరముగలవాడవై, జగత్= లోకమును, బిభరామాసిథ= భరించి రక్షించితివి.**

హే వరద! ప్రహ్లాద రక్షణకై పరస్పర విరుద్ధములైన నర, హరి రూపములను చక్కగా ఒక్క తనువులో నుండునట్లు అవతరించితివి. నీ రోషము హిరణ్యకశిపుని నీ నఖాగ్రములతో చీల్చిన పిదప కూడ తగ్గక ఇంకను అతిశయించినది. ఆ సమయమున నీ శరీరము కూడ ద్విగుణీకృతమగుచు నున్నది. మహా విష్ణు పద వాచ్యుడవైన నీవు (ఉగ్రం వీరమ్ మహావిష్ణుమ్....) నీ సర్వ వ్యాపకత్వము నిరూపించుచూ స్తంభము నుండి అవతరించితివి. ఏమి నీ లోక రక్షణా విలాసము!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో వామనావతారమును వర్ణించుచున్నారు.

**దౌత్య ఔదార్య ఇంద్ర యాచ్ఞావిహతిమ్ అపనయస్ వామనః అర్థీ త్వామ్ అసీః**
**విక్రాంతే పాదపద్మే త్రిజగత్ అణుసమమ్ పాంసులీకృత్య లీల్యే**
**నాభీపద్మశ్చ మానక్షమమివ భువనగ్రామమ్ అన్యమ్ సిసృక్షుః**
**తస్థౌ రంగేంద్ర! వృత్తే తవ జయముఖరః డిండిమః తత్ర వేదః** **67**

**రంగేంద్ర= ఓ రంగనాథా! వామనః త్వం= వామనుడవుగా నీవు, దైత్యౌదార్య= బలిచక్రవర్తియొక్క ఔదార్యముయొక్కయు, ఇంద్రయాచ్నా= ఇంద్రుని యాచనముయొక్కయు, విహతిం= వ్యాఘాతమును, అపనయస్= తొలగించుచు, అర్థీ అసీః= యాచకుడవైనావు. త్రిజగత్= మూడులోకములను, అణుసమం= అణుప్రాయముగా, పాంసులీకృత్య= ధూళిగాచేసి, విక్రాన్తే= చాచిన, పాదపద్మే= పాదపద్మములయందు, లిల్యే= లీనము చేసితివి. నాభీపద్మశ్చ= నాభీపద్మముకూడ, మానక్షమం= కొలవదగిన, భువనగ్రామం= లోకసమూహము, అన్యం= మరియొకదానిని, సిసృక్షురివ= సృష్టింతువా అనునట్లు, తస్థౌ= యుండెను. తవ వృత్తే = నీయొక్క త్రివిక్రమాపదానమందు, వేదః= వేదము, తత్ర= అచ్చట, జయముఖరః= జయజయధ్వానమును చేయు, డిండిమః= డిండిమమను వాద్యవిశేషము.**

హే రంగనాథా! వామనావతారము ధరించి నీవు బలిచక్రవర్తి ఔదార్యమునకు,ఇంద్రుని యాచనమునకు ఒకేసారి సమాధానము నిచ్చుటకు నీవే యాచకుడవైతివి. త్రిభువనములను అణుప్రాయముగా నీ విక్రాంతిత పాదపద్మలయందు విలీనము చేసితివి. నీ నాభీపద్మము ఆ సమయమున కొంగ్రొత్త భువన సముదాయములను సృష్టించునా అన్నట్లుండెను. ఆ త్రివిక్రమావతార సమయమున చతుర్ముఖాదులు చేయుచున్న వేద పఠనములే జయజయ ధ్వానములు వలె యున్నవి కదా!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరశు రామావతారమును ఈ శ్లోకములో వర్ణించుచున్నారు.

**భవాన్ రామో భూత్వా పరశుపరికర్మా భృగుకులాత్**
**అలావీత్ భూపాలన్ పితృగణమ్ అతార్ప్సీత్ తగసృజా**
**భువో భారాక్రాంతమ్ లఘుతలమ్ ఉపాచీక్లపత్ ఇతి**
**ద్విషామ్ ఉగ్రమ్ పశ్యః అపి అనఘ! మమ మాజీగణత్ అఘమ్ 68**

**హే అనఘ= ఓ దోషరహితుడా!, భవాన్= నీవు, భృగుకులాత్= భృగువంశమునుండి, పరశుపరికర్మా= గండ్రగొడ్డలిని ఆభరణముగాగల, రామో భూత్వా= పరశురాముడవై, భూపాలాన్= రాజులను, అలావీత్= ఛేదించితివి. తదసృజా= ఆ రక్తముచే, పితృగణం= పితృదేవతలను, అతార్ప్సీత్= తృప్తిపరచితివి ( తర్పణము చేసితివి), భారాక్రాన్తం= దుర్మార్గులైన క్షత్రియయోధులచే భరింపరాని భారముగల, భువతలం= భూమిని, లఘు= తేలిక, ఉపాచీక్లపత్= పరచితివి. ఇతి= ఇట్లు, ద్విషాం= శత్రువులకు, ఉగ్రం పశ్యోపి= ఉగ్రునిగా చూడబడినను, మమ అఘం= నా పాపమును, మాజీగణత్= లెక్కించలేదు**

ఓ అనఘ! నీవు భృగు కులమున పరశురామునిగా జన్మించి క్షత్రియ గణములను సంహరించి, వారి రుధిరముతో నీ పితృగణములకు తర్పణమొనరించితివి. తద్వారా దుష్ట క్షత్రియుల వలన కలుగు భూభారమును తొలగించితివి. అరిభయంకరుడవైనను నీవు నా దురితములను గణించక క్షమించి చేరదీసికొంటివి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి రామావతారమును స్తుతిస్తున్నారు ఈ శ్లోకములో.

**మనుజ సమయమ్ కృత్వా నాథావతేరిథ పద్మయా**
**క్వచన విపినే సా చేదంతర్ధినర్మమే**
**కిమథ జలధిమ్ బధ్వా రక్షః విధీశవరయోః ఉద్ధృతమ్**
**బలిముఖ కులోచ్ఛిష్టమ్ కుర్వన్ రిపుమ్ నిరపత్రయః 69**

**హే నాథ= హే రంగనాథా!, మనుజసమయం కృత్వా= మనుష్యుడను అను ప్రతిజ్ఞను చేసి, పద్మయా= లక్ష్మితోకూడ, అవతేరిథ= అవతరించితివి. క్వచనవిపినే= ఒకానొక వనమందు, సా అన్తర్ధినర్మ= ఆ లక్ష్మి అంతర్ధానమగుట అను లీలను, వినిర్మమే చేత్= చేసినచో అపుడు, అథ= అంతలో, జలధిం బధ్వా= సముద్రముపై సేతువును కట్టి, విధీశవరయోః= బ్రహ్మరుద్రుల వరములచే, ఉద్ధతం రిపుం= గర్వించిన శత్రువగు, రక్షః= రాక్షసుని, బలిముఖకులస్య= కాకుల సమూహమునకు, ఉచ్ఛిష్టం కుర్వస్= భుక్తశేషముగా చేయుచు, కిం నిరపత్రయః= నిరవయవముగా చేసితివి గదా!**

హే రంగనాథా! నీవు మనుష్య జన్మము ధరించి'ఆత్మానమ్ మానుషమ్ మన్యే' అని మనుష్యుని గానే రామావతారమున చరించితివి. లక్ష్మీదేవి నీతో సీతమ్మ గా అవతరించి అరణ్యమున కనుమఱుగయిన లీలా కారణముగా అతిమానుష కృత్యమైన సాగరసేతు నిర్మాణ కార్యమునొనర్చితివి. బ్రహ్మ, రుద్ర దత్త వర గర్వితుడైన రావణుని సంహరించి లోక కల్యాణమును గావించితివి గదా!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకము నందు బలరామావతార వర్ణనము చేయుచున్నారు.

**యత్ ద్యూతే విజయాపదాన గణనా కాళింగ దంతాంకురైః**
**యత్ విశ్లేషలవః అపి కాళియభువే కోలాహలాయ అభవత్**
**దూత్యేన అపి చ యస్య గోపవనితాః కృష్ణాగసామ్ వ్యస్మరస్**
**తం త్వామ్ క్షేమ కృషీవలమ్ హలధరమ్ రంగేశ! భక్తాస్మహే** 70

**హే రంగేశ!= ఓ రంగనాథా!, యద్ద్యూతే= ఏ జూదమునందు, కాళిఙ్గస్య= కళింగరాజుయొక్క, దన్తాఙ్కురైః= ఊడగొట్టబడిన దంతములతో, విజయాపదానగణనా= విజయములను లెక్కించుట, యస్య= ఎవరియొక్క, విశ్లేషలవోపి= వియోగలేశముకూడ, కాళియభువే= కాళీయునివలన కలిగిన, కోలాహలాయ= కోలాహలమునకు కారణము, అభవత్= అయ్యెనో, యస్య దూత్యేన= ఎవని దౌత్యముచే, గోపవనితాః= గోపికలు, కృష్ణాగసాం= కృష్ణుని అపరాధములను, వ్యస్మరస్= మరచిరో, తం క్షేమకృషీవలం= వారందరి క్షేమముకొఱకు కృషిజేయు, హలధరం= నాగలిని పట్టిన బలరాముడను, త్వాం= నిన్ను, భక్తాస్మహే= సేవింతుము.**

ఓ రంగనాథా! నీవు బలరామావతారమున కళింగరాజు తో ద్యూతక్రీడ యందు నీ విజయములకు పందెముగా కళింగుని దంతాంకురములను స్వీకరించితివి. కృష్ణుని ఎల్లప్పుడు కను ఱెప్ప వలె కాపాడుచుంటివి. ఒక్క క్షణము నీవు తోడు లేని సమయమున కాళియ సర్పము కృష్ణుని సంహరింప జూచినది కదా! గోప వనితలు కృష్ణుని పై కోపగించి నపుడు నీవు కృష్ణుని వంక దౌత్యము జరిపి కృష్ణునిపై వారి కోపమును మరపింప చేసితివి. సర్వక్షేమ కృషీవలుడవై హలమును ధరించి మాకందరకు సత్ఫలితములనీయ నీవు బలరామ రూపమును ధరించితివి. మేమెల్లరము నిన్ను సదా సేవించుచుందుము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములోను, తరువాతి శ్లోకములలోను కృష్ణావతార వర్ణనము చేయుచున్నారు.

**ఆకంఠ వారిభర మందర మేఘదేశ్యమ్**
**పీతాంబరమ్ కమలలోచన పంచహేతి**
**బ్రహ్మ స్తనంధయమ్ అయాచత దేవకీ త్వామ్**
**శ్రీరంగకాంత! సుతకామ్యతి కాపరైవమ్ 71**

**హే శ్రీరంగకాంత= ఓ రంగనాథా!, దేవకీ= దేవకీదేవి, ఆకంఠం= కుత్తుకవరకును, వారిభరః మన్దరః= నీటిని ధరించినదియు మెల్లగ పోవునదియునగు, మేఘదేశ్యం= మేఘమువలె, పీతాంబరం= పీతాంబరమును ధరించినట్టివాడును, కమలలోచన= పద్మములవంటి నేత్రములుగలవాడును, పఞ్చహేతి= పంచాయుధములను గలవాడును, బ్రహ్మ= పరబ్రహ్మమును అగు నిన్ను, స్తనంధయం= పాలుత్రాగు పుత్రునిగా, అయాచత= ప్రార్థించెను. అపరా కా=  మరియొకతె ఎవరు, ఏవం= ఈవిధముగా, సుతకామ్యతి= పుత్రుని కోరగలదు?**

శ్రీ కృష్ణుని తలచిన వెంటనే అట్టి పరమాత్మకు కన్న తల్లి అయిన దేవకీ దేవి అదృష్టము జ్ఞప్తికి వచ్చి ఆ ఘట్టము కీర్తించుచున్నారు. దేవకీదేవి మూడు జన్మములలో మూడు సార్లు పృశ్ని గా, అదితి గా దేవకీదేవిగా పరమాత్మకు తల్లి అయిన అదృష్టము పొందినది. ఏమి ఆ తల్లి మహద్భాగ్యము.
మనము ఇట్టి స్థితి విశ్వామిత్రాది మహర్షుల యందు విష్ణుచిత్తాది ఆళ్వార్ల యందు కూడ చూడనగును.(కౌసల్యా సుప్రజా రామ...।అను శ్లోకము స్మరణీయము)
హే శ్రీరంగనాథ! ఆ దేవకీదేవి గొంతువరకు నీరు త్రావి మెల మెల్లగా కదలు నల్లని మేఘమును బోలు వర్ణము గలిగి పీతాంబరమును ధరించి
కమలాయత లోచనుడై, పంచాయుధ ధరుడైన పరమాత్మను పుత్రునిగా కావలెనని కోరినది. ఎవరిట్టి కోరిక కోరగలరు.(సామాన్యులందరము మనకు ఆయురారోగ్య భాగ్యాల కొరకే కదా పరమాత్మను తలచునది).
పరమాత్మకు స్తన్యమీయగల అవకాశము పొందిన ఆమె ధన్యురాలు కదా!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి కృష్ణావతార వర్ణనము ఈ శ్లోకములో కూడ

**శైలః అగ్నిశ్చ జలామ్ బభూవ మునయః మూఢామ్ బభూవుః జడాః**
**ప్రాజ్ఞామాసురగాః సగోపమ్ అమృతామాసుః మహాశివిషాః**
**గోవ్యాఘ్రాః సహజామ్ బభూవుః అపరే తు అన్యామ్ బభూవుః ప్రభో!**
**త్వమ్ తేషు అన్యతమామ్ బభూవిత భవత్ వేణు క్వణా ఉన్మాథనే 72**

**హే ప్రభో!= ఓ స్వామీ, భవతః వేణుక్వణేన= మీ మురళీగానముచే ( చేతనాచేతనాత్మకమైన జగత్తునంతను), ఉన్మాదనే= ఉన్మత్తులనుగా చేయగా, శైలోగ్నిశ్చ= కొండలును అగ్నియు, జలామ్బభూవ= తమతమ కాఠిన్యమును**

**ఉష్ణతను వదలి ద్రవీభూతము లైనవి. జడాః అగాః= జ్ఞానములేని వృక్షములు, సగోపం= గోపికలతోబాటుగా, ప్రాజ్ఞామాసుః= జ్ఞానవంతములైనవి. మహాశీవిషాః= మహావిషమునుగలవికూడ, అమృతామాసుః= అమృతాత్మకములైనవి. గోవ్యాఘ్రాశ్చ= గోవులును, పులులును, సహజాం బభూవుః= జాతివైరమును వదలి కలసి యున్నవి. అపరే తు= ఇతరులు, అన్యాంబభూవుః= తమతమ స్వభావవైషమ్యములను వదలి నీ వేణుగానమును అనుభవించువారైనారు. త్వం= సర్వజ్ఞుడవైన నీవును, తేషు= ఆ చరాచరములయందు, అన్యతమాం బభూవిథ= కార్యాన్తరపరిజ్ఞానహీనుడవు స్వాన్తడవును అయినావు.**

హే ప్రభూ! నీ వేణు నాదము చేతనాచేతనాత్మకమైన జగత్తునంతను ఉన్మత్తము చేయగా, పర్వతములు తమ కాఠిన్యమును, అగ్ని తన ఉష్ణతను కోలుపోయి ద్రవీభూతములైనవి. జ్ఞానము లేని వృక్షములు గోపికలతో పాటు జ్ఞానవంతములైనవి. తీవ్రమగు విషము గల జంతు జాలములు అమృతాత్మకములైనవి. గోవ్యాఘ్రములు తమ సహజ వైరమును మరచి కలసి మెలసి యున్నవి. ఇతరములన్నియు తమను తాము మరచి వేణుగానమును అనుభవించుచున్నవి. సర్వజ్ఞుడవైన నీవును ఆ చరాచరకార్యాంతర పరిజ్ఞాన హీనుడవు, స్వాంతుడవు నైతివి.

Dasarathi: చరాచర కార్యాంతర పరిజ్ఞాన హీనుడవు, స్వాంతుడవు..ఈ రెండిటి అర్ధం, ఇంకొంచెం వివరం గా చెప్తారా?

Ramam Mamayya: అనగా ఆ బృందావన చరాచరముల సామాన్య జ్ఞానము తప్ప మఱి వేరొక్క జ్ఞానము లేక సాధారణ మనుష్యుని వలె ప్రవర్తించిన స్వామి సౌలభ్యము. పరమాత్మ కృష్ణునకు జ్ఞానము ఆ గోవులకు ఎప్పుడు కుడితి పెట్టవలెనో, ఎప్పుడు గడ్డి కోయవలెనో అంతవరకు మాత్రమే పరిమిత మయినట్లున్నదనుట. సమస్త జగన్నియామకుడు సాధారణమనుష్యుని వలె సంచరించిన సౌలభ్యము వర్ణించబడినది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో కల్కి అవతారమును ఆవిష్కరిస్తున్నారు.

**కల్కి తనుః ధరణీమ్ లఘుయిష్యన్**
**కలికలుషాన్ విలునాసి పురాత్వమ్**
**రంగనికేత! లునీహి లునీహి ఇతి**
**అఖిలమ్ అరుంతుదమ్ అద్య లునీహి** 73

**హే రఙ్గనికేత= ఓ శ్రీరంగనివాసా!, కల్కితనుః త్వం= కల్కివిగ్రహములోనున్న నీవు, ధరణీం= దుష్టులవలన కలిగిన భూమిభారమును, లఘుయిష్యన్= తేలికపరచుచు, కలికలుషాన్= కలికాలమందలి పాపిష్ఠులను, పురావిలునాసి= ఛేదింతువు. అద్య అఖిలం అరున్తుదం= ఇపుడు సాధుజనులను బాధించువారి గుంపులనన్నింటిని, లునీహి లునీహి ఇతి= పోగొట్టుము పోగొట్టుము అనుచు, లునీహి= పోగొట్టెదవు.**

హే రంగనికేతన! నీవు కల్కి అవతారము దాల్చి సాధు జనులను బాధించు దుష్టులను కలి యుగాంతమున సంహరించెదవు. ఆ దుష్టులను దునుమాడు కార్యము సత్వరము ఒనర్చుము.
(కల్కి అవతారము భవిష్యదవతారము. భగవానుడు కలియుగాంతమున పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయ దుష్కృతామ్......అనినట్లు శంబళ నామ గ్రామమున బ్రాహ్మణ కుటుంబమునందు విష్ణు యశో నామమున నవతరించి దుష్ట సంహారము చేయును. ధర్మ పునరుద్ధరణము గావించును.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి విభవావతార వర్ణనము తరువాత భగవానుని పర, వ్యూహ, విభవ, అర్చ్యాఅంతర్యామి రూపములయందు అర్చ్యా రూప విశేషములను అనుగ్రహించుచున్నారు.

**ఆస్తామ్ తే గుణరాశివత్ గుణ పరివాహ ఆత్మానమ్ జన్మనామ్**
**సంఖ్యా భౌమ నికేతనేషు అపి కుటీ కుంజేషు రంగేశ్వర!**
**అర్చ్యః సర్వసహిష్ణుః అర్చక పరాధీన అఖిల ఆత్మ స్థితిః**
**ప్రీణీషే హృదయాలుభిః తవ తతః శీలాత్ జడీభూతయే** 74

**హే రఙ్గేశ్వర= ఓ రంగనాథా!, తే గుణరాశివత్= నీ గుణముల రాశివలె, గుణపరీవాహాత్మనాం= దయ వాత్సల్యము మొదలగు గుణముల ప్రవాహములగు, జన్మనాం= అవతారములయొక్క, సంఖ్యా= సంఖ్య, ఆస్తామ్= ఉండుగాక. భౌమనికేతనేషు= భూమిపైనున్న ఆలయములయందును, కుటీకుఞ్జేషు= మునుల కుటీరములయందును, అర్చ్యః= శాస్త్రప్రకారము అర్చింపబడువాడు, సర్వసహిష్ణుః= సర్వాపచారములను క్షమించు గుణముగలవాడును, అర్చకపరాధీనః= అర్చకునికి పరాధీనుడుగా నున్నవాడును, అఖిలాత్మస్థితిః సస్= సమస్తమునకును స్థితిని కల్పించువాడవును అగుచు, ప్రీణీషే= సంతసించుచున్నావు. తతః= అట్టి శీలముచే, హృదయాళుభిః= సహృదయులను, జడీభూయతే= జడులుగా చేయుచున్నావు.**

హే రంగేశ్వర! అనంత కళ్యాణ గుణ రాశివైన నీ యందు కరుణా వాత్సల్యాది గుణములు అనేకములు అసంఖ్యములైన నీ అవతారములలో ప్రకాశించు చుండు గాక(పైన పేర్కొన్న దశావతారములే గాక పరమాత్మ అవతారములు అసంఖ్యాకములు. ఒక్కొక్క అవతారములో కొన్ని కొన్ని గుణములు దృశ్యమానమై ప్రకాశించుచుండును.). అవి అన్నియు అట్లుండనిమ్ము. కాని ఈ నేలపై వివిధ ఆలయములయందు సత్పురుషుల కుటీరములయందు, అర్చింపబడుచు, ఈ మనుజులొనర్చు సమస్తాపచారములను సహించుచు, అర్చక పరాధీన సకల వ్యాపారములు కలవాడవై సౌశీల్యగుణాతిశయమున శిలాది రూపముల సామాన్యులొనర్చు అలంకార, అభిషేకాది ఉపచారములను స్వీకరించి సంతసించు చున్నావు. నీ యీ ఎల్లలు లేని సౌశీల్యగుణము హృదయమున్న నెవ్వరినైను స్థాణువులను చేయకమానదు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములో అర్చ్యారూపములయందు తనకత్యంత ప్రీతి పాత్రమైన శ్రీరంగనాథుని కీర్తిస్తున్నారు.

**శ్రీమత్ వ్యోమ నసీమ వాక్ మనసయోః సర్వే అవతారాః క్వచిత్**
**కాలే విశ్వజనీనమ్ ఏతత్ ఇతి ధీః శ్రీరంగ ధామాన్యథ**
**ఆర్త స్వాగతికైః కృపా కలుషితైః ఆలోకితైః ఆద్రయస్**
**విశ్వ త్రాణ విమర్శన స్ఖలితలయా నిద్రాసి జాగర్యయా** 75

**హే రఙ్గేశ్వర!= ఓ రంగనాథా!, శ్రీమత్= భూతపంచకములమధ్య పరిగణింపబడిన వ్యోమమందలి విలక్షణమైన లక్ష్మినిగల, వ్యోమ= పరమాకాశమనబడు వైకుంఠము, వాఙ్మనసయోః= వాక్కునకుగాని మనసునకుగాని, నసీమ= అందనిది. అనగా వాటికి విషయము కానిది. సర్వే అవతారాః= అన్ని అవతారములును, క్వచిత్కాలే= ఒకానొకప్పుడు, ఏతత్= వెనుక చెప్పబడిన, విశ్వజనీనం= సమస్త చేతనములకును హితమైనదానిని, ఇతిధీః= అని జ్ఞానముగలవాడివై, అథ= తరువాత, శ్రీరఙ్గధామ= శ్రీరంగమందున్న, ఆర్తస్వాగతికైః= ఆర్తులకు స్వాగతమును చెప్పుచున్న, కృపాకలుషితైః= నిర్హేతుకనిరవధికకారుణ్యముచే చేతనుల గుణదోషములను లెక్కింపని, ఆలోకితైః= కటాక్షములచే, ఆర్ద్రయస్= చల్లబరచుచు, విశ్వత్రాణవిమర్శనేన= జగద్రక్షణగురించి ఆలోచించుటచే కలిగిన, స్ఖలితయా= తొట్రుబాటుచే మరలమరల చెప్పబడుట యను, జాగర్యయా= జాగరూకతచే, నిద్రాసి= నిద్రాముద్రలో నున్నావు.**

హే రంగనాథా! నీవు లక్ష్మీ సహితుడవై వాక్కునకు గాని మనసునకు గాని అందని వైకుంఠము నందు వేంచేసి యుందువు. అది మాకు అందుబాటు కాదు. (ఇచట కారణ, కార్య వైకుంఠములను రెంటినీ పరిగణించ వచ్చును). ఇక రామ, కృష్ణాద్యవతారములు ముందు చెప్పినట్లు ముందెప్పుడో గడచి పోయినవి. అవి కూడ మాకు అలభ్యములు. అందుచే సమస్త చేతనుల హితము కొఱకై నీవు మా గుణ, దోషములు లెక్కింపక నిర్హేతుక నిరవధిక కారుణ్యముతో నిద్రా ముద్రాభిరాముడవై జగద్రక్షణాకార్య బద్ధుడవై దయార్ద్ర కటాక్షములతో ఎపుడెపుడు అవసరము పడునా యను కలగుండుగలిగి (పంటను కాచు కొనుటకు మంచెపై పండుకొను కృషీవలుని వలె) శ్రీరంగమునందు సంతత జాగరూకుడవై వేంచేసి యున్నావు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకములోను తరువాతి శ్లోకములలోను శ్రీ రంగ వివరణము కొనసాగిస్తున్నారు.

**సర్గాభ్యస్య విశాలయా నిజధియా జానస్ అనంతేశయమ్**
**భారత్యా సహధర్మ చార రతయా స్వాధీన సంకీర్తనః**
**కల్పానేవ బహూన్ కమండలు గలత్ గంగాప్లుతః అపూజయత్**
**బ్రహ్మా త్వామ్ ముఖలోచన అంజలిపుటైః పద్మైః ఇవ ఆవర్జితైః** 76

**కమణ్డలుగళత్= కమండలమునుండి ప్రవహించుచున్న, గఙ్గాప్లుతః= గంగయందు స్నానము చేసి, సర్గాభ్యాసేన= సృష్టిని అభ్యసించుటచే, విశాలయా= విస్తృతమైన, నిజధియా= తన బుద్ధిచే, జానస్= తెలుసుకొనుచు, సహధర్మచారే రతయా= ధర్మానుష్ఠానమందు అనువర్తించుటయందు ప్రీతిగల, భారత్యా= సరస్వతిచే స్వాధీనమైన స్తుతులచే, సంకీర్తనః బ్రహ్మా= స్తుతించుచున్న బ్రహ్మ, బహూస్= అనేక కల్పములలో (నిత్యమును), ఆవర్జితైః అమ్బుజైః= సమర్పింపబడిన తామరపూవులవలెనున్న, ముఖలోచనాఞ్జలిపుటైః= ముఖలోచనములచే ఘటించబడిన అంజలులచే, అనన్తేశయం త్వాం= శేషశాయిపైన నిన్ను, అపూజయత్= పూజించెను.**

శ్రీరంగనాథుడు చతుర్ముఖ బ్రహ్మకు ఆరాధనా రూపమైన అర్చ్యా మూర్తి. చతుర్ముఖ బ్రహ్మ నుండి తదుపరి ఇక్ష్వాకు మహారాజునకు ఆ మూర్తి సంక్రమించగా ఇక్ష్వాకువంశ చక్రవర్తుల యందు శ్రీరామ చంద్రుని నుండి విభీషణ మహారాజు (లబ్ధ్వా కులధనమ్ రాజా ..।।విభీషణః...రామాయణము, యు.కాం.) పొందెను. ఆ విభీషణుడు లంకానగరము పయనించు మధ్య మార్గమున శ్రీరంగమున, ఉభయ కావేరీ మధ్య దేశమున శ్రీరంగవిమానమును మన భాగ్య వశమున వేంచేపు చేసెను. ఆ వృత్తాంతము ఇచట స్మరణీయము.

చతుర్ముఖ బ్రహ్మ కమండలము నుండి స్రవించు గంగ యందు స్నానము గావించి( భగవానుని త్రివిక్రమావతార సమయమున స్వామి పాదము సత్య లోకమును సమీపించినపుడు చతుర్ముఖ బ్రహ్మ స్వామి పాదమును తన కమండల తీర్థముతో కడుగగా ఆ తీర్థమే గంగయైనది. తదుపరి భగీరథుని కోర్కె మేరకు ఆ గంగ సగర పుత్రుల పునీతుల చేయ భూమిపై ప్రవహించినది. ఆ పరమాత్మ శ్రీపాద తీర్థమును శిరసున ధరించిన రుద్రుడు చరితార్థుడయ్యెను. ఈ విషయము ఇచ్చట స్మరణీయము. అంతియ గాక శ్రీరంగ క్షేత్రమున కిరువైపుల ప్రవహంచు కావేరీ నది అగస్త్య మహర్షి కమండల బహిర్గతము. అందుచే చతుర్ముఖుడు సత్య లోకమున గాని, శ్రీరంగ క్షేత్రమున గాని కమండల బహిర్గత తీర్థ స్నానానంతరమే స్వామికి ఆరాధనాదులు సలుపునని భావము) తాను సృష్టి కార్యము నిర్వహించుటకు స్వామిచే కరుణించ బడిన, తన సహధర్మ చారిణి అయిన సరస్వతీ మాత వలన స్వాధీనమయిన పురుషసూక్తాది అసంఖ్యాకములైన శ్రుతులతో స్తుతించుచూ అనేక కల్పముల యందు నిత్యమును పద్మములను బోలు తన ముఖలోచనములతో, కరపుటాంజలులతో (చతుర్ముఖుని ముఖములు, నేత్రములు, కరములు పద్మములను బోలి యున్నవనుట) శేషశాయి వయిన ఆ చతుర్ముఖుడు నిన్ను పూజించి యుండెను.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకము నందు కూడ శ్రీరంగ నాథుని చరిత్ర ఆవిష్కరించుచున్నారు.

**మనుకుల మహీపాల వ్యానమ్ర మౌళి పరంపరా**
**మణిమకరికారోచిః నీరాజిత అంఘ్రి సరోరుహః**
**స్వయమ్ అథ విభో! స్వేన శ్రీరంగధామని మైథిలీ**
**రమణవపుషా స్వ అర్హాణి ఆరాధనాని అసి లంభితః**

**హే విభో!= ఓ రంగనాథా!, మనుకులమహీపాలానాం= మనువుయొక్క వంశములోనున్న రాజులయొక్క, వ్యానమ్రమౌళిపరంపరాసు= నమస్కరించుచున్న రాజులకిరీటముల వరుసలచే, మణిమకరికారోచిః= రత్నమయమైన మకరికాశోభల వెలుగులచే, నీరాజితే= హారతులు పొందుచున్న, అంఘ్రిసరోరుహః= పాదపద్మములు గలవాడా, అథ= తరువాత స్వయం= స్వయముగ, మైథిలీరమణవపుషా= శ్రీరామునిగ, స్వేన= తనంతతానుగా, శ్రీరంగధామని, స్వార్హాణి= తనకు తగినవిధముగానున్న, ఆరాధనాని= ఆరాధనములను, లమ్భితోసి= పొందితివి.**

హే శ్రీరంగనాథ! చతుర్ముఖ బ్రహ్మ తన అర్చ్యామూర్తి అయిన శ్రీరంగనాథుని మను వంశ క్షత్రియులకొసగెను. వారు మిక్కిలి భక్తి, గౌరవములతో ఆ శ్రీరంగనాథుని కైంకర్యము సలుపు చుండిరి. వారి శిరఃకిరీట మణిమకరికా దీప్తులు నీ శ్రీపాద పద్మములకు నీరాజనము అర్పించుచున్నట్లు లుండెను. ఆ ఇక్ష్వాకు వంశ రత్న దీపమన దగిన జానకీ వల్లభుడు శ్రీరామ చంద్రుడు నీకు ఉచిత రీతిని శ్రీరంగవిమానము నందు కైంకర్యమొనర్చుట, స్వామీ! నీకు నీవే ఆరాధనమొనర్చుకొను చున్నట్లు ముచ్చట గొలుపు చుండెను గదా!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి శ్రీరంగధామ ప్రస్తావనము ఈ శ్లోకములో కూడా

**మను అన్వవాయే ద్రుహిణే చ ధన్యే**
**విభీషణేన ఏవ పురస్కృతేన**
**గుణైః దరిద్రాణామ్ ఇవమ్ జనమ్ త్వమ్**
**మధ్యే సరిత్ నాథ! సుఖాకరోషి** **78**

**హే నాథ!= ఓ స్వామీ!, త్వం= నీవు, ధన్యే= చరితార్థుడగు, ద్రుహిణే= పితామహునియొక్క, మన్వన్వవాయే= మనువువంశమందు జన్మించుటచే, పురస్కృతేన= మాన్యుడవై, విభీషణేనైవ= విభీషణునిచే, సరిన్మధ్యే= కావేరిమధ్యను, గుణైః= ఆత్మగుణములచే, దరిద్రాణం= దరిద్రుడైన, ఇమం జనం= నావంటి అకించనుని, సుఖాకరోషి= ఆనందింపజేయుచున్నావు.**

హే రంగనాథ! నీకు చేసిన కైంకర్యము వలన చరితార్థుడైన చతుర్ముఖుని, తదనంతరము నిన్ను గౌరవించిన మను వంశజులను విడచి ఆత్మగుణదరిద్రుల మైన నావంటి అకించనులను ఆనందింపజేయ విభీషణునిచే ఈ ఉభయ కావేరీ మధ్య దేశమునందు ప్రతిష్ఠింపబడి వేంచేసి యుంటివి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఉపనిషత్ ప్రతిపాద్యుడై సూర్య మండలాంతర్వర్తి అయిన శ్రీమన్నారాయణమూర్తియే రంగనాథుడుగా కట్టెదుట సాక్షాత్కరించి యున్నట్లు అనుగ్రహించుచునారు.

**తేజఃపరమ్ తత్సవితుర్వరేణ్యమ్**
**ధామ్నా పరేణాప్రణఖాత్ సువర్ణమ్**
**త్వామ్ పుండరీక ఈక్షణమ్ ఆమనంతి**
**శ్రీరంగనాథమ్ తమ్ ఉపాసిషీయ** 79

**పరం= సర్వోత్కృష్టమైన, వరేణ్యం= వరణీయుడైన( ఉపాసింపదగిన), తత్ సవితుః= ప్రసిద్ధమైన సూర్యమండలమధ్యవర్తియైన, తేజః= తేజోమూర్తియని, ఆమనన్తి= చెప్పుదురు. తం పరేణ= అతడిని ఉత్కృష్టమైన, ధామ్నా= తేజస్సుచే, ఆప్రణఖాత్= శిఖనుండి నఖములవరకు, సువర్ణం= స్వర్ణమయమైన, పుణ్డరీకేక్షణం= పుండరీకములవంటి నేత్రములు గలవాడని, ఆమనన్తి= చెప్పుదురు. అట్టి, శ్రీరంగనాథం త్వాం= సర్వసులభుడైన శ్రీరంగనాథుడవగు నిన్ను, ఉపాసిషీయ= ఉపాసించుచున్నాను.**

వేద, వేదాంతములును, గాయత్రి మున్నగు మహా మంత్రములును, అంతరాదిత్య విద్యాది బ్రహ్మ విద్యలును పరమాత్మ శ్రీమాన్నారాయణుని పుండరీకాక్షుడనియు, సర్వోత్కృష్ట తేజస్సుచే శిఖి నఖ పర్యంతము సువర్ణ సదృశమై సూర్యమండలాంతర్వర్తియై ఉపాసనీయుడై యుండునని వర్ణించును.(కప్యాసమ్ పుండరీకమేవమ్ అక్షిణీ, తత్సవితుర్వరేణియమ్ భర్గో దేవస్య ధీమహి, య ఆదిత్యే తిష్ఠన్ ఆదిత్య అంతరో యమయతి .....యస్య ఆదిత్యః శరీరమ్, య ఏషః అంతరాదిత్యే హిరణ్మయః పురుషః ఇత్యాది). అట్టి ప్రాకృత చక్షువులకు కానగ రాని దుస్సాధ్యమైన పరమపురుషుడు సర్వ సులభుడై మన ముందు శ్రీరంగమున వేంచేసి సేవ సాయించుచున్నాడు. అట్టి నిన్ను శ్రీరంగనాథ! నేను ఉపాసించుచున్నాను.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి నిండు నూతేళ్ళూ శ్రీరంగనాథుని సహవాసము ఆకాంక్షిస్తున్నారు ఈ శ్లోకంలో.

**ఆత్మా అస్య గంతుః పరితస్థుషశ్చ**
**మిత్రస్య చక్షుః వరుణస్య చ అగ్నేః**
**లక్ష్మ్యా సహ ఔత్పత్తిక గాఢబంధమ్**
**పశ్యేమ రంగే! శరదశ్శతమ్ త్వామ్** 80

**అస్య= ఈ కనబడుచున్న, గన్తుః పరితస్థుషః= జంగమములకును స్థావరములకును, ఆత్మా భవసి= ఆత్మవు అగుచున్నావు. మిత్రస్య= సూర్యునికిని, వరుణస్య చాగ్నేః= వరుణునకును అగ్నికిని, చక్షుః భవసి= కన్నువు అగుచున్నావు. లక్ష్మ్యా సహ= లక్ష్మీదేవితోకూడ, ఔత్పత్తికగాఢబన్ధం= స్వాభావికమైన దృఢసంబంధముగల, త్వాం రజ్గే= నిన్ను రంగస్థలమున, శరదశ్శతం= నూరు సంవత్సరములు, పశ్యేమ= చూచెదము.**

హే శ్రీరంగనాథ! నీవు చేతనాచేతనములకన్నింటికి అంతరాత్మగా యుందువు.(అనేన జీవేన ఆత్మనా అను ప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి). వేదములు నిన్ను అగ్నీ, సూర్య, వరుణాదులకు చక్షువుగా కీర్తించును. (పర, వ్యూహ,

విభవ, అర్చ్యా రూపముల పిదప స్వామి అంతర్యామి తత్త్వమును ప్రకాశింప జేయుచున్నారు). లక్ష్మీదేవి తో సదా స్వాభావిక సహవాస సంబంధము లతో శ్రీరంగమునందు వేంచేసి నిండు నూటేళ్ళను మాకు సేవ కృప చేయ వలెను.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈశ్లోకమునందు తన అనన్య శరణత్వమును, శ్రీరంగనాథుని ఉపేయ పరత్వమును అనుగ్రహించుచున్నారు.

**యస్య అస్మి పత్యుః న తమ్ అంతరేమి**
**శ్రీరంగతుంగ ఆయతనే శయానమ్**
**స్వభావ దాస్యేన చ యః అహమ్ అస్మి**
**స సన్ యజే జ్ఞానమయైః మఖైః తమ్** **81**

**యస్య పత్యుః= ఏ స్వామికి, అస్మి= దాసుడను అయియున్నానో, శ్రీరంగతుంగాయతనే= శ్రీరంగమే అనెడి సర్వాధికమైన దేవాలయమున, శయానం= శయనించియున్న ఆ స్వామిని( తప్ప), నాన్తరేమి= అన్యదేవతలను నేను భజించను. అహం= నేను, స్వభావదాస్యేన చ= సహజముగా దాసుడనైనందున కూడ, యోస్మి= ఎవరినగుచున్నానో, స సన్= అట్టి దాసునిగా నుండుచు, తం జ్ఞానమయైర్మఖైః= జ్ఞానయజ్ఞముచేతను ఇతర యాగముల చేతను, యజే= పూజింతును.**

నేను (భట్టర్ స్వామి) శ్రీరంగవిమానము నందు శయనమూర్తిగా సేవననుగ్రహించుచున్న శ్రీరంగనాథునకు సహజముగా దాసుడను. ఆ స్వామిని తప్ప ఇతరులనెవ్వరిని భజించను(ఆశ్రయించను). ఆయనకే దాసుడనై జ్ఞాన యజ్ఞము చేతను, ఇతర యాగాది కైంకర్యముల చేతను పూజించెదను( దాసభూతాః స్వతః సర్వే హ్యాత్మానః పరమాత్మనః నాన్యథా లక్షణమ్ తేషామ్ బంధే మోక్షే తథైవచ, జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే, భగవంతమ్ నారాయణమ్ ధ్యానయోగేన దృష్ట్వా భగవతో నిత్యస్వామ్యమాత్మనః నిత్య దాస్యమ్ చ యథావస్థితమనుసంధాయ.....శ్రీమత్పాదారవిందయుగళమ్ శిరసికృతమ్ ...సుఖమాసీత, మున్నగు వాక్యములు ఇచట స్మర్యములు).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి శ్రీరంగనాథుని శరణాగతి చేయు చున్నారు ఈ శ్లోకములో.

**ఆయుః ప్రజానామ్ అమృతమ్ సురాణామ్**
**రంగేశ్వరమ్ త్వామ్ శరణమ్ ప్రపద్యే**
**మామ్ బ్రహ్మణే అస్మై మహసే తదర్థమ్**
**ప్రత్యంచమేనమ్ యునజై పరస్మై** **82**

**ప్రజానాం= ప్రజలయొక్క, ఆయుః= ఆయుర్దాయమైనట్టి, సురాణాం= దేవతలయొక్క అమృతమ్= అమృతమునైనట్టి, రంగేశ్వరం= శ్రీరంగనాథుడవగు, త్వాం శరణం ప్రపద్యే= నిన్ను శరణు పొందుచున్నాను. పరస్మై బ్రహ్మణే= పరబ్రహ్మమును, మహసే అస్మై= తేజోమూర్తియునగు ఈ రంగనాథునికొఱకు, తదర్థం= వాని శేషమునగునట్టియు, ప్రత్యఞ్చం= ప్రత్యగాత్మయునగు, ఏనం మాం= ఈ నన్ను, యునజ్మి= కూర్చునియున్నాను, యోజించుచున్నాను.**

భట్టర్ స్వామి శరణాగతి అవసరమైన తన ఆకించన్యత్వము, అనన్య గతిత్వము ముందు శ్లోకముల యందు విన్నవించి లక్ష్మీ సమేతుడును సర్వేశ్వరుడునునైన శ్రీరంగనాథ అర్చ్యా మూర్తి స్వరూపముకడ శరణాగతి విన్నవించుచున్నారు. (శరణాగతి విన్న వించుటకు మనకు మార్గము చూపుచున్నారు).

రంగేశ్వర! నీవు నీ బిడ్డలమైన మాకెల్లరకు జీవనాధారము. అమృతమ్ దేవానామ్ ఆయుః ప్రజానామ్ ఇంద్రమ్ రాజానమ్ సవితారమేతమ్.... ) నిత్య సూరులకు( సురులకు) అమృతము వలె భోగ్య భూతము. (అనగా బద్ధులకు సిద్ధోపాయము, ముక్తులకును, నిత్యులకును నిరంతర భోగ్యము. (యత్ర పూర్వేసాధ్యాః సంతి దేవాః) అట్టి తేజోమూర్తివై, పరబ్రహ్మమునైన నీవు మాకు శ్రీరంగనాథుడవై ఇచట వెలసి యున్నావు. (నారాయణ పరబ్రహ్మ తత్త్వమ్ నారాయణః పరః నారాయణ పరో జ్యోతిః ఆత్మా నారాయణః పరః). ప్రత్యగాత్మ నైన (ఈ అనిత్యము, అచైతన్యము, ప్రాకృతికమును అయిన దేహము కాని) నేను సర్వకాల సర్వావస్థల యందు నీ శేషభూతుడను. (కావున) నిన్ను శరణుపొందుచున్నాను( ఆ రుచి మాధుర్యము తెలిసిన నేను విడువ లేననుటకై వర్తమాన క్రియ). మనో, వాక్కాయముల నిన్నే తలంచుచు నీ యందలి బుద్ధితో సదా ప్రవర్తించు చున్నాను. (ఓమిత్యాత్మానమ్ యుంజీత)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి భగవద్గీత యందు భగవానుడు తన ఆశ్రయుల నందరను ఉదారులుగా భావించి వారిలో పేరు పేరు వర్గములను పేర్కొనిన విధము స్మరించుచున్నారు.

**ఆర్తిమ్ తితీర్షుః అథ రంగపతే! ధనాయన్**
**ఆత్మంభరిః వివిదుషుః నిజదాస్య కామ్యన్**
**జ్ఞానీతి అమూన్ సమమథాః సమమ్ అత్యుదారాన్**
**గీతాసు దేవ! భవత్ ఆశ్రయణ ఉపకారాన్** 83

**దేవ రంగపతే= దేవా రంగనాథా!, ఆర్తిం తితీర్షుః= ఐశ్వర్యమును పోగొట్టుకొనుటచే కలిగిన దుఃఖమును పోగొట్టుకొనదలచినవాడును, అథ ధనాయన్= తనకు ఇంతవరకును లేని ధనమును పొందవలెనను కోరిక గలవాడును, ఆత్మంభరిః= తన ఆత్మను అనుభవించవలెనని కోరువాడును, వివిదిషుః= ప్రకృతినుండి విడిపోయిన ఆత్మస్వరూపజిజ్ఞాసువును, నిజదాస్యకామ్యన్= స్వాభావికమగు నీ దాస్యమును కోరునట్టి, జ్ఞానీతి= బ్రహ్మజ్ఞాని యనియు చెప్పబడు, అమూన్ అత్యుదారాన్= ఈ మిక్కిలి ఉదారులైన, భవదాశ్రయణోపకారాన్= మిమ్ములను ఆశ్రయించుటయే ఉపకారముగా గలవారిని, సమం గీతాసు= గీతలయందు సమముగా, సమమథాః= తలంచితివి.**

హే దేవా! రంగనాథా! నీవు భగవద్గీత యందు నీ భక్తులను నాల్గు రకములుగా విభజించి వారందరును కూడ ఉదారులేనని ప్రవచించితివి. వారు

1. ఆర్తులు : తమకున్న ఐశ్వర్యమును పోగొట్టు కొనుటవలన కలిగిన దుఃఖమును ఆ ఐశ్వర్య పునఃప్రాప్తి వలన పోగొట్టు కొన నాశ్రయించినవారు
2. అర్థార్థులు: తనకు మునుపు లేని ఐశ్వర్యము పొందుటకు ఆశ్రయించినవారు
3. జిజ్ఞాసువులు: ప్రకృతి దుఃఖములనుండి విడివడి ఆత్మానందమును అనుభవించు కోర్కెతో ఆశ్రయించినవారు
4. జ్ఞానులు: తమ నిజ స్వరూపమైన శేషత్వము నెఱిగి నీ వద్ద నిత్య కైంకర్యము చేయ నాశ్రయించినవారు.

(భగవద్గీత శ్లో 7:16 చతుర్విధా భజంతే మామ్ జనాః సుకృతినోర్జున ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ...ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీత్వాత్మైవ మే మతమ్)
తుచ్ఛకామ్యములకై ఆశ్రయించిన వారిని , పరిమితమైన ఆత్మానందమును మాత్రము అభిలషించువారిని, నీపై సహజమగు భక్తితో ఆశ్రయించిన వారిని సమానముగా ఉదారులని కీర్తించుట నీకే (పరమాత్మకే) తగును గదా!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు శ్లోకమున ప్రపత్తి ప్రకారము తెలిపి ఈ శ్లోకమున పిదప కర్మ చేయు విధము (భగవానుడు భగవద్గీత యందు నొక్కి వక్కాణించిన తెఱగున) తెలుపు చున్నారు.

**నిత్యమ్ కామ్యమ్ పరమ్ అపి కతిచిత్**
**త్వయి అధ్యాత్మ స్వమతిభిః అమమాః**
**న్యస్య అసంగా విదధతి విహితమ్**
**శ్రీరంగేంద్రో! విదధతి న చ తే** **84**

**హే శ్రీరంగేన్ద్రో= ఓ శ్రీరంగనాథా!, అమమాః= మమకారములేని, అసఙ్గాః= ఫలసంగములేని, కతిచిత్= కొందరు, అధ్యాత్మస్వమతిభిః= ఆత్మవిషయమై తమ బుద్ధులచే, నిత్యం కామ్యం పరమపి= నిత్యకర్మను కామ్యకర్మను నైమిత్తికకర్మను, త్వయి న్యస్య= నీయందుంచి, విహితం= విహితకర్మను, విదధతి= చేయుచున్నారు. తే= వారు, న విదధతి చ= తమకు కర్తృత్వము లేనందున వారు చేయుట లేదుగదా!**

హే శ్రీరంగనాథ! కొందరు మమకారము, ఫలసంగము లేక తమ తమ నిత్య, నైమిత్తిక, కామ్య కర్మలను స్వాతంత్ర్య బుద్ధి లేక భగవత్పరముగా భగవత్కైంకర్యార్థమై చేయుదురు. వారికి ఆ కర్మలయందు కర్తృత్వ బుద్ధి లేకుండుట వలన ఆ కర్మ ఫలము వారికంటదు.
ఈ విషయము భగవానుడు భగవద్గీతయందు పలు మారులు విశదముగా వివరించెను( శ్లో. మయి సర్వాణి కర్మణి...., త్యక్త్వా కర్మ ఫలాసంగమ్..., విర్మమో నిరాశీ...., నిరాశీ యతచిత్తాత్మా..., కర్మణ్యేవాధికారస్తే....,

కార్యమిత్యేవ యత్కర్మ నియతమ్ క్రియతే అర్జున సంగమ్ త్యక్త్వా ఫలమ్ చైవ....,ఇత్యాది శ్లోకములు స్మర్యములు. ఇందులకే మన వారు స్వ శేషభూతేన మయా స్వీయైః సర్వ పరిచ్ఛదైః విధాతుమ్ ప్రీతమ్ ఆత్మానమ్ దేవః ప్రక్రమతే స్వయమ్ అని న్యాస భావనముతో కర్తృత్వ భావన లేక భగవత్కైంకర్యముగానే కర్మలను తప్పక నిర్వహించెదరు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకమునందు ఆత్మ ప్రకృతి కంటె భిన్నమైనదనియు, ఆత్మోజ్జీవనమునకు కైవల్యము, మోక్షము అను ఱెండు తెఱగులు కలవనియు, తత్ప్రాప్తికి సాధనను ప్రకృతిభిన్నమైన ఆ తత్త్వమును నిస్సంశయమైన బుద్ధితో ధ్యానమనియు వివరించుచున్నారు.

**ప్రత్యంచమ్ స్వమ్ పంచవింశమ్ పరాచః**
**సంచక్షాణాః తత్త్వరాశేః వివిచ్య**
**యుంజానాః చ ఋతంభరాయామ్ స్వబుద్ధౌ**
**స్వమ్ వా త్వామ్ వా రంగనాథ! ఆప్నువంతి** **85**

**హే రంగనాథ! = ఓ రంగనాథా!, ప్రత్యంచం= తనను అహమని భావించు ( ప్రత్యక్ స్వరూపముగల), స్వం= తనను, పరాచ= ఇది అని చెప్పుటచే, తత్త్వరాశేః= ప్రకృతి, మహత్తు, అహంకారము, పంచతన్మాత్రలు, పంచభూతములు, కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, మనస్సు లని చెప్పబడు 24 తత్త్వములరాశినుండి, పంచవింశం వివిచ్య= ఇరువదియైదవదానినిగా వేరుచేసి ( అచిత్తుకన్న విలక్షణమైనదిగా తెలుసుకొని), ఋతంభరా స్వబుద్ధౌ= సంశయవిపర్యయములు లేని తన బుద్ధియందు, యుఞ్జానాః= ధ్యానము చేయుచు, స్వం వా= తననుగాని, త్వాం వా= పరమాత్మవగు నిన్నుగాని, ఆప్నువన్తి= పొందుచున్నారు.**

మన సిద్ధాంతమున తత్త్వములు మూడు. ప్రకృతి, జీవుడు, పరమాత్మ. మూల ప్రకృతి, మహత్తు, అహంకారము, మనస్సు, పంచ తన్మాత్రలు, పంచ భూతములు, కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు అని చెప్పబడు 24 తత్త్వములను ప్రకృతి అని అందురు. 25 వ తత్త్వము ఆత్మ. ఇది ప్రకృతి కి భిన్నమైనది. మూడవది పరమాత్మ. హే రంగనాథ! ఈ ప్రకృతి (దేహము) కంటె విలక్షణమైన ఆత్మను తన స్వస్వరూపముగా నెఱిగి, నిస్సంశయబుద్ధి యందు సంతతము ఆత్మధ్యానము చేయుచు ఈ సంసారమునుండి విడుదలై పొందు స్థితిని కైవల్యమని అందురు. స్వస్వరూపమునెఱిగి పరమాత్మనే సతతము ధ్యానించుచు ప్రకృతి నుండి మోచనము పొందు స్థితి మోక్షము. (ఈ ఱెండు స్థితుల ఆనందానుభవమునకు కాల పరిమితి అనంతమైనను, కైవల్య స్థితి యందు సంసార మోచనము కలిగి ఆత్మానుభవము పొందుఆ జీవుని ఆనందానుభవము పరిమితము. సాక్షాన్మోక్ష దశయందు పరమాత్మానుభవము పొందు ఆజీవుని ఆనందానుభవము అపరిమితము).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భగవానుని యందు భక్తతత్పరుల లక్షణములు వర్ణించుచున్నారు ఈ శ్లోకములో.

**అథ మృదిత కషాయాః కేచిత్ ఆజాన దాస్య**
**త్వరిత శిథిల చిత్తాః కీర్తి చింతానమస్యాః**
**విదధతి నను పారమ్ భక్తినిగ్నా లభంతే**
**త్వయి కిల తతమే త్వమ్ తేషు రంగేంద్ర! కిమ్ తత్** **86**

**హే రంగేంద్ర= ఓ రంగనాథా!, మృదితకషాయః= కర్మయోగాభ్యాసముచే రాగాదికాలుష్యములను తొలగింపజేసుకొనిన, ఆజానదాస్యే= స్వాభావికమైన భగవద్దాస్యమునందు, త్వరితం= త్వర గలవారై, శిథిలచిత్తాః= విషయాన్తరములను పొందలేక శిథిలములైన మనసులు గలవారు, కేచిత్= కొందరు, కీర్తిచిన్తానమస్యాః= కీర్తనధ్యాననమస్కారములను, విదధతి= చేయుచున్నారు. భక్తినిఘ్నాః = భక్తియందు మగ్నులైనవారు, పారం లభన్తే= పరమప్రాప్యభూతమైన మిమ్ములను పొందుచున్నారు. తతమే త్వయి కిల= వారు నీకు పరతంత్ర స్వరూపస్థితిప్రవృత్తులు గలవారుకదా!, తేషు = ఆ భక్తులయందు నీవును వారికి తగినవిధముగా వర్తించుచున్నావు, తత్ కిమ్= మీయొక్క భక్తజనాయత్తమైన స్వరూపాదులు ఆశ్చర్యజనకములు.**

కొందరు భక్తి పరతంత్రులు వారి కర్మ యోగాభ్యాసముచే వారి వారి సమస్త కర్మలను భగవత్కైంకర్యపరముగా నిస్సంగముగా నిర్వర్తించుచూ ప్రాకృతిక విషయములయందు రాగ ద్వేష రహితులై స్వాభావికమైన భగవచ్ఛేషత్వ భావనతో భగవద్దాస్యమునందు త్వర కలిగి, తదితరములను సహించక, భగవద్విరహమును భరించలేని శిథిల మనస్కులై నిరంతరము భగవద్ధ్యాన, కీర్తనా, కైంకర్యాదులను చేయుచూ భక్తి నిమగ్నులై పరమాత్మను పొందుచున్నారు. హేరంగేంద్ర! నీవును ఆ భక్తుల విషయమున అదే విధముగ సముచిత రీతి ప్రవర్తించుచున్నావు.(సతతమ్ కీర్తయంతః మామ్ యతంతశ్చ దృఢవ్రతాః నమస్యంతశ్చ మామ్ భక్త్యా నిత్య యుక్తాః ఉపాసతే, భక్త్యా త్వనన్యయా శక్యః అహమేవమ్ విధః అర్జున, ప్రియోహి జ్ఞానినః అత్యర్థమ్ అహమ్ స చ మమప్రియః, జ్ఞానీ తు ఆత్మైవ మే మతమ్ ఇత్యాది భగవద్గీతా వాక్యములు ఇచట స్మర్యములు). నీ భక్తుల యందు అత్యంత ప్రీతి, వాత్సల్య పూరితమైన నీ ప్రవర్తన ఆశ్చర్యమును కలిగించును కదా!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మ తో తనసంబంధము ఆయన గుణముల వలన గాక ఆయన స్వరూపము వలన సహజమైనది, నిర్హేతుకమైనది అని ఈ శ్లోకమునందు వివరించుచున్నారు.

**ఉపాదత్తే సత్త్వస్థితి నియమన ఆద్యైః చిత్ అచిత్తౌ**
**స్వమ్ ఉద్దిశ్య శ్రీమాన్ ఇతి వదతి వాక్ ఔపనిషదీ**
**ఉపాయ ఉపేయత్వ తత్ ఇహ తవ తత్త్వమ్ న తు గుణౌ**
**అథః త్వామ్ శ్రీరంగేశయ! శరణమ్ అవ్యాజమ్ అభజమ్** **87**

**శ్రీమాన్= శ్రియఃపతియగు పురుషోత్తముడు, చిదచితౌ= చేతనాచేతనపదార్థముల, సత్తాస్థితినియమనాద్యైః= సృష్టి, సంరక్షణము, నియమనము మొదలగు సమస్తవ్యాపారములచే, స్వముద్దిశ్య ఉపాదత్తే ఇతి= స్వశేషతచే**

**స్వీకరించుననని, ఔపనిషదీ= ఉపనిషత్తులకు సంబంధించిన, వాక్= వాక్యము, వదతి= ప్రతిపాదించుచున్నది. తత్= ఆ కారణముచే, హే శ్రీరంగేశయ ఇహ=ఓ శ్రీరంగనాథా! ఇచ్చట, ఉపాయోపేయత్వే తవ= ఉపాయత్వము ఉపేయత్వమును నీయొక్క, తత్త్వమ్= స్వరూపము. న తు గుణౌ= జ్ఞానశక్త్యాదులవలె నిరూపితస్వరూపవిశేషణ ధర్మములు కావు. అతః= ఉపాయత్వోపేయత్వములే మీ స్వభావములగుటచే, త్వాం అవ్యాజం= నిన్ను ఇతరవ్యాజములు లేని, శరణం అభజమ్= ఉపాయముగను, ఉపేయముగను స్వీకరించితిని.**

పరమాత్మ జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, తేజో శక్త్యాది ధర్మముల స్వరూపుడు, గుణకుడు కూడ. (అద్వైతులు స్వరూపము మాత్రమే అని అందురు. తార్కికులు గుణములు మాత్రమే అని పరిగణించెదరు. మన సిద్ధాంతమునందు ఈ ధర్మములు ద్రవ్యములుగను, గుణములుగను కూడ పరిగణించెదరు, దీప దృష్టాంతమున. ఇందు జ్ఞానాది ధర్మములు నిరూపిత స్వరూప ధర్మములని అందురు. కాని చిదచిత్కారణత్వ, లక్ష్మీ పతిత్వ, అంతర్యామిత్వాది లక్షణములను స్వరూప నిరూపక ధర్మములని అంటారు. అంటే లక్ష్మీపతి ఎవరైతే ఆయనే పరమాత్మ. చిదచిత్తులకు సృష్టి, స్థితి, లయ, నియమన, రక్షణాదులకు కారణుడెవడో ఆయనయే పరమాత్మ. ఆయన నిరూపిత స్వరూప గుణములు జ్ఞానాదులు. ఈ విషయాన్ని శ్రుతులు, ఉపనిషత్తులు విశదముగా వివరించినవి. ఉదా కు హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ (లక్ష్మీ పతిత్వము), జన్మాద్యస్య యతః, యతో వా ఇమాని భూతాని జాయంతే, యేన జాతాని జీవంతి( జగత్కారణత్వము), అంతః ప్రవిష్టః శాస్తా జనానామ్, అనేన జీవేన ఆత్మనా అను ప్రవిశ్య నామ రూపే వ్యాకరవాణి(అంతర్యామిత్వము), ఉత్తమః పురుషః అన్యః పరమాత్మేతి ఉదాహృతః,(పురుషోత్తమత్వము), సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ, తేజో బలైశ్వర్య మహావబోధ సువీర్య శక్త్యాది గుణైకరాశిః(జ్ఞానాది నిరూపిత స్వరూప ధర్మముల స్వరూపుడు, గుణకుడు). ఈ విధముగా పరమాత్మ సమస్త చిదచిత్తులకు ఉపాయము అనగా మోక్ష ప్రదాన సాధనము, ఉపేయము అనగా తద్గమ్యము కూడా అయి ఉంటాడు. హే శ్రీరంగనాథ! నేను నిన్ను శరణము పొందుటకు కారణము ఆ మోక్ష ఉపాయము, ఉపేయము నీ స్వరూపమగుట వలన. నీ అనంత కళ్యాణ గుణాకరుడవగుటచే నీనుండి ఏమయినను పొందుటకై ఆశించి నిన్ను ఆశ్రయించి శరణము పొందుటలేదు. నిన్ను శరణు పొందుట నిర్హేతుకము, నిర్వ్యాజము. నాకు శేషత్వము సహజమైనది. నీ స్వామిత్వము, ఉపాయ, ఉపేయత్వములు సహజమైనవి. కనుక నిన్నాశ్రయించుట ఒక ఫలమునాశ్రయించి కాదు.

అనగా ఉదాహరణకు ఒక భార్య భర్తను ప్రేమించుట, భర్త స్వామిత్వము స్వీకరించుట ఆయన ధనవంతుడనియో, ఆయన సౌందర్యవంతుడనియో కాదు. ఆయన వలన ఆభరణాదులో విశేషార్థతలో కలుగునని కారాదు.(అనగా ఆయన గుణ విశేషములను బట్టి, ఆయన నుండి కలుగు లబ్ధుల వలన కాని కారాదు).భార్య భర్తను ప్రేమించుట నిర్హేతుకమై భర్తృ గుణ విశేషములపై నాధారపడక సహజమై యుండవలెను. మన అదృష్టమేమన మన స్వామి సమస్త కళ్యాణ గుణాకరుడు, అఖిల హేయ ప్రత్యనీకుడు. కాని ఆయన వద్ద మన ఆశ్రయణము నిర్హేతుకము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు శ్లోకమునందు ఉపాయోపేయములు రెండును సమస్త జీవ రాశికి పరమాత్మయేనని నిర్వచించి ఆ విషయము వివరించుచున్నారు ఈ శ్లోకములో.

**పటునా ఏకవరాటిక ఇవ క్లుప్త స్థలయోః కాకణికా సువర్ణ కోట్యోః**
**భవ మోక్షణయోః త్వయా ఏవ జంతుః**
**క్రియతే రంగనిధే! త్వమ్ ఏవ పాహి** 88

**హే రఙ్గనిధే! = ఓ రంగనిధీ!, పటునా= సమర్థుడైన పురుషునిచే, కాకణికా= తక్కువవిలువగల బంగారము, సువర్ణం= అధికమైన విలువగల బంగారము, కోటిః= కోట్లవిలువగల సువర్ణము అని వివిధములుగా, స్థలయోః= స్థాన పటిమలు, క్లుప్తా= కల్పింపబడిన, ఏకవరాటికేవ= ఒక గవ్వవలె, పటునా త్వయైవ= సర్వశక్తిమంతుడవైన నీచేతనే,. జన్తుః= ఆత్మలయొక్క, భవమోక్షణయోః=సంసారమోక్షముల, స్థలయోః= స్థానములు, క్రియతే= కల్పింపబడుచున్నవి. కావున, త్వమేవ= సిద్ధోపాయభూతుడవైన నీవే ( ఈ సంసారమునుండి), పాహి= రక్షింపుము.**

ప్రపన్నునకు కర్మ, జ్ఞాన, భక్తి, ప్రపత్తులేమియును మోక్షోపాయములు కావు. కేవలము పరమాత్మయే ఉపాయము, ఆయనయే ఉపేయము అనగా తద్గమ్యము, ఫలము కూడ. ఆయా కర్మ, జ్ఞానాదులు మోక్షోపాయమునకు అంగములును, భగవత్కైంకర్య మార్గములును మాత్రమే. ఒక సమర్థుడగు రాజు తన రాజ్యము నందు ఒక చిల్లు గవ్వను ఒక రోజు అత్యంత సామాన్యమైన ఒక పైసగా నిర్ధారించవచ్చును. అదేరాజు మరునాడు అదే చిల్లు గవ్వను కోట్ల విలువైన బంగరు నాణెముగా నిర్ణయించ వచ్చును. ఆయన నిర్ణయమును ప్రశ్నింప సమర్థులెవ్వరుందురు. అటులనే పరమాత్మ తనకు దయ కలిగిన ఒక సామాన్య జీవునికి మోక్ష సామ్రాజ్యార్హత కలిగించవచ్చును. భగవానుడు సర్వ సమర్థుడు. ఆయనే సమస్త జీవులకు భవ మోక్షముల నిర్ణయాధినేత. అందుచే ఓ రంగనాథా! నేను సిద్ధోపాయుడవైన నిన్నే ఈ సంసార విముక్తికై శరణుపొందెదను. నన్ను రక్షింపుము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ముందు శ్లోకములలో శరణాగతి చేసి, ప్రపన్నునకు అత్యంత ఆవశ్యకమైన ఆకించిన్యత్వము ఈ శ్లోకములో ప్రకటించుచున్నారు.

**జ్ఞాన క్రియా భజన సంపద కించనోహమ్**
**ఇచ్ఛాధికార శకన అనుశయ అనభిజ్ఞః**
**రంగేశ! పూర్ణవృజినః శరణమ్ భవేతి**
**మౌర్ఖ్యాత్ బ్రవీమి మనసా విషయ ఆకులేన** 89

**హే రంగేశ= ఓ రంగనాథా!, అహం= నేను, జ్ఞానక్రియాభజనాని= జ్ఞానయోగ కర్మయోగ భక్తియోగములు అను, సంపత్తయా= సంపదచే, అకిఞ్చనః= దరిద్రుడను. ఇచ్ఛాధికారశకన= మోక్షమును పొందవలెనను అధ్యవసాయము,**

**అనుశయః= అనుతాపము, అనభిజ్ఞః= అను పైవాటిని తెలియనివాడను. కాని, పూర్ణవృజినః= నిండుగా దుష్కృతములను చేసినవాడను. మౌర్ఖ్యాత్= మూర్ఖతచే, విషయాకులేన మనసా= విషయవాంఛలచే కలతచెందిన మనసుగలవాడనై, శరణం భవ ఇతి= నాకు శరణమగుము అని, బ్రవీమి= చెప్పుచున్నాను.**

హే రంగనాథ! నేను కర్మ, జ్ఞాన, భక్తి యోగములెఱుగను. మోక్షమను నది ఒకటి పొందవలెనను అను తాపము, ఇచ్ఛ కూడ లేనివాడను. సకల దుష్కృతములను చేసిన వాడను. మూర్ఖుడనై విషయ లాలసత్వమింకను వీడక మానసమంతయు నిండియుండగ కేవలము నోటితో శరణమని పలుకుచున్నాను.
నమ్మాళ్వారులు 'నీశసేన్ నిఱైవొన్నుమిలేన్' అనియు, యామునార్యులు ' న ధర్మ నిష్టోస్మి నచాత్మవేదీ....', 'అమర్యాదః క్షుద్రః ...' అనియు భగవద్రామానుజులు 'మనో వాక్కాయైః అనాది కాల ప్రవృత్త ......అశేషతః క్షమస్వ' అనియు తమ తమ ఆకించన్యత్వము ప్రకటించిన విధముగా ఇచట పరాశర భట్టర్ స్వామి కూడ (మనకు ఆకించన్యత్వ ప్రకటనము నేర్పుచూ ) స్వామికి సమర్పించుకొనుచున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకము నందు కూడ నైచ్యానుసంధానమును చేయుచూ తాను వంచకుడనని సంబోధించు కొనుచూ పండిత, పామరులనెల్లరను తాను వంచించు చున్నట్లు తెలుపు చున్నారు.

**త్వయి సతి పురుషార్థే మత్పరే చ అహమ్ ఆత్మా**
**క్షయకర కుహనార్థాన్ శ్రద్ధధత్ రంగచంద్ర**
**జనమ్ అఖిలమ్ అహంయుర్వంచయామి త్వత్ ఆత్మ**
**ప్రతిమభవదనన్యజ్ఞానివత్ దేశికః సన్ 90**

**హే రంగచంద్ర= ఓ రంగచంద్రా!, త్వయి= నీయందే, పురుషార్థే= ఉపాయోపేయములును, మత్పరే చ= నాకు పొందదగినవాడును ఉండెననియు చెప్పుచు, ఆత్మక్షయకరాః= స్వరూపమునకు హానిచేయునట్టి, కుహనార్థాన్= పురుషార్థములు అన్నట్లుగా వంచించు శబ్దస్పర్శాది విషయములను, శ్రద్ధధత్= విశ్వసించుచు, అహంయుః= అహంకారముతోనున్నవాడినగుచు, త్వదాత్మప్రతిమః= నీ ఆత్మవంటివానివలె, భవదనన్యః= నీకు ఇష్టమైన జ్ఞానివలె, దేశికస్సన్= ఆచార్యుడనగుచు, అఖిలం జనం= పామరులతోబాటు పండితులతోబాటు అందరినికూడ, వంచయామి= వంచించుచున్నాను.**

హే రంగచంద్ర! నాకు ఉపాయ, ఉపేయములును, చతుర్విధ పురుషార్థములును నీవే అని స్పష్టము చేయుటకు శ్రీరంగమున వేంచేసి యున్నావు. అయినను, స్వస్వరూప జ్ఞానము మరచి, ఆత్మ వినాశక క్షుద్ర విషయాభిలాష గలిగి, దేహాత్మ భేదమును విస్మరించి, నీకు శేషభూతుడనని తలవక (అనన్యాః చింతయంతో మామ్ యే జనాః పర్యుపాసతే తేషామ్ నిత్యాభియుక్తానామ్ యోగక్షేమమ్ వహామ్యహమ్) అహంకారముతో ప్రవర్తించుచున్నాను. నీకాత్మ సముడగు జ్ఞాని వలె(జ్ఞానీతు ఆత్మైవ మే మతః)

ఉత్తమ ఆచార్యుని ననుకొనుచు పండిత, పామరులను వంచించుచున్నాను. ఈ శ్లోకము పరాశర భట్టర్ స్వామి నైచ్యానుసంధాన పరాకాష్ఠ యని చెప్పవచ్చును.

ఈ శ్లోకంలోని భావాన్నే తిరుమాలై ప్రబంధంలో 39వ పాశురంలో ఉళ్ళువారుళ్ళత్తెల్లాముడనిరున్దఱుదియెన్దు అని అంటారు. ఈ పాశురఖండానికి అర్థం - తలంపును ప్రకటించటానికి వాక్కే మార్గం కావటంవలన అనుసంధించుకొనేవారు అనుసంధించిన దానినంతటినీ చేస్తూ ఉండటం చాలా అరుదైనది అలాగ నేను మనసులో నున్నదానిని చెప్పకుండా నేనే అంతా అనేటట్లుగా వ్యవహరిస్తున్నాను అని అన్నట్లుగా నమ్మాళ్వారు తన "కైయార్ చక్కరమ్" అనే పాశురంలో సర్వజ్ఞుడవైన నిన్నుకూడా మోసపుచ్చుతూండే వంచకస్వభావుడిని అంటారు.= = = = = = = = = = = = = = = = = = = = = == = = = = = = = = = = = == = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకమునందు మనమందరము సామాన్యముగా చేయు అపరాధములను తెలిపి మనచే పరమాత్మ ఎదుట నైచ్యానుసంధానము చేయించుచున్నారు. (భట్టర్ స్వామి నేను అని పలికినట్లు మనము శ్లోకము పఠించినపుడు తెలియకున్నను అవ్విధముగా పలికినచో మనము కూడ నైచ్యానుసంధానము చేసిన వారమగుదుము కదా!).

**అతిక్రామస్ ఆజ్ఞామ్ తవ విధి నిషేధేషు భవతే అపి**

**అభిద్రుహ్యస్ వాక్ ధీకృతిభిః అపి భక్తాయ సతతమ్**

**అజానస్ జానస్ వా భవత్ అసహనీయాగసి రతః**

**సహిష్ణుత్వాత్ రంగప్రవణ! తవ మాభూవమ్ అభరః** 91

**హే రంగప్రవణ= శ్రీరంగముపై ప్రీతి మిక్కుటముగా గలవాడా!, వాగ్ధీకృతిభిః= మనోవాక్కాయములచే, జానస్ అజానస్ వా= తెలసియో తెలవకనో, విధినిషేధేషు= చేయవలసినవాటిని చేయుట, చేయకూడనివాటిని మానివేయుట అను, తవ ఆజ్ఞాం అతిక్రామస్= నీ కట్టుబాట్లను అతిక్రమించుచు, భవతేభక్తాయాపి= నీకును నీ భక్తునికిని, అభిద్రుహ్యస్= ద్రోహము చేయుచు, భవదసహనీయాగసి= నీవు సహించుటకుకూడ తగని అపచారమును చేయుటయందు, రతః అహం= ఆసక్తుడనగు నేను, తవ సహిష్ణుత్వాత్= నీయందలి అపరాధములను క్షమించుగుణముచే, అభరః= భారముకానివాడను, మాభూవమ్= కాకపోను. అనగా నీకు భారమైనవాడినే అని అర్థము.**

భగవానుడు మనమేమి చేయవలెనో, ఏమి చేయరాదో శ్రుతులయందు అనుగ్రహించెను. వీటినే విధి(సత్యమ్ వద, ధర్మమ్ చర. వంటి చేయవలసినవి) వాక్యములనియు, నిషేధ వాక్యములనియు(న సురామ్ పిబేత్, న కలంజమ్ భక్ష్యేత్. వంటి చేయకూడనివి) అంటారు. వీటినే భగవదాజ్ఞలుగా మనమెల్లరము పాటించవలెను. మనకీ విషయములు తెలియక పోయిన సదాశ్రయణముచే తెలిసికొన వలెను. భగవంతునికి మనము చేయు అపచారముల కన్న భగవద్భక్తులయందు మనము అపచారములు చేసిన అవి భగవానునికి ఇంకను దుస్సహములు. మనము మన ఆచార్యాదుల యెడల చేయు అపచారములు అసహ్యాపచారములు. వీటిని ఒక్క కరణముతోనే గాక త్రికరణములతో పరిపూర్ణముగా మనము చేయుచుందుము.వీటినే శరణాగతి గద్య యందు

భగవద్రామానుజులు అనంత అకృత్య కరణ, కృత్య అకరణ, భగవదపచార, భాగవదాపచార, అసహ్యాపచార.... అని వర్ణించి క్షమస్వ అని మనచే శరణాగతి చేయించెదరు. పరమాత్మ పరమ దయామయుడు. అందుచే మనము చేయు అపచారముల నెల్ల క్షమించుటకు సమస్త మార్గములను వెదకు చుండును. మరల మరల మనము దిద్దుకొనుటకు అవకాశము కల్పించుకొను చుండును. కాని మనమా అవకాశములు దుర్వినియోగము చేసికొనుచు క్రొంగ్రొత్త దోషములను కూడ సంతతము చేయు నభిలాషతో కాలము గడుపుచుందుము.

హే రంగరమణ! మనో వాక్కాయములచే

తెలిసియో, తెలియకనో నీఆజ్ఞాదేశములైన విధి, నిషేధములను అతిక్రమించుచు నీకును, నీభక్తులకును ద్రోహము చేయుచు నుండు మా సకలాపరాధములను క్షమింపగల నీ ఓరిమి ఎల్లలు కూడ అతిక్రమించు అసహ్యాపచారములను చేయుటయందు సంతతము ఆసక్తుడనై ఉండు నేను నీ గొప్ప క్షమాగుణమునకు కూడ భారమగుదును కదా!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మ కల్పవృక్షముల వంటి తన భుజముల ఛాయ యందు మనలను చేరదీసికొని మనకు ఇష్ట సిద్ధిని, అనిష్ట నిరసనమును చేయ నుండగా మనమెట్లు విషపూరిత భుజగ సదృశములైన విషయముల అనురక్తిని కల్గి యున్న ప్రకారమును తెలుపుచున్నారు.

**ప్రకుపిత భుజగఫణానామ్ ఇవ విషయాణామ్ అహమ్ ఛాయామ్**

**సతి తవ భుజసువిటపి ప్రచ్ఛాయే**

**రంగజీవిత! భజామి** **92**

**హే రఙ్గజీవిత= ఓ శ్రీరంగప్రాణమా!, తవ భుజ ఏవ= నీయొక్క భుజమే, సురవిటపి= (నాకు) కల్పవృక్షము. తస్య ప్రచ్ఛాయే సతి= దాని గొప్ప నీడలో ఉంటూ ఉన్నను, ప్రకుపిత భుజగ= కోపముగానున్న పాముయొక్క, ఫణానామివ= పడగలవలె నున్న, విషయాణాం ఛాయాం = శబ్దాదివిషయములయందు రక్తిని, అహం భజామి= నేను పొందియున్నాను.**

భగవానుడు ఆశ్రితులకు, సంసార దుఃఖార్తులకు కల్పవృక్షము వంటివాడు(వాసుదేవ తరుచ్ఛాయా నశీతా నాపి ఘర్మదా, నివాస వృక్షః సాధూనామ్, బాహుచ్ఛాయామ్ అవష్టబ్ధః యస్య లోకః మహాత్మనః ఇత్యాదులు ప్రమాణములు). ఆయన సురతరువుల బోలు తన భుజముల నీడ యందు నాకు రక్షణ కల్పింప జూచును. కాని నేను మాత్రము ఆయన ఆశ్రయణము విడచి మిక్కిలి కోపముతో బుసలు కొట్టుచున్న పాము పడగల వంటి విషయాదులయందు అను రక్తి పొందియుంటిని.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి భగవానును అశేష విశేష కృపకు గూడ మనమమతీతముగా ప్రవర్తించెదమని తెలుపుచున్నారు.

**త్వత్ సర్వశక్తేః అధికా అస్మదాదేః**
**కీటస్య శక్తిః బత రంగబంధో!**
**యత్ త్వత్ కృపమ్ అపి అతి కోశకార**
**న్యాయాత్ అసౌ నశ్యతి జీవనాశమ్** 93

**హే రఙ్గబన్ధో!= ఓరంగబంధూ!, అస్మదాదేః= నావంటి, కీటస్య శక్తిః= పురుగుయొక్క శక్తి, సర్వశక్తేః త్వత్= సర్వశక్తిమంతుడవైన నీ శక్తికంటే, అధికా బత= అధికమైనదే అయ్యో!, యదసౌ= ఎందుచేతననగా వీడు, కోశకారన్యాయాత్= కోశకారమను ఒక క్రిమివిశేషము( పట్టుపురుగువంటిది) తనతోటినుండివచ్చు దారముతో తనకు నివాసముగా నొక కాయను నిర్మించుకొని దానిద్వారమునుకూడ ఆ ద్వారముతోటే నిర్మించుటచే, దానిలోనుండి బయటకు రాలేక అందులోనే చనిపోవును. అటులనే, త్వత్కృపామపి= నీ దయనుగూడ, అతి= అతిక్రమించి, జీవనాశం నశ్యతి= బ్రతికియుండగనే కలిగిన నాశముచే నశించుచున్నాడు.**

భగవానుని కృప అపారమైనది, మహా శక్తివంతమైనది. అది మనలెనెటులైనను, కాపాడవలెనని చూచుచుండును. కాని హే రంగబంధో! నేను గూడుపురుగు (గూడు కట్టుకొను సాలె/ పట్టు పురుగుల వంటి పురుగు) తాను గూడు కట్టుకొని ఆ గూటిలోనుండి బయట పడలేక (ఏవమ్ సంస్కృతి చక్రస్థే భ్రామ్యమాణే స్వకర్మభిః జీవే దుఃఖాకులే విష్ణోః కృపా కాపి ఉపజాయతే) మరణించిన విధమున ఈ సంసార బంధముల నల్లుకొని దానినుండి విడివడ జాలక ఇందే నశించుచూ నీ అపార కరుణకు కూడ నందకున్నాను.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మ వాత్సల్యాది కళ్యాణగుణములును,తన యొక్క దోషములును కూడ అసంఖ్యాకములే అయిననూ తాను భగవద్గుణములకు పాత్రుడు కాకుండుటను వివరించుచున్నారు.

**శ్రీరంగేశ! త్వత్ గుణానామ్ ఇవ అస్మత్**
**దోషాణామ్ కః పారదృశ్వా యతః అహమ్**
**ఓఘే మోఘోదన్యవత్ త్వత్ గుణానామ్**
**తృష్ణా పూరమ్ వర్షతామ్ న అస్మి పాత్రమ్** 94

**హే శ్రీరంగేశ= ఓం రంగనాథా!, త్వద్గుణానామివ= నీ గుణములవలె, అస్మద్దోషాణాం= మా దోషముల, పారదృశ్వా కః?=అంతమును చూచువాడు ఎవడు?, యతః అహం= ఎందువలన అనగా నేను, ఓఘే మోఘోదన్యవత్= వరదనీటిలో వ్యర్థపిపాసగలవానివలె, తృష్ణాపూరం వర్షతాం= ఆశనిండునట్లు వర్షించు, త్వద్గుణానాం పాత్రం= నీ గుణములు పాత్రమైనవాడను, నాస్మి= కాకపోతిని.**

ఓ రంగనాథా! నీ వాత్సల్య, సౌశీల్య, సౌందర్యాది కళ్యాణ గుణములు అనంతములు. అటులనే మా దోషములు కూడ అనంతములే. కాని నేను అమోఘముగా, నిరంతరమును వర్షించు నీ కళ్యాణగుణములకు వరద ప్రవాహమునందు కొట్టుకొని పోవుచున్న వ్యర్ధ పిపాసుని వలె పాత్రుడను కాలేక పోవుచున్నాను. (అనుత్తమమ్ పాత్రమిదమ్ దయాయాః ---స్తోత్రరత్నము). నేను ప్రాకృతిక విషయానుభవములయందు పూర్ణనిమగ్నుడనై నీ అపార కరుణా వర్షము నందు కొన లేక ( రాక్షసులు నర రక్తమును త్రావుచూ అమృత జలములను విస్మరించు విధమున) యున్నాను.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీ మాన్ పరాశర భట్టర్ స్వామి అవతార రహస్య జ్ఞానమును అనుగ్రహించుచున్నారు ఈ శ్లోకములో.

**త్వమ్ చేత్ మనుష్య ఆదిషు జాయమానః**
**తత్ కర్మపాకమ్ కృపయా ఉపభుంక్షే**
**శ్రీరంగశాయిన్! కుశల ఇతరాభ్యామ్**
**భూయః అభిభూయేమహి కస్య హేతోః** 95

**హే రంగశాయిన్= ఓ శ్రీరంగశాయీ!, త్వం కృపయా= నీవు దయతో, మనుష్యాదిషు= మనుష్య సజాతీయుడవుగా, జాయమానస్సన్= అవతరించుచు, తత్కర్మపాకం= వారి కర్మఫలమును ఉపభుస్ క్షే చేత్= అనుభవించు చున్నావు గదా! అట్లైనచో, కస్య హేతోః= ఏ కారణము చేత, కుశలేతరాభ్యాం= సుఖదుఃఖములు వలన కలుగు శుభాశుభములచే, భూయః= తరచుగా, అభిభూయేమహి= తిరస్కరింపబడుచున్నాము? (నీ దయను మించిన మా పాపములచే తిరస్కరింపబడుచున్నాము అని భావము)**

పరమాత్మ తనకు మనపై కృప వలన మనతో బాటు సామాన్య జన్మము ధరించి రామ కృష్ణాద్యవతారములయందు వలె సుఖదుఃఖాదులను, తనకేమియు కర్మానుభవము అవసరము కాకున్నను మన ఉద్ధారణకై అనుభవించును. హే రంగశాయిన్! అటులైన మాకు ఇంకను ఈ భవ సంబంధిత మైన సుఖ దుఃఖములు ఏల వీడుట లేదు.

(పరమాత్మ భగవద్గీత యందు 'బహూని మే వ్యతీతాని జన్మాని తవ చ అర్జున! తాన్యహమ్ వేద సర్వాణి న త్వమ్ వేత్థ' అనియు పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయ చ దుష్కృతామ్ ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి' అనియు తన అవతార రహస్యమును వివరించెను. పరమ కృపాళువై మనలను ఉద్ధరింప కంకణా బద్ధుడై అవతరించి కష్టముల భరించువపరమాత్మ కృపకు మనము పాత్రులము కాకుండుటకు కారణము భగవద్గీత యందు పరమాత్మ యే ' అజ్ఞః చ అశ్రద్ధధానః చ సంశయాత్మా వినశ్యతి' అనియు ఈ దుఃఖముల నతిక్రమించుటకు 'అపి చేత్ అసి పాపేభ్యః సర్వేభ్యః పాప కృత్తమః సర్వమ్ జ్ఞానప్లవేన ఏవ వృజినమ్ సంతరిష్యసి' అనియు అనుగ్రహించెను. అనగా మనము సంశయాత్ములమై, భగవత్పరతంత్రత లేక భగవానుని అపార కరుణకు పాత్రులము కాలేక పోవుచున్నాము. )

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మ క్షమాగుణమును ఈ శ్లోకమున కీర్తించుచున్నారు.

**క్షమా స అపరాధే అనుతాపిని ఉపేయా**
**కథమ్ స అపరాధే అపి దృప్తే మయి స్యాత్**
**తథా అపి అత్ర రంగాధినాథ! అనుతాప**
**వ్యపాయమ్ క్షమేత అతివేలా క్షమా తే** **96**

**హే రంగాధినాథ!= ఓ రంగనాథా!, సాపరాధే= అపరాధములను సహించుచు, అనుతాపిని= అనుతాపము గలవానియందు, క్షమా= క్షమాగుణము, ఉపేయా= పొందదగినది. సాపరాధేపి= అపరాధముతోనున్నను, దృప్తే= దర్పముతోనున్న(అనుతాపము లేని) మయి= నాయందు, కథం స్యాత్= క్షమను ఎట్లు పొందుచున్నావు? , అతివేలా తే క్షమా= ఉత్కృష్టమైన నీ క్షమాగుణము, అత్ర= ఈ నాయందు, అనుతాపవ్యపాయం= అనుతాపము లేకపోవుట, క్షమేత= సహించుగాక.**

హే శ్రీ రంగనాథా! అపరాధములు చేసి, తదనంతరము పశ్చాత్తాపము ప్రకటించి అనుతాపము పొందు వారికి క్షమా గుణము చూపుట క్షమాగుణము కలవారికి సహజము. నేను అనేకానేకములైన అపరాధములనొనర్చినవాడను. అయినను ఈషణ్మాత్రము పశ్చాత్తాపము లేక చేసిన తప్పులే మరల మరల చేయుచూ, అదియే ఘనకార్యమను తలంపున గర్వము తో నిండి యున్నాను. అట్టి క్షుద్రుడనైన నాపై నీ క్షమాగుణప్రసారమున కవకాశము లేదు. కాని ఎల్లలెఱుగని నీ అపార క్షమాగుణము అనుతాప హీనుడనైన నాపై కూడ నిర్హేతుకముగా ప్రసరించి నన్ను ఉజ్జీవింప చేయుటకు కారణమేమి? క్షమాగుణవిశిష్టత దోష సహిష్ణుత యే కదా! అనుతాప దారిద్ర్యము కూడ దోషమే అగుట చేసి తత్సహిష్ణుత కూడ నీ క్షమాగుణ లక్షణమై యొప్పుచున్నది కదా! (నా అనుతాప దారిద్ర్యమే పరమాత్మ క్షమాగుణమునకు విషయమైనదని భావము).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి పరమాత్మ క్షమాగుణ వర్ణనము ఈ శ్లోకమున కూడ అనుగ్రహించుచూ దానికి ఉత్తమ పాత్రను తానే అని పరిగణించు కొనుచున్నారు.

**బలిభుజి శిశుపాలే తాదృశాగస్కరే వా**
**గుణలవ సహవాసాత్ త్వత్ క్షమా సంకుచంతీ**
**మయి గుణపరమాణాదంత చింతానభిజ్ఞే**
**విహరతు వరదాసౌ సర్వదా సార్వభౌమీ** **97**

**హే వరద!= ఓం వరదా!, తాదృశాగస్కరే= అట్టి అపరాధములను చేయుచున్న, బలిభుజి= కాకాసురునియందును, శిశుపాలే వా= శిశుపాలుని యందుగాని, గుణలవసహవాసాత్= అత్యల్పమైన మంచి గుణముండుటచే, సంకుచన్తీ త్వత్ క్షమాగుణపరమాణాదన్త= కుంచించుకుపోయిన నీక్షమా(దయా)గుణలేశముండుట, చింతానభిజ్ఞే= చింతకూడ**

**తెలియని(లేని), మయి సర్వదా= నాయందు ఎల్లప్పుడును, సార్వభౌమీ=అంతటను ఉన్నటువంటిదై, విహరతు= ఉండుగాక.**

హే రంగనాథా! ఆశ్రిత వరదా! అసహ్యాపచారముల చేయుట యందు ఉదాహరణముగా కాకాసురుని, శిశుపాలుని పరిగణించెదరు. కాని వారి యందు కూడ కించిద్గుణవిశేషము కానదగును.(కాకాసురుడు ముల్లోకములను చుట్టి వచ్చి పరమాత్మను శరణాగతి చేసెను(స పిత్రాచ పరిత్యక్తః సురైశ్చ సమహర్షిభిః త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణమ్ గతః ). శిశుపాలుడు శ్రీకృష్ణుని దూషించినపుడు తన్నామోచ్చారణ నూఱు మారులు చేసెను. తత్ఫలితముగా నాతడు మోక్షము బడసెను. )
అందువలన వారియందు నీ క్షమాగుణపు గొప్పదనము సంకుచితమైనది. నీ క్షమాగుణ సార్థకత అత్యంత దోషయుక్తులను క్షమించినప్పుడు కదా! గుణలేశ శూన్యుల సార్వభౌముడను నేను. అట్టి నాపై నీ క్షమాగుణమెల్లప్పుడు ప్రసరించుచుండు గాక. ( అప్పుడే నీ క్షమా గుణ సార్థకత). స్తోత్ర రత్నమందలి 'అనుత్తమమ్ పాత్రమ్ ఇదమ్ దయాయాః' అనుశ్లోకము, తిరువాయ్ మొళి 3.2.6 పాశురము స్మర్యములు).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకమున పరమాత్మ దయా గుణమును ప్రశంసించుచూ తానెట్లు పరమాత్మ దయకు యోగ్యత పొందక యుండెనో తెలిపి తిరిగి యుక్తియుక్తముగా సమాధానము కూడ పరమాత్మయే స్వయముగా అవశ్యము తనపై దయను చూపించవలెననుచున్నారు.

**దయా పరవ్యసనహరా భవవ్యథా**
**సుఖాయతే మమ తత్ అహమ్ దయాతిగః**
**తథాపి అసౌ సుఖయతి దుఃఖమ్ ఇతి అతః**
**దయస్వ మాం గుణమయ రంగమందిర! 98**

**హే గుణమయ!= కల్యాణగుణములు ప్రచురముగా గలవాడా!, రంగమన్దిర!= శ్రీరంగవిమాననిలయా!, తే దయా= నీయొక్క దయాగుణము, పరవ్యసనహరా= ఇతరుల దుఃఖమును తొలగించునది, భవతి= అగుచున్నది. మమ భవవ్యథా= నాయొక్క సంసారదుఃఖము, సుఖాయతే= సుఖమగుచున్నది. యత్ కారణాత్= ఆ కారణము చేత, అహం దయాతిగః= నేను దయను అతిక్రమించుచున్నాను( దయను పొందలేకపోవుచున్నాను), తథాపి అసౌ= అటులైనను ఈ నేను, దుఃఖం సుఖయతి ఇతి= దుఃఖమును సుఖముగనే భావించుచున్నాడని, మాం దయస్వ= నన్ను దయజూడుము.**

'పర దుఃఖ అసహిష్ణుతా దయా' అనగా ఇతరుల దుఃఖము సహించలేక వారిని ఉద్ధరించు గుణము దయ. పరమాత్మ దయాగుణము అపారమైనది. అది ఆశ్రితులు, అనాశ్రితులు అను భేదము లేక ఆపన్నులను అందరను వారి దుఃఖముల నుండి ఉద్ధరించ చూచుచునే యుండును. కాని హే రంగమందిర! అట్టి నీ దయా గుణమునకు కూడ నేను దూరమైతిని. ఏల యన దుఃఖభాజనమైన ఈ సంసారమునే సుఖసాగరమని తలంచి ఇందులనే

కాలము నేను గడుపుతున్నవాడను. నేను దుఃఖము ననుభవించుచున్నట్లు నాకు తెలిసిన గదా ఆ దుఃఖనివృత్తికై నీ దయాగుణ ప్రసారము. నాకా దుఃఖవిచారమే లేదే! కావున నీవే స్వయముగా అతి కృపణజంతువైన నా పరిస్థితి విచారించి ఈ క్షుద్రుడు దుఃఖమునే సుఖమని భ్రమించి సంసారమునందు మగ్గుచున్నాడే! యని నాపై అవశ్యము దయాదృష్టి సారించవలెను.

ఈ సందర్భమున వేదాంతదేశికుల దయాశతకమున 'అశిథిల ధర్మ సేతు పదవీమ్ అధిగమ్య అమిత మహా ఊర్మి జాలమ్ భవ అంబునిధిమ్ అచిరాత్ అధిలంఘ్య (తవ) పదపట్టన నిత్య ధనీ భవతి' అను శ్లోకము స్మర్యము. (అనగా నీ దయ యున్నచో ఈ మహోర్మిజాల భరితమైన సంసార సాగరమును అవలీలగా దాటి నీపదము చేరగలవాడను)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకమునందు ఇతః పూర్వము యామునాచార్య స్వామి స్తోత్ర రత్నమున 'ధిగశుచిమవినీతమ్...' అను శ్లోకమునందు నైచ్యానుసంధానము చేసిన యట్లు తాను కూడ నైచ్యానుసంధానము చేయుచున్నారు.

**గర్భ జన్మ జ్రా మృతి క్లేశ కర్మ షడూర్మిగః**

**శ్వేవ దేవ వషట్కృతమ్ త్వామ్ శ్రియః అర్హమ్ అకామయే** 99

**గర్భజన్మజరామృతి= గర్భవాసము పుట్టుక, ముసలితనము మరణము, క్లేశ కర్మ షడూర్మిగః= కష్టము కర్మము అను ఆరు ఊర్ములను ( మానవులకు సంభవించు క్షుద్రానుభవములను) పొంది, అహం= నేను, శ్వా= శునకము (తనకు తగని), దేవవషట్కృతమివ= దేవతలకు అర్పింపబడు హవిస్సును (తనకు కావలెనని) కోరినట్లు, శ్రియః = లక్ష్మికి, అర్హం త్వాం= తగిన నిన్ను, అకామయే= (నేను)కోరితిని.**

హే శ్రీరంగనాథ! గర్భ, జన్మ, వార్ధక్య, మృత్యు, క్లేశ, కర్మ నామకమైన షడూర్మీ వికారాస్పదమైన సంసార సాగర నిమగ్నుడనైన నేను నీ వంటి పరమ పవిత్రమైన వస్త్వనుభవమునకై దురాశ కలిగి యుండుట శునకము ఓంకార, వషట్కారాదులతో స శాస్త్రీయముగా దేవతలకు చేయు యజ్ఞ హవిస్సును తిన జూచి నట్లు కదా! నీవు 'తుల్య శీల వయో వృత్తామ్ తుల్యాభి జన లక్షణామ్ రాఘువః అర్హతి వైదేహీమ్ తమ్ చ ఇయమ్ అసితేక్షణామ్' అనినట్లు 'శ్రీరిత్యేవచ నామ తే భగవతి' అనబడు సాక్షాత్ శ్రీమహాలక్ష్మీ వల్లభుడవు. అట్టి నిన్ను సమస్త సద్గుణ ప్రత్యనీకుడనైన నేననుభవింప కోరుకొనుట అత్యాశయే కదా!

= =

విష్ణు వంటి నాటి యువకుల కొఱకై ఱెండు చిన్న మాటలు. పెద్దలు క్షమించాలి.

ఈ సందర్భమున మన పూర్వాచార్యులు తమ నైచ్యానుసంధానమునకు అత్యంత ప్రాచుర్యము నిచ్చుట మితి మీరినదా! దాస్యభావము మన సిద్ధాంతమున నరనరాలూ, తరతరాలుగా పట్టుకు పోవడము వలననే మనము

విదేశీ పాలనలలో మగ్గ వలసి వచ్చినదా! ఇట్టి సిద్ధాంతము మన ఆత్మ న్యూనతను పెంచి మనలను కర్తవ్య విముఖులుగా, సోమరులుగా చేయునా! అని ఒక సంశయము. నిరాశాస్పదమైన శూన్యవాదము నుండి 'తత్త్వమసి' అని జీవుడిసే బ్రహ్మ గా నిర్ణయించి ఆదిశంకరుల అద్వైతవాదము అందిచ్చిన ఆత్మ స్థైర్యమును ఈ రకమైన ఆత్మ న్యూనతామూలకమైన భగవద్రామానుజ సిద్ధాంతము నాశనము చేయుటవలన మన వేదభూమి పరుల వశమైన దనియు, మరల వివేకానందాది వివేకుల వలననే మనయందు మరల మనకు ఆత్మవిశ్వాసము కలిగెనని ఇట్టి దాస్య భక్తియు, నైచ్యానుసంధానమును మన పురోభివృద్ధికి ఆటంకమని అందులకై ఇట్టి భావాలు లౌకికాభివృద్ధులన్నీ పూర్తి అయిన తరువాతనేనని మఱియొక తలపు. మనము ఏమి చేసినా అది మనకోసం కాదంటే అసలు పనినే చేయని పరిస్థితి వచ్చి ఇందువలననే మనమిలా అధోగతి పాలయినామని కొందరు ఆధునికుల మందలింపు. విశిష్టాద్వైతము నన్ను ముట్టుకోకు నామాలకాకి యని సామాన్యులకు దూరమైన సిద్ధాంతమని మఱి కొందరి అవ హేళన.

అసలు ఇదంతా వాస్తవంగా మన సిద్ధాంతము పట్ల సమంగా అవగాహన లేకపోవడంవలన.

1. మన సిద్ధాంతము నందు మనమెవరికి దాసులము. కేవలము శ్రీమన్నారాయణునికే. మరి వేరొక  మానవుల మాట అటుంచి ఏ దేవుళ్ళకీ కూడా కాదు. అందువలన మన సిద్ధాంతము పర దాస్యమును promote చేయలేదు. ఎటొచ్చీ సమస్తమూ శ్రీమనారాయణ తత్త్వమయమే కనుక ఆ సమస్తమునూ శాస్త్రోక్తంగా ప్రేమించి గౌరవించమనీ, రక్షించమని చెప్పింది.

2. నైచ్యాను సంధానము గురించి. మన అసామర్థ్యము మనము పరమాత్మ నుండి వేఱని తలుస్తే. మన సిద్ధాంతంలో మనకూ పరమాత్మకు అపృథక్సిద్ధ సంబంధము. అందుచే అఘటన, ఘటనా సామర్థ్యము గల పరమాత్మ తోనే మనమున్నప్పుడు మనకేమి భయము. ఆత్మ న్యూనత కవకాశమేలేదు. ఎటొచ్చీ ఆయనను మరవ కుండా ఉండడానికి ఆయన లేని మనకు స్వరూపమే లేదని మరల మరల గుర్తుచేసుకొనడానికే ఈ నైచ్యానుసంధానము. లేకున్న అహంకారము తలయెత్తి ఆత్మవినాశానికి దారితీస్తుంది.

3. మన సిద్ధాంతములో అందరు జీవుళ్ళు సమానములే, జ్ఞానాకారములే. భగవదాత్మకములే. వారి వారి కర్మ ఫలములను బట్టి ప్రవర్తన. అంతే. అందుచే ఇతరులను దూరము చేసే ప్రసక్తి గాని, అగౌరవించే పద్ధతి గాని మన సిద్ధాంతము చెప్పదు.

4. మన సిద్ధాంతము పని మానమనీ, ఫలితం ఉండదనీ చెప్పదు. ఆకాంక్ష, ఆలోచన, ప్రయత్నము(ఇచ్ఛా, జ్ఞాన, క్రియా మూలకాలు) లతో శాస్త్ర ప్రకారము మంచి కోసం చేస్తూనే ఉండాలి. ఆ పని వలన లౌకిక ఫలము వెంటనే నీకు రాకపోవచ్చు వేఱు వేఱు కర్మఫలాలననుసరించి. నీకీ లౌకిక ఫలాల గురించి కాక పరమాత్మ పదము కావలెనన్న మానసికంగా ఆ పనులను భగవదర్పితంగా చేయాలి అంతే. పని మానడం తప్పు మన సిద్ధాంతములో.

5. మన పురాణాలన్నీ సృష్టి కార్యము నుండి ప్రారంభమవుతాయి. సర్గశ్చ, ప్రతి సర్గశ్చ, వంశో, మన్వంతరానిచ....అని. సర్గ అంటే సృష్టి. అంటే అవి అన్నీ చెప్పేది ఈ లీలా విభూతి విషయాలు. దానిలో దేవుళ్ళూ

etc. పరమాత్మ పర స్వరూపమున తప్ప మిగిలిన స్వరూపాలతో లీలావిభూతిలో వివిధరకాలుగా మనలను అనుగ్రహిస్తూ ఉంటాడు. మనకు నిత్యవిభూతి వాసం కావాలంటే ఆయనే దిక్కు. ఇదీ మన సిద్ధాంతము.

సంక్షిప్తంగా వ్రాయడంవలన వివరాలు లుప్తమయినాయి. క్షంతవ్యుడను.

= =

This explanation is very apt. Today's humans have become materialistic and hence every action of this human being is totally getting self-centered. It is highly detrimental for the well-being of the human-being. Our Visishtadwaita is teaching to be working for the well-being of the whole universe, which ensures individual's well being also. This needs to be understood by today's humans.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి తాను చేయుచున్న నైచ్యాను సంధానము కూడ దంభముచే పూర్వాచార్యుల ననుకరించిట తప్ప హృదయపూర్వకమైనది కాదని తెలుపుచున్నారు.

**అనుకృత్య పూర్వ పుంసః రంగనిధే!**
**వినయడంభతః అముష్మాత్**
**శున ఇవ మమ వరమ్ బుద్ధేః**
**ఉపభోగః త్వత్ వితీర్ణాయాః** **100**

**హేపీ రఙ్గనిధే!= ఓం రంగనాథుడనే నిధీ!, పూర్వం పుంజం= పూర్వాచార్యులను, అనుకృత్య= అనుకరించు, శునః ఇవ= శునకము వలె, అముష్మాత్= వారు చెప్పిన శ్రీసూక్తులను వివరించుటచే కలుగవలసిన, వినయడమ్భతః= వినయమను దంభముచే, మమ= నాకు, త్వద్వితీర్ణాయాః= నీచేత ఇవ్వబడిన, బుద్ధేః= సాంసారిక మైన బుద్ధి యొక్క, ఉపభోగః= అనుభవము, వరమ్= శ్రేష్ఠము.**

హే రంగనిధే! నేను ఇపుడు పలుకుతున్న ఈ పలుకులు పూర్వపురుషులైన ఆళ్వారాచార్యుల ననుకరించి తప్ప హృదయ పూర్వకముగా కాదు. ఆ మహా పురుషులు పరిపూర్ణ భక్తి భావముతో త్రికరణ శుద్ధిగా పలికిన సూక్తులను దంభవినయము ప్రదర్శించుచూ శునకము వంటి జ్ఞానశూన్యమై క్షుద్రమైన నేను అసంపూర్ణముగా అనుకరించుచున్నాను. కాని దానికి బదులు నీవు నాకొసగిన ఈ తుచ్ఛమైన సాంసారిక అనుభవములే శ్రేష్ఠమేమో! (అనగా నిజాయితీ లేని నైచ్యాను సంధానము కన్న తుచ్ఛ సంసారానుభవములే నయమని భావనము).
(ఈ శ్లోకము మనలను మిక్కిలి ఆలోచింప చేస్తుంది. నిజాయితీ లేని భక్తి, శ్రద్ధలు, నైచ్యాను సంధానాలు ఎంత ఫలశూన్యములో తెలుస్తుంది ఈ శ్లోకములో).

= =

శునకము వలె అని మాత్రమే అని శ్లోకము. జ్ఞాన శూన్యత, క్షుద్రత్వము అనేవి వ్యాఖ్యానార్థాలు. తప్పయితే వివరించ ప్రార్థన

శునకం వలె అనటం తనయొక్క అతిహేయతని సూచించటానికే. వ్యాఖ్యాతల వాక్యం - "ఇయం వినయోక్తిరపి పూర్వాచార్యవచనవిడంబనాయ ప్రవృత్తా, తతోపి సాంసారిక సుఖానుభూతి ఏవి అతిహేయస్య మమోచితా ఇతి సదృష్టాంతమాహ- అనుకృత్య ఇతి".

సంస్కృతవాక్యానికి అర్థం - "ఈవినయాన్ని చూపించే మాట కూడా, పూర్వాచార్యుల మాటలను అనుకరించటానికే చెప్పబడింది. అందుచేతకూడా సాంసారిక సుఖానుభూతియే అతిహేయుడనైన నాకు తగినది అని దృష్టాంతంతో చెప్పుతున్నారు".

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకమునందు పరమాత్మ రామావతారమున విభీషణ శరణాగతి సందర్భమున పలికిన అభయ ప్రదాన వాక్యముల స్మరించుకొని తన అహంకారమును పరమాత్మ యందు తన విశ్వాస హీనత్వమును ప్రకటించు కొను చున్నారు

**సకృత్ ప్రపన్నాయ తవ అహమ్ అస్మి ఇతి**
**ఆయాచతే చ అభయదీక్షమాణమ్**
**త్వామ్ అపి అపాస్య అహమ్ అహమ్ భవామి**
**రంగేశ! విస్రంభ వివేకరేకాత్** **101**

**హే రఙ్గేశ!= ఓం రంగనాథా! సకృత్= ఒక్కసారి, ప్రపన్నాయ= ప్రపత్తిని అనుష్ఠించినవానికి, తవాహమస్మి ఇతి= నేను నీవాడనుగా నున్నాను అని, ఆయాచతే చ= యాచించువానికిని, అభయదీక్షమాణం= అభయప్రదానముకొరకు సంకల్పించినట్టి, త్వామపి= నిన్ను కూడ, విస్రంభవివేకరేకాత్= విశ్వాసజ్ఞానము లేకపోవుటచే, అపాస్య= ఇతడు రక్షకుడు అని విశ్వసించక, అహం అహం= నేను అహంకరించినవాడను (స్వతంత్రించినవాడను), భవామి=అగుచున్నాను.**

(మన పూర్వాచార్యులు ' ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్ రక్ష్యత్యతీతి విశ్వాసః గోప్తృత్వవరణమ్ తథా ఆత్మ నిక్షేప కార్పణ్యే షడ్విధాశరణాగతిః' అని శరణాగతి నియమములను నిర్వచింతురు. అందు పరమాత్మ యందు మనకు అచంచల విశ్వాసమును, ఆకించన్యత్వ అనన్యగతిత్వములు మిక్కిలి ముఖ్యములు).

హే రంగనాథా! నీవు రామావతార సందర్భమున దక్షిణ సముద్రతీరమున రావణానుజుడైన విభీషణుడు శరణాగతి చేసినపుడు సుగ్రీవునితో 'సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే అభయమ్ సర్వ భూతేభ్యః దదామి ఏతత్ వ్రతమ్ మమ' అని 'ఒక్క సారి నీ వాడను అని ఎట్టి ప్రాణి అయినను (జీవమయినను) కోరినచో అభయమీయుట నా వ్రతము
లేకున్న నాకు వ్రత భంగమగునని' నుడివితివి. నేను నీ యందు లేశమాత్రము విశ్వాస భావము లేక అహంకరించి నీవంటి ఉత్కృష్ట రక్షకుని ఆశ్రయణమును వీడితిని కదా!

'ఆనందమ్ బ్రహ్మణః విద్వాన్ న బిభేతి కుతశ్చన' అని కదా శ్రుతి వచనము.
పరాశర భట్టర్ స్వామి రంగనాథుని తిరుమంజన వర్ణనము చేయుచూ పలికిన 'త్వమ్ మే అహమ్ కుతః తత్.....త్వమ్' అను శ్లోకము ఇచట స్మరణీయము.
ఈ శ్లోకమున మనకు శరణాగతి సమయమున ఏ దోషములుండరాదో భట్టర్ స్వామి అనుగ్రహించేరు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ శ్లోకమున తనకు గల పూర్వాచార్య సంబంధమును పరమాత్మకు విన్నపించి తత్సంబంధ కారణముగా తనను స్వీకరింప ప్రార్థించుచున్నారు.

**తవ భరోహమ్ అకారిషి ధార్మికైః**

**శరణమ్ ఇతి అపి వాచమ్ ఉదైరిరమ్**

**ఇతి ససాక్షికయస్ ఇదమ్ అద్య మామ్**

**కురు భరమ్ తవ రంగధురంధర!** **102**

**హే రంగధురంధర! = ఓ రంగనాథా!, అహం= నేను, ధార్మికైః= పరమదయాళువులైన ఆచార్యులచే, త్వం భరోఅకారిషి= నీయందే భారముపేసినవాడినిగా చేయబడితిని. శరణం ఇతి వాచమపి= శరణ్యమని వాక్కును, ఉదైరిరమ్= చెప్పితిని, ఇతి ఇదం= అను దీనిని, ససాక్షికయస్=సాక్షితో కూడినది గా పరామర్శించుచు, అద్య మాం తవ భరమ్=మంచి ప్రవృత్తిగల పూర్వాచార్యులవలె ఇపుడు నన్ను నీకు భారముగా, కురు= చేయుము.**

హే రంగ ప్రభూ! పరమ ధార్మికులైన మా పూర్వాచార్యులచే నాదు భారము నీ చరణ కమలముల సమర్పితమైనది. (అనగా నా ప్రమేయము లేకున్నను). అందుచే నీవే నాకు ప్రాపక, ప్రాప్యములు రెండును అయి యున్నావు. అంతేకాక (వారిననుకరించి) నేను (త్వమేవ శరణమ్ మమ యని) శరణ శబ్దోచ్చారణ కూడ నాచే చేయబడినది. ఆ పూర్వాచార్యులే (శరణ శబ్దోచ్చారణ నాచే చేయించుటచే) ఆ శరణశబ్దోచ్చారణకు వారలే సాక్షులై యున్నారు. అందుచే నీవు (వారిని వలె) నా భారము కూడ స్వీకరించి నీ శేషభూత వస్తువుగా నన్ను పరిగణించవలెను.

ఇచట భట్టర్ స్వామి ఆకించన్యత్వము, ఆచార్య ప్రతిపత్తి, భాగవత భక్తులతో బాటు ఆయన చమత్కారము కూడ చూడనగును.

ఈ సందర్భమున భట్టర్ స్వామి విషయమున జరిగిన ఒక సంఘటన జ్ఞప్తికి వచ్చును. స్వామి రంగనాథుని ముందు స్తోత్ర రత్నమునందలి 'అమర్యాదః క్షుద్రః .....' అను శ్లోకము విన్నవించు సందర్భమున ఆయనపై అసూయ గల వేరొక స్వామి వీరు పలికిన ప్రతి పదమునకు పరిహాసమునకు ' ఊఊ ' అనుచు ఊ కొట్టిరట. అంతట భట్టర్ స్వామి రంగనాథునితో రంగనాథా! నా ఆకించన్యత్వమునకు ఒక భాగవతోత్తములు సాక్ష్యము పలుకు చున్నారు కనుక నన్ను తప్పక స్వీకరించవలెనని పలికిరట.

స్తోత్ర రత్నము నందలి 'పితామహమ్ నాథమునిమ్ విలోక్య ప్రసీద...' అను శ్లోకము ఇచట స్మరణీయము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ప్రస్తుత శ్లోకమునందు పరమాత్మ క్షమా, దయా, ఔదార్య గుణములను నిందాస్తుతి రూపమున స్తుతించుచున్నారు. (అనగా బాహ్యముగా నిందగా కన్పించు స్తుతి యని అర్థము).

**దయాన్యేషామ్ దుఃఖాప్రసహనమ్ అన్యః అసి సకలైః**

**దయాలుః త్వమ్ నాతః ప్రణమదపరాధాన విదుషః**

**క్షమా తే రంగేందో! భవతి నతరామ్ నాథ! నతమామ్**

**తవ ఔదార్యమ్ యస్మాత్ తవ విభవమ్ అర్థిస్వమమథా.** 103

**హే రఙ్గేన్దో= ఓ రంగనాథా! అన్యేషాం= ఇతరుల యొక్క, దుఃఖాప్రసహనం= దుఃఖమును సహించలేకపోవుట, దయా= దయ, త్వం= నీవు, సకలైః= అందరితోడను, అనన్యోసి= అభిన్నుడవు. అతః= అందుచేత, త్వం దయాలుః న= నీవు ఇతరుల దుఃఖమును సహింపలేని దయగలవాడవు కావు. ప్రణమదపరాధాన్= నమస్కరించువారి అపరాధములను, అవిదుషః= వారి దోషములను లెక్కింపనీయని వాత్సల్యము గలవాడవు. తే క్షమా నతరాం= నీకు క్షమ సుతరాం లేదు. త్వం వైభవం= నీ వైభవము అర్థిస్వం (ఇతి)= అర్థించువారికే శేషభూతమని, అమథాః= తలంచితివి.**

పరమాత్మకు క్షమా, దయా, ఔదార్య గుణములు గలవని చెప్పుదురు. పరుల అపరాధ సహిష్ణుత క్షమ. పరదుఃఖ అసహిష్ణుత, తత్కారణానుప్రాణిత పర దఃఖ నివారణా, రక్షణా కార్య కారుణ్య విశేషము దయ. పరులకు కావలయు నర్థములనొసగు గుణము ఔదార్యము.

కాని హే రంగ ప్రభో! ప్రపంచమున ప్రత్యేక వస్తువు నందు అపృథక్స్థితిలో నీవు విరాజమానుడవై యుందువు. కనుక నీకు పరులెవ్వరు? నీవు నీ భక్తుల అపరాధములను తెలియనప్పుడు (అవిజ్ఞాతా హి భక్తానామ్ ఆగస్సు కమలేక్షణః) వారిని క్షమించుట ఎట్లు? (విష్ణు సహస్ర నామముల యందలి అవిజ్ఞాతా అను నామము ఈ విషయము తెలుపును) కనుక నిన్ను క్షమాశీలునిగా నెట్లు వర్ణింపగలము. నీవు నీ విభూతులు నీ భక్తుల సొత్తు కదా. (నీవు వాటిని నీ భక్తుల కెప్పుడో సమర్పించితివి కదా! ఈ విషయమే కూరేశులు వరద రాజ స్తవమునందు 'వరద! సకలమ్ ఏతత్ సంశ్రితార్థమ్ చకర్థ' యని అనుగ్రహించిరి. భగవద్రామానుజులను ఉభయ విభూతి నాథుని చేసి కృష్ణమాచార్య స్వామికి ఆ విషయమును స్వయముగా తెలిపితివి కదా). నీ వైభవములు నీ భక్త పరాధీనమైనపుడు నీవే అందరిలో చేరి యున్నపుడు నీకెట్లు ఔదార్యము సంభవము. కనుకనే నీవు భగవద్గీత యందు నీ భక్తులను 'ఉదారాః సర్వ ఏవ' అని పలికితివి . 'సర్వమ్ ఖలు ఇదమ్ బ్రహ్మ', 'ఐతదాత్మ్యమ్ ఇదమ్ సర్వమ్' , 'తత్త్వమసి', 'బహుస్యామ్ ప్రజాయేయ', అని సకల శ్రుతులు నీ స్వరూపము అన్ని చేతనా, చేతనములయందు అను ప్రవేశము చేసి యుండునని కంఠరవేణా ఘోషించుచుండ నీ దయాగుణము ఎవరిని రక్షించుటకు. నీకు నువ్వే సహాయము చేసికొనిన, కారుణ్య ప్రదర్శనము చేసికొనిన దానినెట్లు దయ యనగలము.

కనుక నీ క్షమా, దయా, ఔదార్య గుణములు ప్రదర్శనీయములు కావు.

==

[8:02 AM, 3/26/2017] Ramam Mamayya: సీతక్క ఆదేశము మేరకు, రుక్మిణి పంపిన విషయము అర్థము చేసుకొనడానికి ప్రయత్నిస్తాను. ఈ విషయము భగవద్గీత లో సాంఖ్య యోగము 2 వ అధ్యాయమును కొంతవరకూ మాత్రమే అర్థము చేసుకొనిన వారు పంపినట్లున్నది. మన సిద్ధాంతములో ఆత్మ జ్ఞానైకారము, జ్ఞాత. జ్ఞాన ప్రసారము మనస్సు ద్వారా ఇంద్రియాల ద్వారా జరుగుతుంది. మనస్సునందలి పాత వాసనల వలన(పాత జన్మలవి కాని, ఈ జన్మవి కాని ) ఈ జ్ఞాన ప్రసరణమున సత్యమును విస్మరించుటకు, తెలియకుండుటకు అవకాశమున్నది. అందువలన జీవుడు సత్యము తెలియక తన దేహమే తానుగా భావించి అహంకార, మమకారములతో ప్రాకృతిక విషయముల యందాసక్తి కలిగి తాను పరమాత్మకు శేషభూతుడను జ్ఞానము మఱచి విషయ లోలుడై ప్రవర్తించును. అట్లు కాక ఆత్మ స్వరూపము తెలిసిన నాడు ఆత్మ లక్షణములైన జ్ఞాన, నిత్యత్వ, స్వయంప్రకాశకత్వ, చైతన్య, భగవత్ శేషత్వాదులను జీవుడు తెలిసి కొనును. ఇచట అచల అంటే బహుశః విషయములయందు అచాంచల్యము. అనగా మనమేమి చేసినను అంతా పరమాత్మకేనని తెలిసిన తరువాత మనకొఱకు కాదని తెలిసిన తరువాత తత్సంబంధిత సాధన వలన ఆ విషయ చాంచల్యము తగ్గుతుంది. ఆ పరమాత్మ అనుగ్రహమైతే మనసునందలి వాసనల influence కూడా తగ్గుతుంది. పరమాత్మ యందు అభిరుచి పెరుగుతుంది. మనమేమి చేసినా పరమాత్మ పరంగా చేయడం ప్రారంభిస్తాము. ఏదీ మనకోసం కానప్పుడు సుఖ దుఃఖాలు, జయాపజయాలు కూడా మనవి కావు అన్నీ పరమాత్మ పరములు. కాని ప్రాకృతికమైన దేహ సంబంధమున్నంతవరకు వాటి అనుభవము తప్పదు. ఈ నిజము తెలిసి వాటిని కూడ పరమాత్మానుగ్రహముగానే ఓర్చుకోవాలి. మన సిద్ధాంతములో ఆత్మ జ్ఞాత. ఆత్మతో సాంగత్యము అను పదము పూర్తిగా సరి అయిన పదము కాదు. కనుక మనమిక్కడ పరమాత్మతో (ఆత్మకు) సాంగత్యము అని అర్థము చేసుకోవాలి. పరమాత్మతో సాంగత్యము కలిగిన నాడు ఆయన కైంకర్యమునందు నిత్య, నిరవధిక ఆనంద స్థితిలో జీవుడుంటాడు.

మన సిద్ధాంత ప్రాతిపదిక విషయాలు తెలియ చేయుటకు మన పెద్దలు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అది అందరూ అర్థము చేసుకుంటే బాగుంటుంది. లేకుంటే వారిని బాధ పెట్టిన వారమవుతాము. అందులకై మనమందరమూ ఆ ప్రయత్నము చేద్దాము.

==

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి వెనుక శ్లోకమున పరమాత్మ యొక్క క్షమాది గుణములను వ్యాజ స్తుతి రూపములో స్తుతించి ఈ శ్లోకమునందు పరమాత్మ కల్యాణగుణములతో తనను నీచ స్థితినుండి ఉద్ధరించ వలెనని ప్రార్థించుచున్నారు.

**గుణతుంగతయా రంగపతే!**

**భృశనిమ్నమ్ ఇమమ్ జనమ్ ఉన్నమయ**

**యత్ అపేక్ష్యమ్ అపేక్షితుః అస్యహి తత్**

**పరిపూరణమ్ ఈశితుః ఈశ్వరతా** 104

**హే రఙ్గపతే= ఓం రంగనాథా!, గుణతుఙ్గతయా= దయ క్షమ ఔదార్యము మొదలగు గుణముల ఔన్నత్యముచే, భృశనిమ్నం= అత్యంతము నీచుడైన, ఇమం జనం= ఈ వీనిని, ఉన్నమయ= ఉన్నతునిగా ( నిత్యముక్తతుల్యునిగా నీ పాదములకు సేవచేయువానిగా) చేయుము. అపేక్షితుః= అపేక్షించువానియొక్క, యదపేక్ష్యమస్య= కోరిక ఏది గలదో, తత్పరిపూరణం= దానిని పూర్తిగా అనుగ్రహించుట, ఈశితుః= ఈశ్వరుని యొక్క, ఈశ్వరతా= ఈశ్వరత్వము గదా!**

హే రంగపతే! నీవు క్షమాది గుణములచే మహోన్నతుడవు. గుణహీనుడనైన నేను చాల నీచుడను. అట్టి సర్వేశ్వరుడవైన నిన్ను, అత్యంత ఉన్నతమైన నీ కల్యాణ గుణములచే నాకు నిత్యముక్తాదులకు వలె నీ నిత్య కైంకర్యప్రాప్తిని కలిగించ యాచించు చున్నాను. అపేక్షితుల కోర్కెలు తీర్చుట నీ సర్వేశ్వరత్వమునకు తగి యుండును కదా.( లేకున్న నీ సర్వేశ్వరత్వమునకు కళంకము కలుగును). కనుక నీవు నాపై నీ వాత్సల్యాది కల్యాణగుణములను చూపి నన్ను నా నీచ స్థితి నుండి ఉద్ధరించి నీ సర్వేశ్వరత్వమును చరితార్థము చేసికొనుము.

= = = = = = = = = = = = = = = = = == = = = = = = = = == = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీమాన్ పరాశర భట్టర్ స్వామి ఈ స్తవ ఉప సంహార శ్లోకమునందు తన (మన) యథార్థ స్థితి గూర్చి పరమాత్మ కు తాను కర్మ, జ్ఞానాది అన్యోపాయములను ఎఱుగని వానినని, అట్టి తనను ఉద్ధరించుటయే పరమాత్మ గుణములకు సార్థకత యని విన్నవించుచున్నారు.

**త్వమ్ మీన పానీయ నయేన కర్మ**

**ధీభక్తి వైరాగ్య జుషః బిభర్షి**

**రంగేశ! మామ్ పాసి మితమ్ పచమ్ తత్**

**పానీయ శాలమ్ మరుభూషు తత్ స్యాత్** 105

**హే రఙ్గేశ= ఓ రంగనాథా!, త్వం కర్మ ధీభక్తి వైరాగ్య= నీవు కర్మయోగ జ్ఞానయోగ భక్తియోగ ప్రపత్తులు అనెడి నాలుగు విధములైన ఉపాయములను, జుషః= అనుసరించువారిని, బిభర్షి= భరించుచున్నావు. మీనపానీయనయేన= నీటిలో సంచరించువాటికి తిరిగి జలమును ఇచ్చుటవలె, ( కర్మల యొక్క సహజమైన భగవత్కైంకర్యరూపత్వముచే ఆ కైంకర్యమును చేయువారికి ఇంకను కైంకర్యమును చేయుటను ప్రసాదించుటవలె), మితం పచం మాం అపి= క్షుద్రుడనగు నన్ను కూడ, (కర్మాదిచతుష్టయమును పాటించని నన్ను కూడ,), పాహి ఇతి యత్= రక్షించుచున్నావు అని ఏది కలదో, తత్ మరుభూషు= అది మరుభూములయందు, పానీయశాలం స్యాత్= చలివేంద్రమే యగును.**

హే రంగరాజ! నీవు కర్మ యోగ, జ్ఞాన యోగ, భక్తి యోగ, ప్రపత్తులను అనుసరించు వారిని ఉద్ధరించుచున్నావు. అది సాగరమున తిరుగాడు జలచరముల దప్పికకై నీరందిచ్చి నట్లు గదా. అట్టివారు వారి వారి కర్మాది

యోగములచే నీ కైంకర్య పొందుచునే ఉజ్జీవించుచుందురు. ఆకించన్యత్వ, అనన్య గతిత్వములతో అన్యోపాయములనెఱుగని నన్ను రక్షించుట మరుభూములయందు దప్పిక కలిగిన వానికి చలివేంద్రమువలె అత్యంత సార్థకమగును. కావున హే రంగరాజ! నన్ను నీవు కృప జూడుము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆ రంగనాథుని అనుగ్రహము చే ఆచార్యుల మంగళాశాసనములచే రంగరాజ స్తవము రంగనాథుని తిరు నక్షత్ర దినమునకు సంపూర్ణమైనది.

సర్వమ్ శ్రీరంగనాథార్పణమ్.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =